www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 21-9-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 157 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య రా.1:23 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పుబ్బ ఉ.9.32 తదుపరి ఉత్తర; వర్జ్యం: సా.5:17-7:01; దుర్ముహూర్తం: సా.4:32-5:20; అమృతఘడియలు: తె.3:38-5:21; రాహుకాలం: సా.4:30-6:00; సూర్యోదయం: 6:07, సూర్యాస్తమయం: 6:08 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

డాలర్ డ్రీమ్స్ ధమాల్!

హెచ్1 బాంబు!

వీసా దరఖాస్తు రూ.90 లక్షలు.. భారతీయ నిపుణులపై ట్రంప్ అంకుశం

- అధ్యక్ష హోదాలో ఉత్తర్వుపై సంతకం
- అమెరికాకు రూ.9 లక్షల కోట్ల ఆదాయం
- హెచ్1బీ లబ్ధిదారుల్లో 71% భారతీయులే
- సగటు జీతమే లక్ష డాలర్లు ఉండదు
- ఏడాదికోసారి లక్ష డాలర్లు చెల్లించాల్సిందేనా?
- హెచ్1బీ కోసం కంపెనీ అంత భరిస్తుందా?
- గ్రీన్‌కార్డు దరఖాస్తు తర్వాతా చెల్లించాల్సిందే
- హెచ్1బీ ముగిసిందంటే గుండెల్లో రైళ్లే
- కంపెనీకి బరువనిపిస్తే ఉపాధికే ఎసరు
- నేటి నుంచే అమల్లోకి వీసా రుసుము
- విదేశాల్లో ఉన్న వాళ్లు అమెరికాకు పరుగులు
- భారత్‌కు పండగల ప్రయాణాలూ రద్దు
- వీసా స్టాంపింగ్‌కు వచ్చిన వాళ్లు
- లక్ష డాలర్లు కట్టినట్లు రుజువు చూపాల్సిందే
- కంపెనీ చెల్లించకపోతే భవిత గల్లంతే
- అత్యంత ప్రతిభావంతులకే అవకాశం
- అమెరికా వాణిజ్య మంత్రి వ్యాఖ్య
- తెలుగు రాష్ట్రాల నుంచే 35 వేల మంది
- స్టూడెంట్ వీసాదారులపైనా తీవ్ర ప్రభావం



వాషింగ్టన్, సెప్టెంబరు 20: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ ఐటీ నిపుణులపై ఆటంబాంబు పేల్చారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మధ్య తరగతి కుటుంబాల్లో భారీ సంక్షోభం సృష్టించారు. అమెరికాలో ఐటీ, ఇతర ప్రత్యేక నైపుణ్య ఉద్యోగాలు చేయడానికి అవసరమైన హెచ్1బీ వీసాలకు కొత్తగా లక్ష డాలర్ల ఫీజును ప్రకటించారు. అంటే, దాదాపు 90 లక్షల రూపాయలు. ప్రస్తుతం హెచ్1బీ దరఖాస్తుకు చెల్లిస్తున్న రెండు వేల డాలర్ల నుంచి ఐదు వేల డాలర్ల ఫీజుకు ఇది అదనం. ప్రస్తుతం అమెరికాలో భారతీయుల సగటు వేతనమే లక్ష డాలర్లు లేదు. అలాంటి కొలువు కోసం ప్రతీ హెచ్1బీ దరఖాస్తుతో పాటు లక్ష డాలర్లు చెల్లించాల్సిందే. అదీ అభ్యర్థిని ఎంచుకుని హెచ్1బీకి స్పాన్సర్ చేస్తున్న కంపెనీయే చెల్లించాలి. లక్ష డాలర్ల ఫీజును జత చేయనిదే హెచ్1బీ దరఖాస్తును పరిశీలించరు. లక్షడాలర్లు చెల్లిస్తేనే హెచ్1బీ బతికి ఉంటుంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వుపై

మిగతా 2వ పేజీలో...

మన అతిపెద్ద శత్రువు.. 12

ఇతర దేశాలపై ఆధారపడటమే!

- ఆత్మనిర్భరతే ఏకైక పరిష్కారం
- చిప్స్ నుంచి షిప్స్ వరకు స్వదేశీ ఉత్పత్తులకు పెద్దపీట వేయాల్సిందే
- గుజరాత్ పర్యటనలో మోదీ

అమెరికాతో సంప్రదింపులు 2

- సమస్య పరిష్కారానికి కసరత్తు
- అక్కడి ఐటీ కంపెనీలూ సర్కారుతో చర్చలు జరుపుతున్నాయి: కేంద్రం
- వాణిజ్య చర్చల కోసం అమెరికాకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

మళ్లీ చెబుతున్నా.. 2

మోదీ బలహీన ప్రధాని!

- విదేశాల్లో భారతీయుల ప్రయోజనాల్ని కాపాడలేకపోతున్నారు: రాహుల్
- మోదీ ప్రియమిత్రుడి నుంచి అందిన గిఫ్ట్: ఖర్గే
- తన గొంతు తానే నులుముకుంటోన్న అమెరికా
- కొత్త తరం ఆవిష్కరణల కేంద్రంగా బెంగళూరు, హైదరాబాద్ మారుతాయి: అమితాబ్‌కాంత్
- భస్మాసురహస్తం: అమెరికా చట్టసభల సభ్యులు

సంక్షేమమా.. సంక్షోభమా?



..రాజకీయ పార్టీలు బాధ్యతను విస్మరించి అధికారం కోసం పోటీపడుతూ... అపర దానకర్ణుల వలె ప్రజాధనాన్ని పప్పు బెల్లాల్లా పంచిపెట్టడానికి పోటీపడటంతో రెండు రాష్ట్రాలూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి.

...ఏదో ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం కోసం లేదా ఎవరో ఒకరు ముఖ్యమంత్రి కావడం కోసం సంక్షేమం పేరిట అలవికాని పథకాలను ప్రకటిస్తూ తెలుగు రాష్ట్రాలను దివాలా తీయిస్తున్నారు. కొంతమేరకు భారతీయ జనతా పార్టీని మినహాయిస్తే, మిగతా ప్రధాన రాజకీయ పార్టీలన్నింటికీ ఈ పాపంలో భాగం ఉంది.

...తెలంగాణలో కేసీఆర్‌నుగానీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రెడ్డినిగానీ సంక్షేమ పథకాలు కాపాడలేదు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024లో 'సూపర్ సిక్స్' పేరిట సరికొత్త హామీలు ఇచ్చారు.

...అన్ని రకాల సంక్షేమ పథకాలకూ తెల్ల రేషన్ కార్డుతో ముడిపెట్టడం వల్లనే వాటికోసం జనం ఎగబడుతున్నారు. ఈ కార్డు కింద పంపిణీ చేస్తున్న బియ్యం రీ సైకిల్ అవుతున్న విషయం బహిరంగ రహస్యం. అయితే, తెల్ల రేషన్ కార్డుల ఏరివేతకు పూనుకుంటే రాజకీయంగా మూల్యం చెల్లించవలసి వస్తుందని ఏ రాజకీయ పార్టీ కూడా అందుకు సాహసించడం లేదు.

..సంక్షేమ పథకాల పేరిట డబ్బు పంచిపెట్టినంత మాత్రాన ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తున్నారా? అంటే అదీ లేదు! ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ ప్రజలకు డబ్బు పంచుతున్నాయి. అయితే, ప్రజలు మాత్రం తాము అనుకున్న వారికే ఓటు వేస్తున్నారు. ఇరు పార్టీలూ డబ్బు ఇచ్చాయి కదా అని సగం ఓట్లు ఒకరికి, మిగతా సగం ఓట్లు మరొకరికి వేయడం లేదు.

కొత్త పలుకు | ఆర్కే విశ్లేషణ 4లో..



మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే

- 40 ఏళ్ల సినీ ప్రస్థానం
- 400కు పైగా చిత్రాల్లో నటన
- 2001లో పద్మశ్రీ, 2019లో పద్మభూషణ్ 12

అప్పుల ఊబిలో రాష్ట్రాలు! 14

- దశాబ్దంలో మూడురెట్లు పెరిగిన రుణభారం
- 59.60 లక్షల కోట్ల అప్పులతో కుంగుబాటు
- ఆందోళన వ్యక్తం చేసిన కాగ్

చెత్త రాజకీయాలను ఊడ్చేస్తా

- రౌడీయిజం, నేరాలు చేస్తే ఊరుకునేది లేదు
- పల్నాడులో సీఎం చంద్రబాబు హెచ్చరిక
- మాచర్లలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం
- 2026 జూన్‌కు ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్
- ఉద్యమంలా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
- స్వచ్ఛాంధ్ర సేవలో ఐదు కోట్ల మంది భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పిలుపు
- చెరువు వద్ద చీపురు పట్టి చెత్త తొలగింపు



మాచర్లలో చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తను చీపురుపట్టి ఊడుస్తున్న సీఎం చంద్రబాబు

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వదిలేసిపోయింది. చెత్తపై పన్ను వేసింది. మేం అధికారంలోకి రాగానే చెత్తపన్ను తొలగించాం. ఆ చెత్తను క్లీన్ చేసే బాధ్యతను తీసుకున్నాను. రాష్ట్రంలో చెత్తనే కాదు, చెత్త రాజకీయాలనూ క్లీన్ చేస్తా. రౌడీయిజం, నేరాలు, ఘోరాలు చేస్తే ఊరుకునేది లేదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. శనివారం పల్నాడు జిల్లా మాచర్లలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. మాచర్ల చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ కార్మికులతో కలసి చీపురు పట్టి తొలగించారు. ఈ సందర్భంగా జరిగిన

మిగతా 13వ పేజీలో...

హెచ్1 బాంబు!

(మొదటి పేజీ తరువాయి)



శుక్రవారం సాయంత్రం(అమెరికా కాలమానం ప్రకారం) సంతకం చేశారు. అది ఈ నెల 21 నుంచి ఏడాది పాటు అమల్లో ఉంటుంది. ఆ తర్వాత దాన్ని పొడిగించాలా? వద్దా అన్నది అప్పటికి సమీక్షించి, నిర్ణయిస్తారు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఇప్పటికే హెచ్1బీ వీసా పొంది అమెరికాలో ఉద్యోగం చేస్తూ వీసా రెన్యువల్ కోసం అమెరికా గడ్డను దాటి స్వదేశం వచ్చిన వాళ్లు న్యూయార్క్ కాలమానం ప్రకారం సెప్టెంబరు 20 అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత అమెరికా గడ్డమీద తర్వాత అడుగు పెట్టాలంటే వాళ్ల పని చేస్తున్న కంపెనీ లక్ష డాలర్లు హెచ్1బీ వీసా ఫీజు చెల్లించాల్సిందే. లేదంటే ఇంటికి వెళ్లాల్సిందే. ఇమ్మిగ్రేషన్‌లో దాన్ని పరిశీలించి కానీ లోపలికి వదలరు. హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు, పిల్లలకు హెచ్4 వీసా ఇస్తారు. కొత్తగా వీసా స్టాంపింగ్ చేయించుకున్న వాళ్లు సెప్టెంబరు 21 తర్వాత అమెరికా వెళ్లాలి అన్నా ఇమ్మిగ్రేషన్ వద్ద భర్త/తండ్రి పని చేస్తున్న కంపెనీ లక్ష డాలర్ల ఫీజు చెల్లించినట్లుగా ఆధారం చూపించాలి. చూపించలేకపోతే ఆపేస్తారు. వ్యాలిడ్ వీసా ఉన్నప్పటికీ కొత్త ఆదేశాల నేపథ్యంలో ఇమ్మిగ్రేషన్ వద్ద గందరగోళానికి అవకాశం ఉంటుంది కాబట్టి, చాలా కంపెనీలు తమ ఉద్యోగులను అమెరికా వదిలి వెళ్లొద్దని చెబుతున్నాయి. తాజాగా ట్రంప్ ఆదేశం వెలువడగానే 29 గంటల డెడ్‌లైన్‌ను ఉపయోగించుకొని విదేశాల్లో ఉన్న తమ ఉద్యోగులను ఏదో ఒక మార్గంలో తిరిగి వచ్చేయాలని అత్యవసర సందేశాలు పంపాయి. దాంతో విమానాశ్రయాల వద్ద రద్దీ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో సక్రమ వీసాలు ఉన్నవారిని ఆపేది లేదని, కొత్తగా వీసా రెన్యువల్ చేసుకొని వచ్చే వాళ్లకే లక్ష డాలర్ల నిబంధన వర్తిస్తుందని అమెరికా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అమెరికాలో ఉంటున్న ఇతర దేశాల హెచ్1బీ ఉద్యోగులకు దేశంలో ఉన్నంతకాలం కొత్త ఫీజు భారం ఉండదు. మూడేళ్ల గడువు పూర్తయి హెచ్1బీ రెన్యువల్‌కు వెళితే మాత్రం మళ్లీ ఏటా లక్ష డాలర్ల ఫీజు భారం తప్పదు. హెచ్1బీ ఆరేళ్లు పూర్తయి గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లకు కంపెనీలు హెచ్1బీ పొడిగిస్తున్నపుడు ఏటా లక్ష డాలర్ల భారం తప్పదు.

హెచ్1బీల దుర్వినియోగం

ఉత్తర్వు మీద సంతకం చేస్తూ ట్రంప్ మాట్లాడారు. హెచ్1బీలను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. తమకు గొప్ప పనివాళ్లు కావాలని, తక్కువ స్థాయి జీతాలతో పనిచేసే సామాన్య వ్యక్తుల కోసం అమెరికా ప్రజల ఉద్యోగాలను ఫణంగా పెడుతున్న కంపెనీలకు చెక్ చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. వాణిజ్య కార్యదర్శి హోవర్డ్ లుట్నిక్ మాట్లాడుతూ, అమెరికాలో ఏటా 2,81,000 మంది ఉద్యోగాల ద్వారా గ్రీన్‌కార్డులు పొందుతున్నారని చెప్పారు. వారి సగటు వార్షిక ఆదాయం 66,000 డాలర్లని తెలిపారు. దాంతో సాధారణ ప్రజల కన్నా వీరు ప్రభుత్వ పథకాల సహాయాన్ని అభ్యర్థించే అవకాశం ఐదు రెట్లు ఎక్కువగా ఉందని చెప్పారు. తమకు అమెరికా ఉద్యోగాలు దొంగిలించే వారికన్నా అమెరికాలో ఉద్యోగాలు సృష్టించే గొప్ప వ్యక్తులు కావాలని అన్నారు. తాజా పథకంతో అమెరికా ఖజానాకు ఏటా లక్ష కోట్ల డాలర్ల (రూ.9 లక్షల కోట్లు) ఆదాయం సమకూరుతుందన్నారు.

కంపెనీల విధానాల్లో మార్పులు

ట్రంప్ నిర్ణయం తర్వాత కంపెనీలు తన వ్యూహాలను మార్చుకుంటాయని భావిస్తున్నారు. జీతాల్లో కోతలతో లాభాలు పెంచుకోవడం లాంటి అడ్డదారుల నుంచి విరమించుకోవచ్చు. ఆటోమేషన్, విదేశాలకు పనిని అవుట్ సోర్స్ చేయడం, అమెరికన్ల నైపుణ్యాలు పెంచడం మీద దృష్టి సారించే అవకాశం ఉంది. విదేశీ నిపుణులు అమెరికాను వదిలి వేరే దేశాలను వెతుక్కుంటారని భావిస్తున్నారు. హెచ్1బీ గడువు ముగిసిన ప్రతీ ఉద్యోగి తాను కంపెనీకి అవసరమని నిరూపించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. నిపుణులను అమెరికాకు తెచ్చుకోవడానికి హెచ్1బీ కాకుండా ఓ-1, ఈబీ-1ఏ లాంటి ప్రత్యామ్నాయ మార్గాలను కంపెనీలు చూసే అవకాశం ఉంది.

కోర్టుల్లో నిలబడుతుందా?

ట్రంప్ ఉత్తర్వు కోర్టుల ముందు నిలబడుతుందా? అన్న అనుమానం కూడా ఉంది. గత ఉత్తర్వుల లాగే దీనిపైనా కోర్టులు స్టేలు విధిస్తాయని భావిస్తున్నారు. అలాంటి ఫీజులను విధించే అధికారం కాంగ్రెస్‌కే కానీ, అమెరికా అధ్యక్షుడికి లేదని పలువురు న్యాయవాదులు వ్యాఖ్యానించారు. వీసా ఫీజులు వాటి ప్రాసెసింగ్‌కు అయ్యే ఖర్చును వసూలు చేసే విధంగా ఉండాలి కానీ దాని నుంచి లాభాలను గడించే విధంగా ఉండరాదని చెబుతున్నారు.

భారతీయుల జీతం ఎంత?

అమెరికాలో సగటు భారతీయ ఐటీ ఉద్యోగి వార్షిక వేతనం 95 వేల డాలర్లు ఉంటుంది. నివసించే ప్రాంతాన్ని బట్టి వేతనం మారుతుంది. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి 60 వేల నుంచి 80 వేల డాలర్లు ఉంటుంది. ఐదేళ్ల సీనియారిటీ ఉన్న వాళ్లకు లక్ష డాలర్ల నుంచి లక్షన్నర డాలర్ల వరకు ఉంటుంది. ఉన్నత స్థాయి ఉద్యోగులకు రెండు లక్షల డాలర్ల వరకు ఉంటుంది. హెచ్1బీ లబ్ధిదారుల్లో 71% భారతీయులే కావడం విశేషం.

పది లక్షల డాలర్లకు 'ట్రంప్ గోల్డ్ కార్డు'

వాషింగ్టన్, సెప్టెంబరు 20: హెచ్-1బీ వీసాలపై రుసుములు భారీగా పెంచిన ట్రంప్.. విదేశీయులు అమెరికాలో శాశ్వత నివాసం పొందేందుకు మరో కొత్త పథకాన్ని అమలులోకి తెచ్చారు. అమెరికా ప్రగతికి దోహదపడే అసాధారణ ప్రతిభావంతులైన విదేశీయుల కోసమంటూ "ట్రంప్ గోల్డ్ కార్డు" అనే పథకాన్ని శనివారం ప్రారంభించారు. పది లక్షల డాలర్లు(దాదాపు రూ.9కోట్లు) అమెరికా ఖజానాకి చెల్లించిన వారికి 'ట్రంప్ గోల్డ్ కార్డు' ఇచ్చి అమెరికాలో శాశ్వతంగా నివసించే అవకాశం(గ్రీన్ కార్డు తరహాలో) కల్పిస్తామని ప్రకటించారు. అలాగే, కార్పొరేట్ల కోసం ప్రత్యేకంగా 'ట్రంప్ కార్పొరేట్ గోల్డ్ కార్డు'ను ప్రారంభించారు. 20 లక్షల డాలర్లు(దాదాపు రూ.18 కోట్లు) అమెరికా ఖజానాకు చెల్లించిన కార్పొరేట్ సంస్థలకు ఈ కార్పొరేట్ గోల్డ్ కార్డులు జారీ చేస్తారు. కార్పొరేట్ సంస్థలు ఈ కార్డు సాయంతో తమకు నచ్చిన ఓ విదేశీ ఉద్యోగిని శాశ్వత నివాసి కోటాలో అమెరికాకు పంపవచ్చు. అంతే కాక, తమ అవసరాలకు అనుగుణంగా ఆ వ్యక్తిని వెనక్కు రప్పించి ఆ స్థానంలో మరొకరిని పంపవచ్చు. ఈ బదిలీ ప్రక్రియకు కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ గోల్డ్ కార్డులకు దరఖాస్తులు స్వీకరణకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించిన ట్రంప్.. అమెరికాకు లబ్ధి చేకూర్చే పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తల కోసమే ఈ విధానాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, డీహెచ్ఎస్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ) పరిశీలన తర్వాత ఎంపికైన దరఖాస్తుదారులు గోల్డ్ కార్డుకు డబ్బు జమ చేయాలి. జమ చేసిన డబ్బు వెనక్కి తిరిగి ఇవ్వరు. కాగా, 50 లక్షల డాలర్లకు ఇచ్చే ట్రంప్ ప్లాటినమ్ కార్డును త్వరలో అందుబాటులోకి తెస్తామని ట్రంప్ ప్రకటించారు. ప్లాటినమ్ కార్డు కలిగిన వారు ఓ ఏడాదిలో 270 రోజుల పాటు అమెరికాలో ఉండవచ్చు.

మళ్లీ చెబుతున్నా.. మోదీ బలహీన ప్రధాని!



» రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ, న్యూయార్క్, సెప్టెంబరు 20: "మోదీ అత్యంత బలహీన ప్రధాని" అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. హెచ్-1బీ వీసాకు లక్ష డాలర్ల రుసుము విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్న అనంతరం రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2017లో ప్రధానిని బలహీనుడు అంటూ చేసిన పోస్టునే తిరిగి 'ఎక్స్'లో రాహుల్ గాంధీ పోస్టు చేశారు. విదేశాల్లో భారతీయుల ఆకాంక్షలను నిలబెట్టలేకపోతున్నారని దుయ్యబట్టారు. దీంతోపాటు హెచ్-1బీ వీసా నిర్ణయంపై వచ్చిన కథనాన్ని ఆయన ఈ పోస్టుకు జత చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కూడా మోదీపై విమర్శల వర్షం కురిపించారు. "మీ ప్రియ మిత్రుడి (ట్రంప్) నుంచి అందిన పుట్టిన రోజు రిటర్న్ గిఫ్ట్ (హెచ్-1బీ వీసా రుసుము) చూశాక భారతీయులు చాలా బాధ పడ్డారు" అని ఖర్గే వ్యాఖ్యానించారు.

అమెరికాకే నష్టం: నిపుణులు

హెచ్-1బీ వీసాల రుసుమును లక్ష డాలర్లకు పెంచేయడంతో అమెరికా ఆవిష్కరణల రంగాన్ని స్వయంగా ఆ దేశ ప్రభుత్వమే గొంతు నొక్కినట్లైందని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ వ్యాఖ్యానించారు. 'ప్రపంచ దేశాల్లోని ప్రతిభ తమ దేశంలోకి రాకుండా అమెరికా తలుపులు మూసుకుంది. తద్వారా వచ్చేతరం ల్యాబ్‌లు, పేటెంట్లు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లను హైదరాబాద్, బెంగళూరు, పుణె, గుర్గావ్‌లకు మళ్లించింది. అమెరికా నష్టం.. భారత్‌కు లాభం' అంటూ ఎక్స్‌లో అమితాబ్ కాంత్ పోస్టు చేశారు. ట్రంప్ నిర్ణయంపై పలువురు అమెరికా చట్టసభల సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నిర్ణయం అత్యంత నిర్లక్ష్యపూరితమైనదని, దాని వల్ల అమెరికా ఐటీ పరిశ్రమ తీవ్రంగా దెబ్బ తింటుందని హెచ్చరించారు. అంతర్జాతీయ ప్రతిభను ఆకర్షించేందుకు ఇతర దేశాలు పోటీ పడుతున్న తరుణంలో అమెరికా వలస విధానాన్ని మరింత పటిష్ఠ పర్చాలే గానీ, బలహీన పర్చొద్దని హితవు పలికారు.

అమెరికాతో సంప్రదిస్తున్నాం: కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: హెచ్-1బీ వీసాలపై ట్రంప్ ప్రభుత్వం తాజాగా విధించిన ఆంక్షలతో అనేక కుటుంబాల మీద ప్రభావం పడుతుందని విదేశాంగశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యపై అమెరికా అధికారులు దృష్టి పెడతారని ఆశిస్తున్నామని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ట్రంప్ నిర్ణయం కలిగించే ప్రభావంపై అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని, భారత పరిశ్రమలు తదితర భాగస్వామ్యపక్షాలను కూడా సంప్రదిస్తున్నామని వెల్లడించారు. కాగా.. ముందుకెళ్లే మార్గంపై అమెరికా ప్రభుత్వంతో, ఐటీ పరిశ్రమకు చెందిన ప్రతినిధులతో చర్చలు కొనసాగుతున్నాయని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

వాణిజ్య చర్చల కోసం అమెరికాకు గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: అమెరికాతో ఈ నెల 22న వాణిజ్య చర్చల నిమిత్తం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ఆ దేశానికి వెళ్లనుంది. పరస్పరం ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా ముగించే లక్ష్యంతో చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతినిధి బృందం యోచిస్తోందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ శనివారం పేర్కొంది. ఈనెల 16న అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం నుంచి అధికారుల బృందం భారత్‌ను సందర్శించిన సందర్భంగా వివిధ అంశాలపై సానుకూల చర్చలు జరిగాయి. ఈ చర్చల కొనసాగింపుగా కేంద్ర వాణిజ్య మంత్రి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం అమెరికాకు వెళ్తోంది.

లోకం తీరు



మేము ఇంటికి వెళ్లం బాబోయ్!

» స్వదేశానికి ప్రయాణాలను రద్దు చేసుకున్న భారతీయులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: హెచ్-1బీ వీసా రుసుము పెంపు పేరిట అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేల్చిన బాంబుతో అమెరికాలోని విమానాశ్రయాల్లో శుక్రవారం ఒక్కసారిగా కలకలం రేగింది. చాలా మంది తమ ప్రయాణాలను అప్పటికప్పుడు రద్దు చేసుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి దసరా, దీపావళి పండుగలు జరుపుకునేందుకు, ఇతర పనుల మీద స్వదేశానికి వచ్చే ప్రణాళికల్లో ఉన్న భారతీయులు కూడా తమ ప్రయాణాలను వెంటనే రద్దు చేసుకున్నారు. మరోపక్క, అమెరికా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన హెచ్-1బీ వీసాదారులు కూడా తిరిగి అమెరికాకు పరుగులు పెడుతున్నారు. హెచ్-1బీ వీసా రుసుము లక్ష డాల్లరకు పెంపు నిర్ణయం సెప్టెంబరు 21 అర్ధరాత్రి తర్వాత నుంచి అమలు కానుండడమే ఇందుకు కారణం. కాగా, శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో ఓ ఎమిరేట్స్ విమానంలో ఎక్కి కూర్చున్న ప్రయాణికుల్లో హెచ్-1బీ వీసాదారులు ట్రంప్ ప్రకటన తెలుసుకుని హుటాహుటిన విమానం దిగిపోయారంటూ మసూద్ రాణా అనే వ్యక్తి ఎక్స్‌లో పోస్టు చేశాడు. శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయం నుంచి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న ఓ విమానంలో పెద్ద సంఖ్యలో ఉన్న భారతీయులు తాము విమానం దిగిపోతామంటూ సిబ్బందిని వేడుకోవడం తనను బాధపెట్టిందంటూ మరో వ్యక్తి ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోపక్క, భారత్ నుంచి అమెరికాకు నేరుగా వెళ్లే విమాన సర్వీసుల టికెట్ల ధరలు కూడా శనివారం ఒక్కసారిగా పెరిగిపోయాయి. న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్ వెళ్లే విమానంలో ఎకనమి క్లాస్ టిక్కెట్ ధర సాధారణ రోజుల్లో అటుఇటుగా రూ.37,000 వరకు ఉంటుంది. కానీ, ట్రంప్ ప్రకటన వెలువడిన రెండు గంటల తర్వాత అదే టిక్కెట్(శనివారం ప్రయాణానికి) ధర రూ.80,000కు పెరిగిపోయింది. శనివారం శంషాబాద్ విమానాశ్రయం అమెరికా ప్రయాణికులు, వారి కుటుంబసభ్యులతో కిక్కిరిసిపోయింది

ఇప్పటికే కష్టం.. ఇకపై అసాధ్యమే!

హెచ్1బీ వీసాలు, గ్రీన్‌కార్డుల కోసం ఇప్పటికే భారతీయుల ఇబ్బందులు..ఫీజు పెంపుతో మరింత సమస్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: అమెరికా హెచ్1బీ వీసాలు, గ్రీన్‌కార్డుల (శాశ్వత నివాస అనుమతి) విషయంలో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారతీయులకు.. భారీగా వీసా ఫీజుల పెంపు అశనిపాతంగా మారింది. అమెరికా ఏటా 85వేల హెచ్1బీ వీసాలు ఇస్తుంటే.. అందులో 70శాతానికిపైగా భారతీయ ఉద్యోగులకే దక్కుతూ వస్తున్నాయి. ఇతర దేశాల వారితో పోల్చితే మంచి నైపుణ్యం ఉండటం, తక్కువ వేతనాలకే పనిచేయడమే దీనికి కారణం. కానీ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక పెడుతున్న నిబంధనలు, గ్రీన్‌కార్డుల కోసం పెరిగిపోయిన క్యూతో హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తులు తగ్గిపోతున్నాయి. అందులోనూ భారతీయుల నుంచి దరఖాస్తులు బాగా పడిపోతున్నాయి. మొత్తంగా 2024లో 7,80,884 దరఖాస్తులురాగా.. 2025లో 4,70,342 దరఖాస్తులే వచ్చాయి. ఇక గ్రీన్‌కార్డుల కోసమైతే దశాబ్దాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. హెచ్1బీ వీసాల జారీలో దేశాల వారీగా పరిమితి ఏదీ లేకపోవడంతో భారతీయులకు ఎక్కువ దక్కుతున్నా.. గ్రీన్‌కార్డులకు మాత్రం గరిష్ఠంగా ఏడు శాతం పరిమితి ఉంది. దీనితో హెచ్1బీ వీసాదారుల్లో అత్యధికంగా ఉండే భారతీయులకు గ్రీన్‌కార్డు లభించడం కష్టంగా మారింది. గ్రీన్‌కార్డుల కోసం వేచి ఉన్నవారి సంఖ్య 18 లక్షలు అయితే.. అందులో 11 లక్షల మంది భారతీయ ఉద్యోగులే. కొన్ని దేశాలకు చెందినవారు వేల మంది కూడా ఉండరు. అమెరికా ఏటా లక్షా 40వేల గ్రీన్‌కార్డులు ఇస్తుంది. అందులో గరిష్ఠంగా ఒక్కో దేశం నుంచి 9,800 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన ఏటా 9,800 మంది భారతీయులకు గ్రీన్‌కార్డు ఇచ్చినా.. లక్ష మందికి అందేందుకే పదేళ్లు దాటిపోతుంది. మిగతా వారికి రావాలంటే దశాబ్దాలు పడుతుంది. దానికితోడు అన్నేళ్లు వాళ్లు అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఉండాల్సిందే. ఇప్పుడు హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్ల (రూ.88 లక్షలు)కు పెంచడం పిడుగుపాటుగా మారింది.

ఆ వీసాలకూ పదేళ్ల వెయిటింగ్..

హెచ్1బీ వీసాల జారీ కంపెనీల ఆఫర్ ఆధారంగా జరుగుతుంది. అంటే ఫలానా వ్యక్తికి ఉద్యోగం ఇచ్చామని, అతడికి హెచ్1బీ వీసా ఇవ్వాలని కంపెనీలు దరఖాస్తు చేస్తాయి. అలాకాకుండా ప్రత్యేక రంగాల్లో ఉన్నతస్థాయి కోర్సులు చేసిన, నైపుణ్యమున్న వారు నేరుగా ఈబీ-2, ఈబీ-3 వీసాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీటి కోసం భారీగా వెయిటింగ్ ఉంది. ఇటీవల అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ప్రస్తుతం 2012 జనవరిలో దరఖాస్తు చేసుకున్నవారికి ఈబీ-2 వీసాలు, 2013 మేలో దరఖాస్తు చేసుకున్నవారికి ఈబీ-3 వీసాలు మంజూరు అవుతున్నాయి.

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో మాజీ సీజేఐ ఎన్వీ రమణ భేటీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ భేటీ అయ్యారు. ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఇటీవలి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించినందుకు ఆయన రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓ పుస్తకాన్ని కూడా బహూకరించారు.



చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్

రూ. 1.10 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

- మెడికల్ కళాశాల ప్రొఫెసర్‌కు టోకరా
- చీరాల పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

చీరాల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూనే ఉన్నారు. ఎంతలా అవగాహన కల్పించినా వారి వలలో ప్రజలు పడుతూనే ఉన్నారు. తాజాగా ఏలూరు మెడికల్ కళాశాల ప్రొఫెసర్ నుంచి సైబర్ నేరగాళ్లు భారీ మొత్తంలో డబ్బు కొట్టేశారు. ఆయన భార్య ఖాతా నుంచి ఏకంగా రూ. కోటి, ఆయన ఖాతా నుంచి రూ. 10 లక్షల నగదును తమ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. బాధితుడు శుక్రవారం రాత్రి చీరాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ నేరగాళ్ల దోపిడీ వెలుగులోకి వచ్చింది. చీరాల వన్‌టౌన్ సీఐ సుబ్బారావు కథనం ప్రకారం, బాపట్ల జిల్లా చీరాలకు చెందిన విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు ఏలూరు మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 9న ఆయనకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్ చేయడంతోనే తాము ముంబై పోలీసులమని అవతలి వ్యక్తులు చెప్పారు. తర్వాత వీడియో కాల్ చేసి మనీ లాండరింగ్ కేసు పెడతామంటూ ప్రొఫెసర్‌ను బెదిరించారు. కేసు పెట్టకుండా ఉండాలంటే తమ ఖాతాకు లావాదేవీలు జరగాలంటూ నమ్మబలికారు. దర్యాప్తు అధికారి ప్రణయ్ సార్ ఖాతాకు రూ. 1.10 కోట్లు జమ చేయాలని చెప్పారు. ఆర్బీఐ పరిశీలన అనంతరం ఆ డబ్బు తిరిగి వచ్చేస్తుందని భరోసా ఇచ్చారు. ఇదంతా నమ్మిన ప్రొఫెసర్.. నేరగాళ్లు చెప్పిన ఖాతాకు విడతల వారీగా సొమ్ము బదిలీ చేశారు. ఆ వెంటనే 'మీ నగదు పరిశీలన పూర్తయింది' అంటూ ఆర్బీఐ పేరుతో మెసేజ్ కూడా వచ్చింది. అయితే ఆ తర్వాత తన ఖాతాకు డబ్బు తిరిగి జమకాకపోవడం, అవతలి వ్యక్తుల నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు ప్రొఫెసర్ గుర్తించారు. శుక్రవారం రాత్రి చీరాల వన్‌టౌన్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. సీఐ సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ సంస్కరణల అమలుకు నోటిఫికేషన్

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకువచ్చిన సంస్కరణల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. సామాన్య ప్రజలు, చిరువ్యాపారులపై పన్నుల భారాన్ని తగ్గిస్తూ జీఎస్టీ కౌన్సిల్ ప్రతిపాదించిన రెండు శ్లాబ్‌ల (5, 18 శాతం) విధానం రాష్ట్రంలో ఈనెల 22 నుంచి అమలులోకి రానుంది. దీంతో ప్రజలు దైనందిన అవసరాలకు వినియోగించే 90% వస్తువుల ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీ శ్లాబుల సవరణలతో ధరలు తగ్గే అవకాశమున్న వస్తువుల జాబితాను నోటిఫికేషన్‌కు జత చేసిన షెడ్యూళ్లలో ప్రభుత్వం ప్రకటించింది.

పరకామణిలో చోరీపై రాజీనా?

- లోక్ అదాలత్ ఉత్తర్వులు సస్పెండ్
- రికార్డులన్నీ స్వాధీనం చేసుకోండి
- సీఐడీ ఐజీకి న్యాయమూర్తి ఆదేశం
- తదుపరి విచారణ అక్టోబరు 13కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పరకామణిలో జరిగిన అవకతవకలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పరకామణి నుంచి నగదు అపహరణపై ఫిర్యాదు చేసిన టీటీడీ అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్‌తో లోక్ అదాలత్ వద్ద రాజీ చేసుకోవడాన్ని తప్పుబట్టింది. విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఇవి అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. కేసులో సీఐడీ ఐజీని సుమోటోగా ప్రతివాదిగా చేర్చింది. ప్రస్తుత కేసుతో ముడిపడి ఉన్న తిరుమల 1వ పట్టణ పోలీస్ స్టేషన్ రికార్డులు, లోక్ అదాలత్ ప్రొసీడింగ్స్, టీటీడీ బోర్డు తీర్మానాలు, ఈ కేసుతో సంబంధం ఉన్న ప్రొసీడింగ్స్‌ను తక్షణం స్వాధీనం చేసుకోవాలని సీఐడీ ఐజీని ఆదేశించింది. తదుపరి విచారణ రోజు వాటిని సీల్డ్ కవర్‌లో తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబరు 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఉత్తర్వుల ప్రతి శనివారం అందుబాటులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పరకామణిలో జరిగిన కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు జరిపించాలని సమర్పించిన వినతిని ఈవో పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరుతూ జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది కుర్రా శ్రీనివాసులు, టీటీడీ తరఫున న్యాయవాది సి. శ్రీనివాసబాబా వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంపై టీటీడీ ఈవో సమర్పించిన రాతపూర్వక వివరాలు సంతృప్తికరంగా లేవని, పూర్తి వివరాలతో కౌంటర్ వేయడానికి సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి... ఈ వ్యవహారంలో రెండు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని టీటీడీని ఆదేశించారు. రవికుమార్‌పై తీసుకున్న క్రమశిక్షణ చర్యల గురించి అఫిడవిట్‌లో ప్రస్తావించాలని స్పష్టం చేశారు. వ్యాజ్యంలో వ్యక్తిగత ప్రతివాదులుగా ఉన్న టీటీడీ అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్‌కు నోటీసులు జారీ చేశారు.

హైకోర్టు అభ్యంతరం



తాడేపల్లి ప్యాలెస్‌కూ వాటాలు: భానుప్రకాశ్‌రెడ్డి

తిరుపతి (విద్య), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరకామణి కుంభకోణంలో వైసీపీ పెద్దలు, కొందరు టీటీడీ అధికారులూ వాటాదారులేనని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు పెద్దలు, టీటీడీ అధికారులు శ్రీవారి సొమ్మును వాటాలు వేసుకుని పంచుకున్నారని ఆరోపించారు. తాడేపల్లి ప్యాలెస్‌కూ వాటాలు వెళ్లాయన్నారు. పోలీసు అధికారుల నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగానే పరకామణి కేసును రాజీ చేసుకున్నామని టీటీడీ విజిలెన్స్ అధికారులు చెప్పారన్నారు. రాజీకోసం ఒత్తిడి చేసిన ఆ పోలీసు అధికారి ఎవరో త్వరలోనే నిగ్గుతేలుతుందన్నారు. అప్పట్లో కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి పశ్చాత్తాపం చెందారని, పరకామణి కుంభకోణానికి సంబంధించిన అన్ని విషయాలను త్వరలో బహిరంగంగా వెల్లడించనున్నారని తెలిపారు. పెద్దజీయర్ మఠం క్లర్క్ సీవీ రవికుమార్ పరకామణిలో డాలర్ల కట్టను దాచేస్తున్న వీడియోలను మీడియాకు ఆయన చూపించారు. సాక్ష్యాలు లేకుండా పెద్దలు ఈ వీడియోలన్నింటినీ డిలీట్ చేశారని, అయితే టీటీడీ ఉద్యోగిగా ఉన్న ఓ భక్తుడు ఆ వీడియోలను సేకరించి జాగ్రత్త చేశారని వివరించారు. రవికుమార్ ప్రతిరోజూ రూ. 10 నుంచి 12 లక్షల వరకూ హుండీ సొమ్మును కాజేసేవాడని, వాటితో అనేక ఆస్తులు కొనుగోలు చేశాడని చెప్పారు. చెన్నైలోని టీటీడీ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో నాటి కొందరు టీటీడీ అధికారులు, వైసీపీ పెద్దలు కూర్చుని ఆ ఆస్తులను వాటాలు వేసుకున్నారని తెలిపారు. గత పాలకులకు సహకరించిన కొందరిని బ్రహ్మోత్సవాల తర్వాత టీటీడీ నుంచి సాగనంపనున్నట్టు పేర్కొన్నారు.



డాలర్ల చోరీపై సీసీ ఫుటేజీని చూపుతున్న భానుప్రకాశ్‌రెడ్డి

శ్రీవారి సొత్తునూ స్వాహా చేశారు

- దేవుడినీ వదలని వైసీపీ గ్యాంగ్
- భూమన అండతో పరకామణిలో కోట్లు దోచేశారు: మంత్రి లోకేశ్ ధ్వజం

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గనులు, భూములు, అడవులు, సమస్త వనరులతోపాటు జనాన్ని దోచుకున్న జగన్ గ్యాంగ్.. చివరకు తిరుమల శ్రీవారి సొత్తునూ స్వాహా చేశారని మంత్రి లోకేశ్ ఆరోపించారు. వైసీపీ హయాంలో తిరుమల పరకామణిలో జరిగిన చోరీపై శనివారం ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'జగన్ ఐదేళ్ల పాలనలో అవినీతి రాజ్యమేలింది. అరాచకం పెచ్చరిల్లింది. దొంగలు, దోపిడీదారులు, మాఫియా డాన్లకు ఏపీని కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు. తాడేపల్లి ప్యాలెస్ ఆశీస్సులు, నాటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అండదండలతో తిరుమల పరకామణిలో దొంగలు పడ్డారు. రూ.కోట్ల విలువైన సొత్తు కొల్లగొట్టారు. ఈ డబ్బును రియల్ ఎస్టేట్లో పెట్టుబడులు పెట్టారు. తిరుపతిలో భూమన నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు వాటాలు అందాయని నిందితులే చెబుతున్నారు.' అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఎంతో నమ్మకంతో కట్టిన ముడుపులు, హుండీలో వేసిన కానుకలు రూ.వందల కోట్లను టీటీడీ ఉద్యోగి రవికుమార్ దోచుకుని వెళ్లినప్పుడు టీటీడీ చైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి.. అతని మనుషులు ఏకంగా ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేయడానికి ప్రయత్నించారని మండిపడ్డారు. 'భక్తులు మహాప్రసాదంగా భావించే లడ్డూని కల్తీ చేశారు. అన్నప్రసాదాన్ని భ్రష్టుపట్టించారు. సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం దుర్లభం చేశారు. ఏడుకొండల జోలికి వెళ్లవద్దని, శ్రీవారికి అపచారం తలపెట్టవద్దని చంద్రబాబు బతిమాలి చెప్పారు.. అయినా వినలేదు.' అని లోకేశ్ తెలిపారు. "ఏడుకొండలవాడు చాలా పవర్‌ఫుల్ స్వామి. ఆయనకు అపచారం తలపెట్టినా, ఆయన సన్నిధిలో అవినీతికి పాల్పడినా ఏం జరుగుతుందో తెలిసీ జగన్, భూమన ఏకంగా పరకామణినే దోచేశారని విమర్శించారు. 'గుడిని, గుడిలో హుండీ ని దోచేసిన పాపాలతో గత పాలకుడు జగన్ గ్యాంగ్ పాపం పండింది. పరకామణి వీడియోలు ఈరోజు బయటపడ్డాయి. రేపు నిందితులే వైసీపీ పాపాల చిట్టా విప్పబోతున్నారు' అని లోకేశ్ పేర్కొన్నారు.

రూ.10వేల రికవరీతో సరిపెట్టారు: బుచ్చి రాంప్రసాద్

సాక్షాత్తు కలియుగ వైకుంఠంగా పేర్కొనే తిరుమల శ్రీవారి సన్నిధిలోనూ వైసీపీ నేతలు విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డారని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నేతల అండతో పరకామణిలో రవికుమార్ అనే ఉద్యోగి రూ.113 కోట్లు దోచుకుంటే కేవలం రూ.10వేలు లోపు సొత్తును రివకరీ చేసి, కేసును మమ అనిపించారని విమర్శించారు.

24న పాలకొల్లుకు సీఎం చంద్రబాబు

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహ కార్యక్రమంలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 24వ తేదీ పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు రానున్నారు. స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డులోని కళ్యాణ వేదిక సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను కలెక్టర్ చదలవాడ నాగరాణి శనివారం పరిశీలించారు. హెలీప్యాడ్ వద్ద బందోబస్తు ఏర్పాట్లు, మ్యాప్‌ను పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్. చిత్రంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివ శంకరరావు, వీసీసీఐ అధ్యక్షుడు సుదర్శనస్వామి, కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరామ్‌ప్రసాద్ ఉన్నారు

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు: మంత్రి కొండపల్లి

విశాఖపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఫిక్కీ సెంటర్ ఫర్ సస్టైనబులిటీ లీడర్‌షిప్, విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్(వీసీసీఐ) సంయుక్తంగా 'పర్యావరణ, సామాజిక పాలన (ఈఎస్‌జీ) సూత్రాలు, ఎంఎస్ఎంఈల సుస్థిర వృద్ధి' అనే అంశంపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ... 'రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించనున్నాం. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక ప్రోత్సాహక అధికారులను నియమిస్తున్నాం. జిల్లాల స్థాయిలో చాంబర్ ఆఫ్ కామర్స్‌లు ఏర్పాటు చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేయడం ద్వారా ఉత్పత్తి ఖర్చు తగ్గుతుంది' అని పేర్కొన్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివ శంకరరావు మాట్లాడుతూ... 'నాణ్యత, నిబంధనల లోపాలతో భారతీయ ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్‌లో తిరస్కరణకు గురైన సందర్భాలు ఉన్నాయి. కాబట్టి, ఎంఎస్ఎంఈలు సుస్థిర విధానాలను అవలంబించడం అవసరం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసీసీఐ అధ్యక్షుడు సుదర్శనస్వామి, కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరామ్‌ప్రసాద్, సెంట్రల్ బ్యాంక్ డీజీఎం ఏవీ రమణమూర్తి, జేఎస్‌డబ్ల్యు పారిశ్రామిక పార్క్, బిజినెస్ ఆఫీసర్ రాజారాం పాయ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ మలివిడత టెండర్‌లోనూ వీడని ప్రతిష్టంభన

- బిడ్స్ వేసేందుకు ముందుకు రాని జిన్నర్లు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి, జిన్నింగ్ మిల్లుల యజమానులకు మధ్య ఏర్పడిన లడాయి కొనసాగుతోంది. ఈ నెల 18వ తేదీన సీసీఐ మలి విడత టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ రాష్ట్రంలోని జిన్నర్లు బిడ్స్ వేసేందుకు ముందుకు రాలేదు. మలి విడత విడుదల చేసిన టెండర్ నోటిఫికేషన్‌లో వెలువరించిన అనేక అంశాలను కూడా జిన్నర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సీసీఐ ఆగస్టు 12వ తేదీన వెలువరించిన మొదటి విడత టెండర్ నోటిఫికేషన్ వివాదాస్పదమయింది. ఆ నేపథ్యంలోనే రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు టెండర్ నోటిఫికేషన్‌ను బహిష్కరించారు. నోటిఫికేషన్‌లో ఉన్న పలు నిబంధనలు సడలించాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు పట్టుబట్టారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర జౌళి శాఖ సంయుక్త కార్యదర్శి పద్మిని సింగ్లా ఈ నెల 11న సీసీఐ సీఎండీ, జిన్నర్లతో ఢిల్లీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో జిన్నర్లు సీసీఐ చెబుతున్నట్లుగా దూది శాతం పెంపు, ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ఎల్ 4, ఎల్ 5 ప్రక్రియను అమలు వంటి పలు కీలక అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పటి సమావేశంలో కొన్ని నిబంధనలు సడలించేందుకు సీసీఐ సీఎండీ సూచనప్రాయంగా అంగీకారం తెలిపారు. సీఎండీ చెప్పినట్టుగానే మలి విడత నోటిఫికేషన్ వచ్చినప్పటికీ నిబంధనలు పెద్దగా సడలించక పోవటం జిన్నర్లను నిరాశకు గురిచేసింది. మలివిడత నోటిఫికేషన్‌లో కూడా పెద్దగా ఊరట దక్కని విషయాన్ని జిన్నర్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అభ్యంతరాలపై స్పందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు కొన్ని కీలక సూచనలు చేస్తూ సీసీఐ మేనేజర్‌కు లేఖ రాసినట్టు తెలుస్తోంది. సీసీఐ మేనేజర్ నిర్ణయం మీదనే ఆధారపడి టెండర్ ప్రక్రియలో పాల్గొనాలని జిన్నర్లు నిర్ణయించుకున్నట్టు సమాచారం. తాజాగా వెలువరించిన టెండర్ నోటిఫికేషన్‌కు కూడా ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలతో గడువు ముగియనుంది.

మూడు విభాగాల్లో రాష్ట్రానికి స్కోచ్ అవార్డులు

- పోటీ పరీక్షల్లో బీసీ యువతకు ఉచిత శిక్షణకు అవార్డు అందుకున్న మంత్రి సవిత
- డిజిటల్ టికెట్ల జారీ ప్రక్రియకు ఆర్టీసీకి.. పేదరిక నిర్మూలనలో సేవలకు మెప్మాకు పురస్కారాలు



స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచ్చర్, ప్రొఫెసర్ మహేందర్ దేవ్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న మంత్రి సవిత



'స్కోచ్' అవార్డు అందుకుంటున్న ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్ (ఐటీ) వై.శ్రీనివాసరావు

న్యూఢిల్లీ/అమరావతి/విజయవాడ (బస్‌స్టేషన్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మెరుగైన పనితీరు కనబరిచినందుకు మూడు విభాగాల్లో రాష్ట్రానికి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులు లభించాయి. పోటీ పరీక్షల్లో బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందజేసినందుకు సోషల్ జస్టిస్ సెక్యూరిటీ విభాగంలో ఏపీ బీసీ సంక్షేమ శాఖకు బంగారు స్కోచ్ అవార్డు వరించింది. శనివారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత పాల్గొన్నారు. స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచ్చర్, ప్రొఫెసర్ మహేందర్ దేవ్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు బీసీలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా 1,674 మందికి, ఆన్‌లైన్ ద్వారా మరో 4,774 మందికి ఉచిత శిక్షణ అందజేశామని వెల్లడించారు. వీరిలో 246 మంది మెగా డీఎస్సీలో టీచర్లుగా ఎంపికయ్యారన్నారు. రాబోయే కాలంలో బీసీ యువతకు అన్ని పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందివ్వనున్నామని ప్రకటించారు. కాగా డిజిటల్ టికెట్లు జారీ ప్రక్రియను విజయవంతంగా అమలుపరచడం ద్వారా ఆర్టీసీ 'స్కోచ్' అవార్డును గెలుచుకుంది. సంస్థ వైస్‌చైర్మన్, ఎండీ ద్వారకా తిరుమలరావు తరఫున సంస్థ చీఫ్ ఇంజనీర్ (ఐటీ) వై.శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. సంస్థకు అవార్డు రావడం పట్ల ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) జి.వి.రవి వర్మ అభినందనలు తెలియజేశారు. ఇక పేదరిక నిర్మూలనలో విశిష్ట సేవలకు ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మాకు స్కోచ్ ప్లాటినం అవార్డు ప్రదానం చేసింది. మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఈ అవార్డును స్వీకరించారు. మెప్మా సంస్థ పట్టణ పేదరిక నిర్మూలనకు చేపడుతున్న వినూత్న పథకాలకు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. మెప్మా కృషికి గుర్తింపుగా 9 అవార్డులను స్కోచ్ సంస్థ ప్రదానం చేసింది.

రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖకు ఉత్తమ అవార్డు

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సెంట్రల్ సిల్క్ బోర్డు 'మేరా రేషమ్-మేరా అభిమాన్' పేరుతో చేపట్టిన కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించినందుకు రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖకు ఉత్తమ అవార్డు లభించింది. అవార్డును శనివారం బెంగుళూరులో కేంద్ర జౌళి శాఖ సంయుక్త కార్యదర్శి పద్మినీ సింగ్లా, సభ్య కార్యదర్శి శివకుమార్, కేంద్ర పట్టు మండలి సభ్యుడు.. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నుంచి రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల డైరెక్టర్ శ్రీనివాసులు అందుకున్నారు.

హిందూ ధర్మం విశ్వవ్యాప్తం కావాలి

- సమరసత సేవా ఫౌండేషన్ సేవలు స్ఫూర్తినిచ్చాయి
- ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార అర్చక స్వాముల ఆత్మీయ సమ్మేళనంలో బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్

విజయవాడ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం విశ్వవ్యాప్తం కావాలని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. టీటీడీ సహకారంతో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారులను అర్చక స్వాములుగా తీర్చిదిద్ది, గ్రామాల్లో హిందూ ధర్మాన్ని కాపాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) సేవలను అభినందించారు. హిందు ధర్మ పరిరక్షణకు ఈ కార్యక్రమం భవిష్యత్తులో ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార అర్చక స్వాముల ఆత్మీయ సమ్మేళనం శనివారం విజయవాడలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో ఎస్ఎస్ఎఫ్ నిర్మించిన దేవాలయాలను సందర్శించి ఆశ్చర్యపోయానన్నారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించాలనే పట్టుదల ఇంకా ఆయా పల్లెల్లో ఎంతో మందిలో ఉందనే విషయాన్ని గ్రహించానని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎస్ఎస్ఎఫ్ కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎస్ఎస్ఎఫ్ అధ్యక్షులు తాళ్లూరు విష్ణువు మాట్లాడుతూ ఇప్పటి వరకు 800లకు పైగా ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల పల్లెల్లో దేవాలయాలను నిర్మాణం చేశామన్నారు. వీటికి అనుసంధానంగా 301 బాలవికాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల చిన్నారులకు అర్చకత్వంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమలానంద భారతి స్వామి, విరజానంద స్వామి, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

• ఆర్కే RK

కేసీఆర్ అయినా, నేడు రేవంత్ రెడ్డి అయినా తమ సొంత ఆస్తులు అమ్మి పథకాలను అమలుచేయడం లేదు – చేయరు! ఈ ఇరువురు కూడా అప్పులు చేసి పథకాలను అమలు చేయాల్సిందే. అప్పు దొరికితే సరేసరి, లేనప్పుడే తంటా అంతా! గత కొన్నేళ్లుగా అమలవుతున్న పథకాలను తమ హక్కుగా ప్రజలు భావిస్తున్నారు. అందుకే సంక్షేమ పథకాలు అమలు చేసినంత మాత్రాన అధికారం నిలబెట్టుకోవచ్చునని అనుకోవడానికి లేదు. అయినా రేసులో వెనుకబడి పోకూడదని రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. అప్పు చేసి పప్పు కూడు తింటున్నామా? అంటే అది కూడా లేదు! ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఏమాత్రం మెరుగుపడ్డం లేదు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కర్ణాటకలో రోడ్లు గుంతల మయంగా ఉన్నాయని, అవి మెరుగుపడే అవకాశం కూడా కనపడటం లేదని, అంచేత తాము మరో రాష్ట్రానికి తరలిపోవాలని ఆలోచిస్తున్నట్టు 'బ్లాక్ బక్' కంపెనీ వ్యాఖ్యానించింది. కర్ణాటకకు అయినా, తెలంగాణకు అయినా, ఆంధ్రప్రదేశ్‌కు అయినా ఇంతకన్నా తలవంపు ఏమి ఉంటుంది?

సంక్షేమమా... సంక్షోభమా?

'మింగ మెతుకు లేదు– మీసాలకు సంపెంగ నూనె' అన్నది ఒక సామెత! ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల పరిస్థితికి ఈ సామెత అచ్చుగుద్దినట్టు సరిపోతుంది. అప్పు చేయనిదే పూట గడవని పరిస్థితి ఉన్నప్పటికీ రెండు రాష్ట్రాల ప్రభుత్వాల మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. తెలుగు రాష్ట్రాలకు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? ఇందుకు ఎవరు కారణం? 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ ధనిక రాష్ట్రమని, రాష్ట్రం రెవెన్యూ మిగులులో ఉందని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అదే సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రూ.20 వేల కోట్లకు పైగా రెవెన్యూ లోటుతో ఏర్పడింది. 11 ఏళ్లు గడిచేసరికి ధనిక రాష్ట్రమైన తెలంగాణ కూడా అప్పుల కుప్పగా మారింది. అప్పు కోసం వెళితే దొంగను చూసినట్టు చూస్తున్నారని ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలు వాస్తవాన్ని బయటపెట్టారు. అంతే, తెలంగాణ పరువు తీస్తావా? అని భారత రాష్ట్ర సమితి నాయకులు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే... ఆ రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టుగా ఉంది. రాష్ట్రం అప్పులు పది లక్షల కోట్లు దాటాయి. అటు ధనిక రాష్ట్రం, ఇటు రెవెన్యూ లోటుతో ఏర్పడిన రాష్ట్రం కూడా కుదేలవడానికి కారణం ఏమిటి? రాజకీయ పార్టీలు బాధ్యతను విస్మరించి అధికారం కోసం పోటీపడుతూ... అపర దానకర్ణుల వలె ప్రజాధనాన్ని పప్పూ బెల్లాల్లా పంచిపెట్టడానికి పోటీపడటంతో రెండు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. సంక్షేమ పథకాలకు కూడా అప్పులు చేయవలసి వస్తోంది. ప్రభుత్వ ఆస్తులను కుదువ పెట్టడమే కాకుండా, భవిష్యత్ ఆదాయాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్లనే తెలుగు నాట ప్రస్తుత దుస్థితి దాపురించింది. ఏదో ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం కోసం లేదా ఎవరో ఒకరు ముఖ్యమంత్రి కావడం కోసం సంక్షేమం పేరిట అలవి కాని పథకాలను ప్రకటిస్తూ తెలుగు రాష్ట్రాలను దివాలా తీయిస్తున్నారు. కొంతమేరకు భారతీయ జనతా పార్టీని మినహాయిస్తే, మిగతా ప్రధాన రాజకీయ పార్టీలన్నింటికీ ఈ పాపంలో భాగం ఉంది. వివిధ ప్రభుత్వ శాఖలలో చేపట్టిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు ఒక్కో రాష్ట్రంలో లక్ష కోట్లు దాటాయి. చివరికి పరిస్థితి ఎంతవరకూ వెళ్లిందంటే, నిర్దిష్టంగా నిధుల లభ్యత ఉన్న పనులకు మినహా మిగతా పనులు చేపట్టడానికి ప్రభుత్వాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కరువై అల్లాడుతున్నారు. ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని తెలిసి కూడా కొత్త పథకాల ప్రకటనలో రాజకీయ పార్టీలు తగ్గేదేలే అన్నట్టుగా పోటీ పడుతున్నాయి.

తెలంగాణ తీరు ఇలా...

11 ఏళ్ల క్రితం నిజంగానే రెవెన్యూ మిగులుతో ధనిక రాష్ట్రంగా ఉండిన తెలంగాణలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ అనేక సరికొత్త సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారు. దీంతో అభివృద్ధి పనులకు అప్పులు చేయాల్సిన పరిస్థితిలోకి తెలంగాణ వెళ్లింది. ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే పరమావధిగా సంక్షేమ పథకాలను జనంలోకి వదిలారు. హుజూరాబాద్‌కు జరిగిన ఉప ఎన్నికలో ఈటల రాజేందర్‌ను ఓడించేందుకు కేసీఆర్ 'దళితబంధు' పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన దళిత కుటుంబాలకు పది లక్షల రూపాయల వంతున పంచిపెట్టారు. అయినా ఆ ఉప ఎన్నికలో అధికార బీఆర్ఎస్ ఓడిపోయి ఈటల రాజేందర్ గెలిచారు. ఆ తర్వాత 'దళిత బంధు' పథకం కూడా అటకెక్కింది. దళితులకేనా 'బంధు'... మాకివ్వరా? అని మిగతా వర్గాల ప్రజలు అలకబూనారు. దీంతో కేసీఆర్ పరిస్థితి ఉభయ భ్రష్టత్వం అయింది. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను కూడా ఎడా పెడా అమ్మేశారు. అయినా రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతూనే ఉంది. ఈ దశలో ఎన్నికలు రావడం, ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ కూడా గ్యారెంటీల పేరుతో సరికొత్త హామీలు ఇచ్చింది. కారణాలు ఏమైనా, 2023 ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నాక రేవంత్ రెడ్డికి తత్వం బోధపడటం మొదలైంది. రైతు రుణ మాఫీ కోసం దాదాపు పాతిక వేల కోట్ల రూపాయలు పంచిపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనం పొందకపోగా... కేసీఆర్ ప్రారంభించిన పథకాలకు నిధులు సమకూర్చలేక గుడ్లు తేలేసింది. దీంతో ప్రభుత్వం అప్పుల వేటకు బయలుదేరింది.


ఏపీలో ఆపసోపాలు...

తోటి వాడు తొడ కోసుకుంటే తాను మెడ కోసుకున్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల జాతరకు తెర లేపారు. అప్పట్లో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో ప్రారంభమైన అనేక పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆపసోపాలు పడ్డారు. మొత్తానికి ముక్కుతూ మూలుగుతూ ఐదేళ్ల కాలం పూర్తయింది. ఎన్నికలు వచ్చి పడటంతో వృద్ధాప్య పింఛన్లను చంద్రబాబు రెండు వేలకు పెంచారు. అంతటితో ఆగకుండా 'పసుపూ కుంకుమ' పేరిట డ్వాక్రా మహిళలకు పదివేల రూపాయల వంతున పంచిపెట్టారు. చంద్రబాబు అధికారం కోల్పోకుండా ఇలాంటి పథకాలు అడ్డుకోలేక పోయాయి. 2014లో తాము అధికారంలోకి వచ్చినట్టేనన్న అతి విశ్వాసంతో ఉండి బోర్లాపడిన జగన్మోహన్ రెడ్డి... 2019 ఎన్నికల్లో మాత్రం చాన్స్ మిస్ కాకూడదని భావించి 'నవరత్నాలు' పేరిట సరికొత్త పథకాలను ప్రకటించారు. అనూహ్యంగా 151 సీట్లతో అధికారంలోకి వచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఆయన ఎన్నో పిల్లిమొగ్గలు వేశారు. ఐదేళ్లలో సంక్షేమ పథకాల పేరిట దాదాపు రెండున్నర లక్షల కోట్లు పంచారు. ఈ డబ్బు సమకూర్చుకునేందుకు భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వ ఆదాయాన్ని తాకట్టు పెట్టారు. ప్రభుత్వ ఆస్తులను, కార్యాలయాలను కూడా కుదువ పెట్టి అప్పు చేశారు. తన చేతికి ఎముక లేదని, తాను పేదల పెన్నిధినని, అపర దానకర్ణుడినని చెప్పుకొచ్చారు. ఐదేళ్లు గడచిపోయాయి. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, బటన్లు నొక్కినా 2024 ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు మాత్రమే వచ్చాయి. తెలంగాణలో కేసీఆర్‌ను గానీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డిని గానీ సంక్షేమ పథకాలు కాపాడలేదు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024లో 'సూపర్ సిక్స్' పేరిట సరికొత్త హామీలు ఇచ్చారు. 'అమ్మ ఒడి' స్థానంలో తీసుకు వచ్చిన 'తల్లికి వందనం' పథకం కింద ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ సాలీనా 15 వేల రూపాయల వంతున పంచుతామని ప్రకటించారు. వృద్ధాప్య పెన్షన్ల మొత్తాన్ని ఏకంగా నాలుగు వేలకు పెంచారు. దేశంలో మరే రాష్ట్రంలో కూడా, ఆర్థికంగా అంతో ఇంతో పటిష్ఠంగా ఉన్న తమిళనాడులో కూడా పెన్షన్లు నాలుగు వేలు లేవు. ఇదే కాకుండా మహిళలకు ఏటా 15 వేల వంతున ఇస్తామన్నారు. ఇది ఇంకా అమలు కాలేదు. అమలు అవుతుందన్న గ్యారెంటీ కూడా లేదు. సూపర్ సిక్స్‌లో మిగతా వాటిని ముక్కీ మూలిగి అమలు చేస్తున్నారు. ఆటో డ్రైవర్లకు ఏటా 15 వేల వంతున పంచుతామంటున్నారు. జగన్‌రెడ్డి లిక్కర్ భవిష్యత్ ఆదాయాన్ని కుదువపెట్టగా, చంద్రబాబు అదే బాటలో గనుల ఆదాయాన్ని కుదువపెట్టారు. తమాషా ఏమిటంటే, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నాడు జగన్మోహన్ రెడ్డి పది లక్షల కోట్లు అప్పులు చేశారని తెలుగుదేశం పార్టీ విమర్శించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులు చూసి జగన్ అండ్ కో గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వాలకు ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి నిధులు మూలుగుతుంటే ప్రజలకు పంచిపెట్టడంలో తప్పు లేదు. అభివృద్ధి చెందిన కొన్ని దేశాలలో పన్ను చెల్లింపుదారులు సీనియర్ సిటిజన్లయ్యాక వారు చెల్లించిన సొమ్ములో కొంత మొత్తాన్ని వృద్ధాప్యంలో పెన్షన్ రూపంలో తిరిగి చెల్లిస్తారు. మన దేశంలో ఈ వెసులుబాటు లేదు. ఏదైనా కంపెనీ లాభాలు గడిస్తే పన్నులు చెల్లిస్తూనే ఉండాలి. అదే కంపెనీ కర్మకాలి నష్టాల్లోకి వెళితే ప్రభుత్వాలు గానీ, ఆర్థిక సంస్థలు గానీ ముఖం కూడా చూడవు. వ్యక్తిగతంగా ఆదాయపు పన్ను చెల్లించిన వారిని కూడా వృద్ధాప్యంలో ప్రభుత్వాలు ఆదుకోవు. పన్ను చెల్లింపుదారుల జాబితాలో ఉన్నందువల్ల ప్రభుత్వాలు అమలు చేస్తున్న పెన్షన్ వంటి సంక్షేమ పథకాలు కూడా వారికి వర్తించవు.

ఒక్కొక్కరికి వంద– రెండు వందలతో మొదలైన పంపకం ఇప్పుడు వేలకు చేరింది. గతంలో పేదలకు మాత్రమే డబ్బు పంచేవారు. ఇప్పుడు మొత్తం ఓటర్లకు పంచాల్సి వస్తోందట! అనేక చోట్ల భూస్వాములు, వ్యాపారులు, ఇతర ధనవంతులు, ప్రభుత్వ అధికారులు కూడా సిగ్గు లేకుండా డబ్బు తీసుకుంటున్నారు.

రేషన్ బియ్యమే దిక్కా?

ఇప్పుడు మళ్లీ తెలుగు రాష్ట్రాల విషయానికి వద్దాం! ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నాయని ఆయా ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. అలాంటప్పుడు పేదరికం తొలగిపోవాలి కదా? అయితే మన రాజకీయ పార్టీల స్వార్థం వల్ల పేదల సంఖ్య కూడా ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ), ఫీజు చెల్లింపు వంటి పథకాలకు తెల్ల రేషన్ కార్డుతో ముడిపెట్టడం ప్రభుత్వాలు చేస్తున్న అతి పెద్ద తప్పిదం. ఈ కారణంగా ప్రభుత్వ ఉద్యోగులు మినహా మిగతా వారందరూ తెల్ల రేషన్ కార్డులు సొంతం చేసుకుంటున్నారు. ఆహార భద్రత కార్డులు పొందడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రెండు తెలుగు రాష్ట్రాలలో అమలు చేయడం లేదు. తెలంగాణ జనాభా మూడున్నర కోట్లు కాగా ఆహార భద్రతా కార్డులు, అంటే తెల్ల రేషన్ కార్డుల వల్ల లబ్ధి పొందుతున్న వారి సంఖ్య 3 కోట్ల 25 లక్షలు. ఇప్పుడు తెలంగాణలో 1,01,22,324 తెల్ల కార్డులు ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండున్నర లక్షల కార్డులు జారీ చేయబోతున్నది. దీంతో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారుల సంఖ్య 3 కోట్ల 35 లక్షలకు పెరుగుతుంది. అంటే, రాష్ట్రంలో 15 లక్షల మంది మాత్రమే దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నట్టా? ప్రభుత్వ ఉద్యోగులే పది లక్షల మంది ఉన్నారు కదా? రాష్ట్రంలో కార్ల సంఖ్య 25 లక్షలకు పైగా ఉంది. కాంట్రాక్టర్లు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న ప్రైవేటు ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారి మాటేమిటి? ఒక్క మాటలో చెప్పాలంటే 15 లక్షల మందిని తీసేస్తే మిగతా ప్రజలంతా దారిద్ర్యంలో ఉన్నట్టే! ఇంతకంటే దారుణం ఉంటుందా? తెలంగాణలో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులకు కిలో రూపాయి వంతున పంపిణీ చేస్తున్న సన్నబియ్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై సాలీనా దాదాపు 15 వేల కోట్ల రూపాయల భారం పడుతోంది. 1983లో కిలో రెండు రూపాయలకు బియ్యం పథకాన్ని ఎన్టీఆర్ ప్రవేశపెట్టినప్పుడు సంక్షేమ రంగంలో అదొక విప్లవంగా చెప్పుకొన్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత కిలో బియ్యం రూపాయికే ఇవ్వడం సంక్షేమం అవుతుందా? రాజకీయ పార్టీల బాధ్యతా రాహిత్యం అవుతుందా? ఈ అరాచక ధోరణుల వల్లనే తెలుగు రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం నిజం కాదా? ఇక... ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 1 కోటి 70 లక్షల కుటుంబాలు ఉండగా, అందులో 1 కోటి 45 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ రాష్ట్రంలో కూడా బియ్యంపై ఏటా 15 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. తమాషా ఏమిటంటే, రాష్ట్రంలో మొబైల్ కనెక్షన్ల సంఖ్య 8 కోట్ల 20 లక్షలు. ద్విచక్ర వాహనాల సంఖ్య 1 కోటి 22 లక్షలకు పైగా ఉంది. రాష్ట్ర తలసరి ఆదాయం 2 లక్షల 66 వేలు అని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారి సంఖ్య దాదాపు 40 లక్షల వరకు ఉంది. అన్ని రకాల సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డుతో ముడిపెట్టడం వల్లనే వాటి కోసం జనం ఎగబడుతున్నారు. ఈ కార్డు కింద పంపిణీ చేస్తున్న బియ్యం రీ సైకిల్ అవుతున్న విషయం బహిరంగ రహస్యం. కుటుంబాల సంఖ్యను మించి తెల్ల రేషన్ కార్డులు ఉంటున్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వంటి వారు పలు సందర్భాలలో చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఈ విషయం తెలుసు. అయితే, తెల్ల రేషన్ కార్డుల ఏరివేతకు పూనుకుంటే రాజకీయంగా మూల్యం చెల్లించవలసి వస్తుందని ఏ రాజకీయ పార్టీ కూడా అందుకు సాహసించడం లేదు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండివుంటే, పోతే పోనీలే ప్రజలే కదా లబ్ధి పొందుతున్నది అని సరిపెట్టుకోవచ్చు. కానీ... ఆ పరిస్థితి లేదు కదా!



విద్య, వైద్యం ముఖ్యం కాదా...

ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజుల చెల్లింపు పథకం కింద ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వేల కోట్లకు చేరుతున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) పథకం కింద ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలు వేల కోట్లలో పేరుకుపోతున్నాయి. దాదాపు రెండు దశాబ్దాలుగా అమలులో ఉన్న ఈ రెండు పథకాలకు అవసరమైన నిధులు సమకూర్చకుండా మరింత ఆర్థిక భారం పడే కొత్త పథకాల అమలుకు పూనుకొనే అధికారం రాజకీయ పార్టీలకు ఎవరిచ్చారు? విద్య, వైద్యం విషయంలో అనేక దేశాలలో ప్రభుత్వాలే ఖర్చు భరిస్తుంటాయి. అయితే, అందులో అనేక పరిమితులు ఉన్నాయి. మన దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో అర్హత లేకపోయినా అన్ని పథకాలనూ అందరికీ అందిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యనే తీసుకుందాం. ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తోంది కదా అని తగిన అర్హతలు లేని వారు కూడా ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరుతున్నారు. వీళ్లు రేపటి నిరుద్యోగులుగా మిగులుతున్నారు. మన దేశంలోనే కాదు, తెలుగునాట కూడా ఒకప్పుడు సిద్ధాంత ప్రాతిపదికన ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత తాము అధికారంలోకి వస్తే ఫలానా అభివృద్ధి పథకం ప్రారంభిస్తామని హామీ ఇచ్చేవారు. ఆ తర్వాత కాలంలో ప్రజలకు డబ్బు పంచడం మొదలైంది. ఇప్పుడది ఆ దశ దాటి ప్రభుత్వ సొమ్ము, అంటే ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్న సొమ్మును సంక్షేమం పేరిట పంచుతామని చెప్పి ఎన్నికల్లో పోటీచేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా బియ్యంపై ఏటా 15 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. తమాషా ఏమిటంటే, రాష్ట్రంలో మొబైల్ కనెక్షన్ల సంఖ్య 8 కోట్ల 20 లక్షలు. ద్విచక్ర వాహనాల సంఖ్య 1 కోటి 22 లక్షలకు పైగా ఉంది. రాష్ట్ర తలసరి ఆదాయం 2 లక్షల 66 వేలు అని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారి సంఖ్య దాదాపు 40 లక్షల వరకు ఉంది. అన్ని రకాల సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డుతో ముడిపెట్టడం వల్లనే వాటికోసం జనం ఎగబడుతున్నారు. ఈ కార్డు కింద పంపిణీ చేస్తున్న బియ్యం రీ సైకిల్ అవుతున్న విషయం బహిరంగ రహస్యం. కుటుంబాల సంఖ్యను మించి తెల్ల రేషన్ కార్డులు ఉంటున్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వంటి వారు పలు సందర్భాలలో చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఈ విషయం తెలుసు. అయితే, తెల్ల రేషన్ కార్డుల ఏరివేతకు పూనుకుంటే రాజకీయంగా మూల్యం చెల్లించవలసి వస్తుందని ఏ రాజకీయ పార్టీ కూడా అందుకు సాహసించడం లేదు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండివుంటే, పోతే పోనీలే ప్రజలే కదా లబ్ధి పొందుతున్నది అని సరిపెట్టుకోవచ్చు. కానీ... ఆ పరిస్థితి లేదు కదా!

ఆ దారిలోనే అందరూ...

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా హామీలు ఇచ్చింది. ఇప్పుడు సదరు హామీలను అమలు చేయలేక దిక్కులు చూస్తోంది. దీంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. అయితే, ఈ విషయంలో ఆ పార్టీని తప్పు పట్టాల్సింది కూడా లేదు. నాడు కేసీఆర్ అయినా, నేడు రేవంత్ రెడ్డి అయినా తమ సొంత ఆస్తులు అమ్మి పథకాలను అమలు చేయడం లేదు – చేయరు! ఈ ఇరువురు కూడా అప్పులు చేసి పథకాలను అమలు చేయాల్సిందే. అప్పు దొరికితే సరేసరి, లేనప్పుడే తంటా అంతా! గత కొన్నేళ్లుగా అమలవుతున్న పథకాలను తమ హక్కుగా ప్రజలు భావిస్తున్నారు. అందుకే సంక్షేమ పథకాలు అమలు చేసినంత మాత్రాన అధికారం నిలబెట్టుకోవచ్చునని అనుకోవడానికి లేదు. అయినా రేసులో వెనుకబడి పోకూడదని రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. అప్పు చేసి పప్పు కూడు తింటున్నామా అంటే అది కూడా లేదు! ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఏమాత్రం మెరుగుపడ్డం లేదు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కర్ణాటకలో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని, అవి మెరుగుపడే అవకాశం కూడా కనపడటం లేదని, అంచేత తాము మరో రాష్ట్రానికి తరలిపోవాలని ఆలోచిస్తున్నట్టు 'బ్లాక్ బక్' కంపెనీ వ్యాఖ్యానించింది. కర్ణాటకకు అయినా, తెలంగాణకు అయినా, ఆంధ్రప్రదేశ్‌కు అయినా ఇంతకన్నా తలవంపు ఏమి ఉంటుంది? పెట్టుబడులను ప్రోత్సహిస్తామంటున్న పాలకులు బ్లాక్ బక్ కంపెనీకి ఏమి సమాధానం చెబుతారు? విద్యుత్ సరఫరా గురించి చెప్పేది ఏముంది? ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు ఉండవు. సంక్షేమ వసతి గృహాల మెస్ బిల్లులు కూడా సకాలంలో చెల్లించరు. దీంతో ఆహార నాణ్యత లోపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో సిబ్బంది కొరత ఉండనే ఉంది. అత్యవసరమైన మందులు ఉండవు. ఇలా చెప్పుకొంటూ పోతే అంతుండదు. ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కూడా పేరుకుపోతున్నాయి. పదవీ విరమణ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించలేక పదవీ విరమణ వయసు పెంచుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇవే పరిస్థితులు. సూపర్ సిక్స్ అమలు చేస్తావా? చస్తావా? అని ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒత్తిడి తెస్తున్నారు. ఇవాళ కాకపోతే రేపు సూపర్ సిక్స్ అమలవుతాయి. నిన్నటిదాకా జగన్‌రెడ్డి అప్పులు చేయడం, తాకట్టు పెట్టడం చేశారు. ఇప్పుడు చంద్రబాబు అదే పని చేస్తారు. అంతిమంగా మునిగిపోయేది రాష్ట్రమే. చంద్రబాబు కంపెనీలుగానీ, జగన్‌రెడ్డి కంపెనీలుగానీ ఆ భారాన్ని భరించవు కదా! రెండు రాష్ట్రాలలోనూ ప్రభుత్వాలు చెల్లించాల్సిన బకాయిలు లక్షల కోట్లకు చేరాయి. చిన్నా చితకా పనులు చేసిన వారు సకాలంలో బిల్లులు పొందలేక నలిగిపోతున్నారు. ఇదే అదనుగా గతంలో లేని విధంగా, బిల్లులు చెల్లించాలంటే 'నాకేంటి' అని అడగడం మొదలైంది. ఇదివరకు పనులు కేటాయించినందుకే కమీషన్లు తీసుకొనేవారు. ఇప్పుడు బిల్లులు చెల్లించడానికి కూడా కమీషన్లు తీసుకోవడం ప్రారంభించారు. దీంతో పనుల అంచనాలు పెరుగుతున్నాయి. కోటి రూపాయలతో పూర్తయ్యే పనికి రెండు కోట్లతో అంచనాలు రూపొందిస్తున్నారు. ఇక్కడ కూడా ప్రజలే బాధితులు. ఒకవైపు సంక్షేమం పేరిట పంపకాలకు పాల్పడుతూ మరో వైపు అవినీతికి గేట్లు ఎత్తుతున్నారు. ఈ అవినీతి సొమ్ములో కొంత మొత్తాన్ని ఎన్నికల సమయంలో ప్రజలకు పంచుతున్నారు. ఒక్కొక్కరికి వంద- రెండు వందలతో మొదలైన పంపకం ఇప్పుడు వేలకు చేరింది. గతంలో పేదలకు మాత్రమే డబ్బు పంచేవారు. ఇప్పుడు మొత్తం ఓటర్లకు పంచాల్సి వస్తోందట! అనేక చోట్ల భూస్వాములు, వ్యాపారులు, ఇతర ధనవంతులు, ప్రభుత్వ అధికారులు కూడా సిగ్గు లేకుండా డబ్బు తీసుకుంటున్నారు. ఇదంతా ఒక విష వలయంగా మారింది.

ఆగేది ఎప్పుడు.. ఆపాల్సింది ఎవరు?

సంక్షేమ పథకాల ప్రకటనలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కొంత బాధ్యతగా వ్యవహరించారు. రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు చెల్లింపులు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేసినా... 2009 ఎన్నికల్లో గట్టెక్కేందుకు మరికొన్ని పథకాలు ప్రకటించాలని సన్నిహితులు సూచించగా, 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నాకు తెలుసు. ఇంతకంటే ఎక్కువ చేయలేం. గెలిస్తే గెలుస్తాం లేదంటే లేదు' అని కరాఖండిగా చెప్పారట! ఈ విషయంలో ఆయనను అభినందించాల్సిందే. ఈ నేపథ్యంలో పిల్లి మెడలో ఎవరు గంట కట్టాలన్నది ప్రశ్నగా మన ముందు ఉంది. వరాల జల్లు కురిపించడంలో వెనుకబడకూడదని అన్ని రాజకీయ పార్టీలూ భావిస్తున్నాయి. సంక్షేమ పథకాల పేరిట డబ్బు పంచిపెట్టినంత మాత్రాన ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తున్నారా? అంటే అదీ లేదు! ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ ప్రజలకు డబ్బు పంచుతున్నాయి. అయితే, ప్రజలు మాత్రం తాము అనుకున్న వారికే ఓటు వేస్తున్నారు. ఇరు పార్టీలు డబ్బు ఇచ్చాయి కదా అని సగం ఓట్లు ఒకరికి, మిగతా సగం ఓట్లు మరొకరికీ వేయడం లేదు. ఈ డబ్బు పంపకంలో రాజకీయ పార్టీలు అలసిపోయే రోజు ఎంతో దూరంలో లేదు. అలాగే సంక్షేమ పథకాల రేసుకు ఎక్కడో ఒక చోట ఫుల్ స్టాప్ పడకపోతే పథకాలు పొందని ప్రజలు, పన్నులు చెల్లిస్తున్న వారు ఏదో ఒక రోజు రోడ్ల మీదకు వస్తారు. తెలుగు రాష్ట్రాలు రాజకీయ పార్టీల సొంతం కాదు. భావి తరాలకు ఇక్కడ మంచి భవిష్యత్తు ఉండాలి. అలా జరగాలంటే రాజకీయ పార్టీలను కట్టడి చేయడానికి ప్రజలే పూనుకోవాలి. ముఖ్యమంత్రులు వస్తుంటారు - పోతుంటారు. నష్టపోయేది రాష్ట్రాలు- అక్కడ నివసించే ప్రజలే! సో.. పౌర సమాజమే చొరవ తీసుకొని హద్దులు మీరుతున్న సంక్షేమ పథకాల అమలుకు నిరసనగా ప్రజలను చైతన్య పరచాలి. లేని పక్షంలో రెండు తెలుగు రాష్ట్రాలు కోలుకోలేని విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోతాయి!

వెన్నయతో కాకతీయ వంశోద్భవం

కాకతీయ వంశ ఆదిపురుషుడు 'గుండన' అనీ, నందిగామ మండలం మాగల్లు సమీపంలోని కాకర్తి గ్రామం 'ఆ వంశ ఆద్యుడు' జన్మస్థలమంటూ ఈనెల 15న ప్రచురితమైన వార్తాకథనానికి స్పందన ఇది.

బయ్యారం చెరువు శాసనం, జనగామ జిల్లా పాలకుర్తి దగ్గరలో గల గూడూరు శాసనం సాక్షిగా... కాకతీయ వంశ మూలపురుషుడు గుండన కాదు 'వెన్నయ'. ఇది నేను చెబుతున్నది కాదు. కాకతీయుల చరిత్రను పరిశోధించేందుకు జీవితకాలం కృషి చేసిన పి.వి పరబ్రహ్మ శాస్త్రి లోకానికి చాటిన విషయాల్లో ఇదొకటి.

కాకతీయ వంశవృక్షంలో, క్షత్రియులు తరచుగా పేర్కొనే చారిత్రక పురుషుడు దుర్జయుడు కనిపిస్తాడు. ఆ తర్వాత కాకతీయ వంశస్థాపకుడిగా 'వెన్నయ' కనిపిస్తాడు. ఆ క్రమాన్ని తన 'కాకతీయులు' గ్రంథంలో పరబ్రహ్మ శాస్త్రి ఇలా వివరించారు. 1. కాకతీ వెన్నయ (750–768). 2. మొదటి గుండన (768–824). 3. రెండవ గుండన (824–870). 4. మూడవ గుండన (870–895). 5. ఎర్రయ నాయకుడు (895–940). 6. నాల్గవ గుండన (కాకర్త్య గుండన) (950–995)... ఇలా కాకతీయ వంశకర్త వెన్నయ నాయకుడి నుంచి 14వ తరం వాడైన గణపతిదేవుని వరకు వరుసగా బయ్యారం శాసనం పేర్కొంటున్నది. ఈ సమగ్ర శాసనాన్ని గణపతిదేవ చక్రవర్తి సోదరి అయిన మైలాంబ బయ్యారం చెరువు తవ్వించి, తన స్వహస్తాలతో అక్కడ ప్రతిష్ఠించింది.

కాకతీయ వంశ చరిత్రకు సంబంధించి ఇదొక ఆయువుపట్టు లాంటి శాసనం. కాకతీయులకు సంబంధించిన అనేకానేక శాసనాల్లో ఇంత సమగ్ర శాసనం మరొకటి లేదు! కాకతీయ వంశ మూలపురుషుడైన వెన్నయ నాయకుడు, రాష్ట్రకూట చక్రవర్తి అయిన దంతి దుర్గుని రాజ్య నిర్మాణానికి సహకరించాడు.



వెన్నయనే కాకతీయ వంశ స్థాపకుడని ఆ శాసనం ఇలా పేర్కొన్నది– "తదన్వయే వెన్న నృపో భభూవ ఖ్యాతస్సదా సన్నతవైరి భూపయా కాకతిస్థ పృథివీం శశాస తేనాస్య వంశ్యా అపి కాకతీశా." అదేవిధంగా చాళుక్య గాంగ కుమార సోమేశ్వరుడు 1124 లో వేయించిన గూడూరు శాసనంలో కూడా "వెన్నడను సంభవుడైయ్యనది ప్రసిద్ధుడై వినుతి విరోధి మాండలిక వెన్నడు వెన్నుడై పోలె" అంటూ ఆ శాసనంలో వెన్నయ ప్రస్తుతి కనిపిస్తుంది. ఈ వెన్నయ కక్కిరాలపల్లి, కట్ర్యాల, పంతిని గ్రామాల మధ్యలో ఒకప్పుడు ఉండిన కాకతీపురానికి అధిపతి! రాష్ట్రకూటుల సామంతునిగా ఈ కాకతీ పురాధిపతిగా ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం ఉన్న ఓరుగల్లు కోటకు కూతవేటు దూరంలోనే ఉంది!

కాకర్త్య గుండనగా పేర్కొంటున్న అతనికి ముందు... వెన్నయ తర్వాత మరో ముగ్గురు గుండనలు ఉన్నారు. ఈ కాకర్త్య గుండనను పిండి గుండన అని కూడా అంటారు అంతే కాదు, ఓరుగల్లు స్థానిక చరిత్రకారులు ఆయనను 'పెండ్లి గుండన' అని కూడా అంటారు. అదెలాగంటే ఈ గుండన కాకతీ ఎర్రయ్య రాజుకు అల్లుడిగా రావడం వల్ల పెండ్లి గుండనగా పిలవబడ్డాడు.


ఇక కాకతీపురం విషయానికొస్తే అది ఎక్కడో దూరంగా లేదు. ఓరుగల్లు కోటకు దగ్గరలోనే ఇందాక చెప్పుకున్నట్టు కక్కిరాలపల్లి, కట్రియాల, పంతిని గ్రామాల మధ్య ఉంది. అది ఎలాగంటే కాకతీయులకు సంబంధించిన శాసనాలు 88 దాకా ఈ చుట్టుపక్కలే దొరికాయి. ఈ శాసనాలు దొరికిన ప్రదేశాల్ని కలుపుతూ ఒక వృత్తంలాగా గీసుకుంటూ పోతే వృత్త కేంద్రంలో పురాతన కాకతీపుర శిథిలాలు ఉన్న ప్రదేశం మనకు కనిపిస్తుంది!! ఈ ప్రదేశంలోనే ఎనిమిదవ శతాబ్దంలో కాకతీయ వంశ స్థాపకుడు అయిన వెన్నయ ఈ ప్రాంతంలో కాకతీపురాన్ని నిర్మించి పరిపాలన సాగించాడు.

కాకర్త్య గుండనగా చెప్పబడుతున్న ఈ నాలుగవ గుండన తర్వాత వచ్చిన కాకతీయ పాలకుడైన బేతరాజు శాసనాలు 1051 నాటివి, పూర్వ కరీంనగర్ జిల్లాలో భాగమైన శనిగరంలో లభించాయి. 1053 నాటి కాకతీయ మొదటి ప్రోలరాజు శాసనం, కాకతీయ దుర్గరాజు వేయించిన కాజీపేట శాసనం అనుసరించి హనుమకొండను మొదటి ప్రోలరాజు శాసనబద్ధంగా పొందటాన్ని బట్టి చూస్తే కాకతీయుల పూర్వ నివాస స్థానం కాకతీపురం ఎక్కడో మైళ్ళ దూరంలో ఉన్నదని చెప్పచూడడం హాస్యాస్పదం!

మొదటి తరం, రెండవ తరం కాకతీయులు ఎవరిని తీసుకున్నా ఆనాటి పాలకులు వేయించిన శాసనాలన్నీ మనకు తెలంగాణలోనే ఎక్కువ శాతం కనిపిస్తాయి. ఆంధ్ర ప్రాంతంలో తక్కువ! రుద్రమదేవి గుడిమెట్ల కృష్ణా నది తీరంలో నిద్ర చేయడానికి గల కారణం ఆమె తండ్రి అయిన గణపతిదేవ చక్రవర్తి రాజ్య విస్తరణలో భాగంగా నిడదవోలు పాలకుడైన చాళుక్య వీరభద్రుడికి రుద్రమదేవినిచ్చి పెళ్లి చేశాడు. దురదృష్టవశాత్తు చాళుక్య వీరభద్రుడి అకాల మరణం వల్ల ఆమె, ఆ ప్రాంతంలో నిద్ర చేయాల్సి వచ్చింది. కోస్తాంధ్ర ప్రాంతంతో పాటు తమిళనాడులోని కంచి వరకు కాకతీయ సామ్రాజ్యమే కనుక అన్నిచోట్ల అక్కడక్కడ వాళ్ళ శాసనాలు నేటికీ కనిపిస్తుంటాయి! అంత మాత్రాన ప్రతి చోట కాకతీపుర అవశేషాలు వెలికితీయడం కోసం ప్రయత్నాలు చేయాలనుకోవడం వృధా ప్రయాస!!

◆ డా. అంబటి శ్రీనివాస్ రాజు
(మన కాకతీయులు గ్రంథకర్త)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 21 సెప్టెంబరు 2025





అన్‌లిమిటెడ్ జోష్

విజయవాడ ఉత్సవ్

- 11 రోజులు 250కి పైగా ప్రదర్శనలు
- తుమ్మలపల్లిలో సందడిగా ఆడిషన్స్

దసరాను పురస్కరించుకుని నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ నగరవాసుల్లో అన్‌లిమిటెడ్ జోష్ నింపనుంది. ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలో 11 రోజుల పాటు బిగ్గెస్ట్ కార్నివల్‌గా దీనిని నిర్వహించనున్నారు. ఓవైపు ఈ ఉత్సవ్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నగరవ్యాప్తంగా ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తుండగా, మరోవైపు తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శనివారం ధూమ్‌ధామ్‌గా ఆడిషన్లు జరిగాయి. దసరా వైభవం ప్రతిబింబించేలా మిస్ విజయవాడ సంప్రదాయ వస్త్రధారణ పోటీలు జరగ్గా, 500 మందికి పైగా చిన్నారులు, బాలికలు, యువతులు, గృహిణులు హాజరయ్యారు.

8



నైవేద్యమస్తు

కౌంట్‌డౌన్ 1

దసరా ఉత్సవాల్లో దుర్గమ్మకు విశిష్ట నివేదనలు

ఒక్కో అలంకారానికి ఒక్కో వంటకం

6

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో విశేష అలంకారాల్లో దుర్గమ్మ దర్శనమివ్వడం ఒక విశిష్టత అయితే, ఆయా రూపాల్లో కొలువుదీరిన జగన్మాతకు నైవేద్యాలు సమర్పించడం మరో విశేషం. సాధారణంగా దుర్గమ్మకు నిత్యం ఐదు రకాల నైవేద్యాలు సమర్పిస్తారు. కానీ, దసరా ఉత్సవాల్లో అలంకారాన్ని బట్టి మారుతూ ఉంటాయి. ఈ ఉత్సవాల్లో అమ్మవారికి అర్చకులు ఏయే నైవేద్యాలు సమర్పిస్తుంటారు. వాటి విశిష్టతపై ప్రత్యేక కథనం..

నగరంలో రైస్ ఏటీఎం

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక

- వన్‌టౌన్‌లోని చౌక దుకాణంలో ఏర్పాటుకు ప్రతిపాదన
- ఇక బయోమెట్రిక్ ద్వారా నిత్యావసరాలు తీసుకోవచ్చు
- 24 గంటలూ ఎప్పుడైనా రేషన్ పొందొచ్చు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో రైస్ ఏటీఎంల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. బ్యాంకు ఏటీఎంలలో డబ్బును తీసుకున్నట్టుగా రేషన్ సరుకులు కూడా ఎవరి ప్రమేయం లేకుండా రైస్ ఏటీఎంలలో తీసుకునేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. పైలెట్ ప్రాజెక్టుగా విజయవాడను ఎంపిక చేయడంతో పాటు రైస్ ఏటీఎం ఏర్పాటుకు అనువైన రేషన్ డిపోను ప్రతిపాదించాల్సిందిగా సివిల్ సప్లయిస్ కమిషనరేట్ నుంచి ఆదేశాలు వచ్చాయి. వన్‌టౌన్‌లో డీలర్ గుర్నాథానికి చెందిన చౌక డిపో (నెంబర్ 0684015)లో రైస్ ఏటీఎం ఏర్పాటుకు ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌వో పాపారావు ప్రతిపాదించారు. సివిల్ సప్లయిస్ కమిషనరేట్ అధికారులు నిర్దేశించిన ప్రకారం పొడవు 25 అడుగులు, వెడల్పు 35 అడుగులు ఉన్న డిపోను ఎంపిక చేశారు. పైలెట్ ప్రాజెక్టుగా ఈ డిపోలో రైస్ ఏటీఎంను ఏర్పాటు చేయనున్నారు.

● ఇక రేషన్ తీసుకోవడం తేలిక

దేశంలో తొలిసారిగా రైస్ ఏటీఎం విధానాన్ని ఒడిశాలో ప్రవేశపెట్టారు. దీనిని రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉంది. ఈ ఏటీఎం ద్వారా కార్డుదారులు, వారి కుటుంబ సభ్యులెవరైనా కేవలం బయోమెట్రిక్ అథంటికేషన్ ఇవ్వటం ద్వారా నిత్యావసరాలను తీసుకోవచ్చు. రేషన్ కార్డు డేటా ఏటీఎంకు ఫీడై ఉంటుంది. ఆ డేటా ప్రకారం ఎవరికి ఎంత సరుకు ఇవ్వాలో అదే ఇస్తుంది. డీలర్ ఎప్పటికప్పుడు రైస్ ఏటీఎంలలో బియ్యం, గోధుమలు, కందిపప్పు, పంచదార వంటివి నింపుతూ ఉంటే సరిపోతుంది. ఈ విధానం వల్ల నకిలీ రేషన్‌కార్డులు, డబుల్ ఎంట్రీలకు ఆస్కారం ఉండదు. నిత్యావసరాలు కూడా పక్కదారి పట్టే అవకాశం ఉండదు. నిరంతరాయంగా ప్రజలకు అందుబాటులో ఉంటుంది. రేషన్ దుకాణాల దగ్గర పడిగాపులు పడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు.

అంబరాన్నంటేలా..

తుదిదశకు దసరా ఉత్సవ ఏర్పాట్లు

రూ.500 టికెట్ రద్దు.. వీఐపీలకు రెండు స్లాట్‌లు కేటాయింపు

ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల మధ్యే దర్శనం



పూర్తయిన క్యూలైన్లు

- మూలానక్షత్రం రోజున 22 గంటల పాటు దర్శనం
- వినాయక ఆలయం నుంచి ఇంద్రకీలాద్రి వరకు 35 సెక్టార్లు
- ఏఐ ద్వారా మొత్తం పర్యవేక్షించాలని నిర్ణయం
- 6 వేల మంది పోలీసులు.. 1,400 మంది పారిశుధ్య కార్మికులు
- మీడియా సమావేశంలో అధికారుల కీలక నిర్ణయాలు

రాష్ట్ర పండుగ దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. ఇప్పటికే క్యూలైన్ల పనులు పూర్తికాగా, శనివారం జరిగిన అధికారుల సమావేశంలో కీలక నిర్ణయాలు వెల్లడించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో వీఐపీ దర్శనాలకు రెండు స్లాట్లు కేటాయించడంతో పాటు పోలీసు బందోబస్తు, భద్రత, మూలానక్షత్రం రోజు ఏర్పాట్లు, దర్శన వేళలు.. వంటి వివరాలను తెలియజేశారు. కొత్త అన్నదాన భవనంలో అన్నదానం ట్రయల్ రన్ నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి మొదలయ్యే ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సామాన్య భక్తులకు పెద్దపీట అనే నినాదంతో ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఉత్సవాల్లో తలెత్తిన లోపాలను సరిచేసి కొత్త విధానాలను అమలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, ఈవో శీనానాయక్, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాద్‌శర్మతో కలిసి మహామండపంలో శనివారం మీడియాతో మాట్లాడారు. సోమవారం ఉదయం 8-8.30 మధ్య దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఆరంభం రోజున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి అనిత తొలి దర్శనం చేసుకుంటారు.

వీఐపీలకు రెండు స్లాట్‌లు

ఉత్సవాల్లో సాధారణ భక్తులు సులువుగా దర్శనం చేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వీఐపీలకు రెండు స్లాట్‌లను కేటాయించారు. వీఐపీలు ఈ స్లాట్‌ల్లో మాత్రమే మిగతా 6లో..



రాజగోపురానికి విద్యుద్దీప కాంతులు

రూ.500 టికెట్ రద్దు

వీఐపీ క్యూగా భావించే రూ.500 టికెట్‌ను అధికారులు రద్దు చేశారు. ఆలయంలో రూ.500, రూ.300, రూ.100, ఉచిత దర్శనం క్యూలు ఉన్నాయి. సాధారణ రోజుల్లో రూ.500 టికెట్ కొన్న భక్తులకు అంతరాలయం దర్శనం కల్పిస్తారు. శరన్నవరాత్రుల్లో అధికారులు దీన్ని వీఐపీ క్యూగా మారుస్తున్నారు. ఈ క్యూ ఉన్న స్థానంలోకి రూ.300 టికెట్ కొన్న భక్తులను, రూ.300 క్యూ ఉన్న స్థానంలోకి రూ.100 క్యూ భక్తులను, దాని స్థానంలోకి ఉచిత దర్శనం భక్తులను తీసుకొస్తారు. మూలానక్షత్రం రోజున దర్శనం టికెట్లు రద్దు చేశారు. ఆ రోజున 22 గంటల పాటు భక్తులకు దర్శనం ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.

● కేటాయించిన వాహనాల్లో వస్తేనే అనుమతి

వీఐపీల దర్శనానికి స్లాట్‌లు కేటాయించినందున సిఫార్సులతో వచ్చే వారిని దేవస్థానం కేటాయించిన వాహనాల్లో వస్తేనే దర్శనానికి అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. వీఐపీ భక్తుల కోసం పదిచోట్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీఐపీల కోటాలో భక్తులను పంపాలనుకునే వారు దేవస్థానానికి సంబంధించిన యాప్‌లో ఒక్కరైనా, గ్రూపుగా అయినా టికెట్లను బుక్ చేసుకోవచ్చు. వీఐపీల కోసం కలెక్టర్ కార్యాలయం, సీపీ కార్యాలయం, స్టేట్ గెస్ట్‌హౌస్, వీఎంసీ, పున్నమి, భవానీ ఘాట్లలో కౌంటర్లు ఏర్పాటు చేశారు.



గాలివానకు వన్‌టౌన్‌లో కార్లపై పడిన హోర్డింగ్‌లు

కుండపోత

జిల్లాలో భారీవర్షం.. నగరం జలమయం

విజయవాడ సిటీ, ఆంధ్రజ్యోతి : పగలంతా ఎండ, రాత్రంతా వర్షం.. శనివారం జిల్లాలో పరిస్థితి ఇది. నగరంలో శనివారం రాత్రి భారీవర్షం కురిసింది. ఆకానికి చిల్లు పడిందా.. అనే రీతిలో గంటపాటు కుండపోతగా పడింది. ఉదయం నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉక్కపోత వాతావరణం ప్రజలను ఉక్కిబిక్కిరి చేసింది. ఆ తరువాత నుంచి ఆకాశం నెమ్మదిగా మేఘావృతం కావడంతో చల్లలుగాలులు వీచాయి. 6.30 నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం మొదలై గంటపాటు ఎడతెరిపి లేకుండా నగరాన్ని ముంచేసింది. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేటలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం పడింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గొల్లపూడిలో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పనులకు తీవ్ర ఆటంకం కలిగింది.

సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌గా భార్గవ్ తేజ

- అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న మల్లారపు నవీన్ బదిలీ
- కృష్ణాజిల్లా జేసీగా నవీన్‌కు పోస్టింగ్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) అదనపు కమిషనర్‌గా అమిలినేని భార్గవ్ తేజను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న మల్లారపు నవీన్ బదిలీ అయ్యారు. ఆయన్ను కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. మల్లారపు నవీన్ స్థానంలో భార్గవ్ తేజను ప్రభుత్వం నియమించింది. భార్గవ్ తేజ ప్రస్తుతం ఎంఏయూడీలో ఉన్నారు. పోస్టింగ్ కోసం కోసం ఎదురు చూస్తున్నారు. భార్గవ్ స్వస్థలం అనంతపురం జిల్లా. ప్రతిష్ఠాత్మక బిట్స్‌పిలానీలో బీఈ సివిల్ ఇంజనీరింగ్, ఎమ్మెస్సీ చేశారు. 27వ ఏటనే ఐఏఎస్ అయ్యారు. ఆయన గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా కూడా పనిచేశారు. 2014లోనే సివిల్ సర్వీస్ ఎగ్జామ్ (సీఎస్ఈ)లో 609వ ర్యాంకు సాధించి ఇండియన్ రైల్వే సర్వీస్ (ఐఆర్ఎస్)లో జాయిన్ అయ్యారు. ఐఏఎస్ కావాలన్నది భార్గవ్ తేజ కల. దీంతో 2016లో మళ్లీ సివిల్స్ రాసి 314వ ర్యాంకును సాధించారు. 2017లో మళ్లీ సివిల్స్ రాసి 88వ ర్యాంకుతో చివరికి తాను అనుకున్నది సాధించారు. సీఆర్‌డీఏ వంటి కీలకమైన సంస్థలో అదనపు కమిషనర్‌గా పనిచేసే అవకాశం దక్కింది.



అరణ్య రోదన

కొండపల్లి రిజర్వు ఫారెస్టులో వన్యప్రాణుల వేట

దుప్పిలను చంపి అక్కడే వండుకుని తింటున్న యువకులు

దుప్పిని చంపేసి, కాల్చేసి

అత్యాధునిక ఉచ్చు

దుప్పిలు, అడవి గొర్రెలు, పందుల కోసం అత్యాధునిక ఉచ్చులు

- పొలాల్లోకి వస్తున్న వన్యప్రాణులను వేటాడేందుకు సరిహద్దు వెంబడి భారీగా ఏర్పాట్లు
- అడవి గొర్రెలు, పందుల కోసం కూడా..
- హైదరాబాద్, విశాఖ నుంచి వస్తున్న వ్యాపారులు
- వేటగాళ్లతో బేరాలు.. భారీగా సాగుతున్న వేట
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

కొండపల్లి అభయారణ్యంలో వన్యప్రాణుల వేట విచ్చలవిడిగా సాగుతోంది. మాంసాహారం కోసం కొందరు.. అక్రమ రవాణా కోసం ఇంకొందరు... జీవనోపాధి కోసం మరికొందరు.. వేట సాగిస్తున్నారు. వేటగాళ్ల బారి నుంచి వన్యప్రాణులను రక్షించేవారు కరువయ్యారు.

ఎర వేసి..

దట్టమైన అటవీ ప్రాంతం నుంచి దారితప్పి తేలికపాటి అటవీ ప్రాంతానికి దుప్పిలు వస్తుంటాయి. ఇలా వచ్చిన దుప్పిలకు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న పచ్చటి పంటపొలాలు ఆకర్షిస్తుంటాయి. పరిసర ప్రాంతాల్లోని మొక్కలు, గడ్డి వంటివి తినటానికి పొలాల సమీపంలోకి వస్తుంటాయి. మిగతా 6లో..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అటవీశాఖ నిర్లక్ష్యం కారణంగా కొండపల్లి రిజర్వు ఫారెస్టులో మూగజీవాల మనుగడకు ప్రమాదం వాటిల్లుతోంది. అభయారణ్యంలో దుప్పిలు, కణుజులు, అడవి గొర్రెలు, పందుల వేట ముమ్మరంగా సాగుతోంది. వన్యప్రాణుల వేట కోసం వేటగాళ్లు ఉచ్చులు పన్నుతున్నారు. ఈ అడవి 30 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. కొండపల్లి, దుగ్గిరాలపాడు, జుజ్జూరు, కంచికచర్ల, మూలపాడు వరకు ఉంటుంది. ఇక్కడ ఎన్నో రకాల వన్యప్రాణులు ఉన్నాయి. దట్టమైన అటవీప్రాంతం నుంచి బయటకు రావు. ఒక్కోసారి కణుజులు వంటివి దారితప్పి వస్తుంటాయి. అడపదడపా దుప్పిలు, ఎక్కువగా అడవి గొర్రెలు, అడవి పందులు తేలికపాటి అటవీ ప్రాంతంలోకి కూడా వస్తుంటాయి. దుప్పి మాంసం రుచిగా ఉంటుందని, అది తింటే రాయల్‌గా ఉంటుందన్న ఉద్దేశంతో సమీప ప్రాంతాల యువకులు వీటి కోసం అటవీ ప్రాంతంలో అన్వేషిస్తుంటారు. దుప్పిలు వారి చేతికి చిక్కడం, భోజనంగా మారడం పరిపాటిగా మారిపోతోంది. అటవీ ప్రాంతంలోనే దుప్పి మాంసాన్ని వండుకుని, అక్కడే భుజించి, మద్యం సేవించి రావటం అన్నది పరిసర ప్రాంతాల ప్రజలకు సరదాగా మారిపోయింది.

2న గాంధీహిల్‌కు సీఎం చంద్రబాబు రాక 6

విధుల్లో బాధ్యతగా ఉండండి : కలెక్టర్

రేపటి నుంచి 2 వరకు దసరా సెలవులు 8

దసరా నైవేద్యాలు

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలు ప్రారంభానికి సమయం ఆసన్నమైంది. దేవీనవరాత్రుల్లో అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనం ఇస్తారు. ఆయా అలంకారాల విశేషాలకు అనుగుణంగా అమ్మకు వివిధ రకాల నైవేద్యాలు సమర్పిస్తారు. ఆ విశేషాలు తెలుసుకుందాం..

- దుర్గమ్మకు పాయసం, చక్కెర పొంగలి, లడ్డూ, కట్టెపొంగలి అంటే ఇష్టం
- దద్దోజనం, పులిహోర, గారెలు, అప్పాలు, శనగలు, వడలు, గారెల పిండితో చేసే పకోడి అంటే మక్కువ
- ఒక్కో అలంకారంలో ఒక్కో ప్రత్యేక నైవేద్యం సమర్పణ
- దసరా ఉత్సవాల వేళ కొనసాగుతున్న నైవేద్య ఆచారం



(ఆంధ్రజ్యోతి, ఇంద్రకీలాద్రి): సాధారణంగా దుర్గమ్మకు అనునిత్యం అయిదు రకాల నైవేద్యాలను సమర్పిస్తుంటారు. ఇక దసరా మహోత్సవాలు అంటే ఏ రోజుకారోజే ప్రత్యేకమైన నైవేద్యాలను సమర్పించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ నైవేద్యాలకు సంబంధించి ప్రత్యేకమైన శాస్త్ర నిబంధన లేకపోయినప్పటికీ లోకాచారం ప్రకారం పండితులు ఈ నైవేద్యాలను ఏర్పాటు చేశారు.

అమ్మవారి లలితా సహస్రనామాలను పరిశీలించినట్లయితే దుర్గమ్మ పాయసాన్న ప్రియురాలు. గుడాన్న ప్రీతమానసిని, హరిద్రానైకరసిని అని స్తోత్రాలలో ఉంటుంది. మరోవైపు ఆమెకు చాంపేయ కుసుమ ప్రియ, దాడిమీ కుసుమప్రియ అని కూడా సహస్రనామాలలో ఉంది. ముఖ్యంగా అమ్మవారు కదంబవనంలో నివసిస్తారు కనుక ఆమెకు కదంబ పూలను కూడా సమర్పిస్తారు. కుంకుమరాగశోణి కనుక కుంకుమతో పూజ చేస్తారు. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి స్వరూపిణి అయిన అమ్మవారు సర్వేశ్వరిగా, సర్వమంగళదాయినిగా, సర్వసంపత్కరిగా కొలుస్తుంటారు. అమ్మవారు శక్తిరూపంలో రాక్షస సంహారం చేసింది కనుక ఆమెను శాంతపరచటానికి తీపి పదార్థాలను నైవేద్యంగా పెట్టటమనేది ఒక ఆచారమని చెబుతుంటారు. అమ్మవారికి ఎక్కువగా పాయసం, బెల్లం కలిపిన అన్నం, పులిహోర అంటే ఇష్టమన్నది లలితా సహస్రనామాలలో తెలుస్తుంది. ఫలాల విషయానికి వస్తే ఆమెకు దానిమ్మ కాయలు అంటే చాలా ఇష్టం. దానిమ్మ కాయలను నైవేద్యంగా పెట్టటం, ఆ పళ్లతో చేసిన పదర్థాలను నైవేద్యంగా పెట్టటం విశేషంగా జరుగుతుంది. పాయసం, చక్కెర పొంగలి, లడ్డూ, కట్టె పొంగలి, పంచదార పొంగలి, దద్దోజనం, పులిహోర, గారెలు, అప్పాలు, శనగలు, వడలు, గారెల పిండితో పకోడీలాగా చేసినటువంటి పదార్థాలు అమ్మవారికి సమర్పించటం ఆచారంగా వస్తుంది.

అలంకారాలు.. నివేదనలు

బాలాత్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారికి తీపి బూందీ, శనగలు నైవేద్యంగా సమర్పిస్తారు. గాయత్రి అలంకారంలో రవ్వకేసరి, పులిహోర, అల్లం గారెలు నైవేద్యంగా పెడతారు. అన్నపూర్ణ అలంకారంలో కేవలం బెల్లపు పొంగలిని మాత్రమే పెడతారు. సర్వలోకాలు అన్నం కోసం ఆర్తితో ఎదురుచూస్తున్న సమయంలో కాశీలో ఉన్న పరమేశ్వరి దగ్గరకు వెళ్లిన శివుడు ఆమెను స్వయంగా భిక్షాటన చేస్తాడు. ఆ సమయంలో ఆమె బంగారు గిన్నె నుంచి బెల్లపు పాయసాన్ని ఇస్తుంది. ఆ క్షణం నుంచే ముల్లోకాలలోనూ అందరికీ అన్నప్రసాదం అందటం జరిగిందని పురాణాలు చెబుతున్నాయి. అన్నపూర్ణాదేవి అలంకారంలో పొంగలి సమర్పిస్తారు. కాత్యాయనీదేవికి తేనెతో చేసిన పదార్థాలు పెట్టాలని శాస్త్రవచనం ఉంది. తేనెను సమర్పించటంతో పాటు చక్కెరపొంగలి, మధుర రసాలతో కూడిన పదార్థాలు ఆమెకు సమర్పిస్తారు. మహాలక్ష్మి అలంకారంలో క్షీరాన్నం (పాయసం)లో జీడిపప్పులు, ఎండు ద్రాక్ష వంటివి కూడా ఉంటాయి. లలితా త్రిపురసుందరి దేవికి పులిహోర, గారెలు, కేసరి వంటివి సమర్పిస్తారు. మహాచండీదేవికి కూడా గారెలు, పులిహోర, తీపిపదార్థాలు సమర్పిస్తారు. సరస్వతీదేవి అలంకారంలో బెల్లంతో చేసిన అన్నం, పులిహోర, అప్పాలు వంటివి, పాలతో చేసిన పదార్థాలు నైవేద్యంగా పెడతారు. దుర్గాదేవి అలంకారంలో గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పిస్తారు. మహిషాసుర మర్దినీ అలంకారంలో చక్కెరపొంగలి, పులిహోర పెడతారు. రాజరాజేశ్వరి అలంకారంలో పాలతో చేసిన పదార్థాలతో పాటు వడలు, పొంగలి, అప్పాలు, పులిహోర, తదితరాలను సమర్పిస్తారు. అమ్మవారు పంచ సంఖ్యోపచారిణిగా పూజలు అందుకుంటున్నది కనుక ఆ మేరకు సంప్రదాయం కొనసాగుతుంది. షడ్రుచులతో కూడిన పంచభక్ష పరమాన్నాలను నైవేద్యంగా పెట్టటం ఆనవాయితీగా వస్తోంది.

సమర్పించే సమయాలు

అమ్మవారికి వేకువ జామున సుప్రభాతం అనంతరం పూజాధికాలు నిర్వహించి పెద్ద ఎత్తున సాంబ్రాణి పొగ వేస్తారు. ఈ సమయంలో ఆమెకు బాలభోగం కింద దద్దోజనం సమర్పిస్తారు. తర్వాత 10 గంటలకు రాజభోగాలు (ఆరు రకాలు) పులిహోర, రవ్వకేసరి, దద్దోజనం, కట్టె పొంగలి, లడ్డూ బూంది, చక్రపొంగలి నైవేద్యాలను సమర్పిస్తారు. దీంతో పాటు 12 గంటలకు అదనంగా గారెలతో పంచభోగాలను సమర్పిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వీటు, హాటు, శనగలు సమర్పిస్తారు. రాత్రి 6 గంటలకు మహానివేదన కదంబ వంటకంతో పాటు రెండు రకాల స్వీట్లు, రెండు రకాల హాట్లు, రెండు రకాల కూరలతో పాటు ఇలా పలు పదార్థాలను సమర్పిస్తారు.

2న గాంధీ హిల్‌కు సీఎం చంద్రబాబు రాక


సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న గాంధీ, శ్రీధర్ తదితరులు

వన్‌టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ గాంధీ హిల్‌కు విచ్చేసి మహాత్ముడికి నివాళులర్పించనున్నారు. ఈ మేరకు గాంధీ కొండపై జరుగు తున్న అభివృద్ధి పనులను గాంధీ హిల్ ఫౌండేషన్ చైర్మన్ కె.పి.సి.గాంధీ, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ శనివారం పరిశీలించారు. అధికారులతో పలు అంశాలపై చర్చించారు. పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తిచేయాలని సూచించారు. మహాత్మా గాంధీ స్మారక చిహ్నంగా ఉన్న గాంధీ హిల్ అభివృద్ధికి విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, గాంధీ హిల్ ఫౌండేషన్ ప్రతినిధులు కృషి చేస్తున్నారు. కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటానికి చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా ఆగిపోయిన ట్రాయ్ ట్రైన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. కార్యక్రమంలో గాంధీ హిల్ ట్రెజరర్ కస్తూరి శివశంకర్, మేనేజర్ రవితేజ, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ పాండురంగారావు, కన్సల్టింగ్ ఇంజనీర్‌లు రమేష్, రవీంద్ర, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఏర్పాట్లు వేగవంతం చేయండి

- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర


దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్న వరాత్రుల ఏర్పాట్లు వేగవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశించారు. శని వారం కృష్ణవేణి ఘాట్, భవానీ ఘాట్, పున్నమి ఘాట్, కెనాల్ రోడ్డు, వినాయకుడి గుడి, వన్‌టౌన్ ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమ్మవారి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, చెప్పుల స్టాండ్, మరుగుదొడ్ల సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట రూ.లక్షలు దోచుకున్న జోగి : వసంత



గొల్లపూడి, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ఉద్యోగాల పేరిట లక్షల రూపాయలు దోచుకున్న వ్యక్తి జోగి రమేష్ అని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆరోపించారు. గత ప్రభుత్వం హయాంలోనే బూడిద వ్యాపారం జరిగిందని విమర్శించారు. శనివారం గొల్లపూడి టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తొందరపడి ఒక కోయిల ముందే కూసిన చందంగా బూడిదపై జోగి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. సోమవారం అసెంబ్లీలో వీటీపీఎస్ బూడిదపై తాను ప్రశ్నించడానికి సదరు ప్రశ్న శాసనసభలో ఆమోదిం పొందిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కౌంటర్లు పెట్టి బూడిద అమ్ముకుంది జోగి రమేష్ అని విమర్శించారు. మైలవరం, పెడన, పెనమలూరు నియోజకవర్గాల ప్రజలు చెప్పుతో కొట్టాక మళ్లీ ఇక్కడకు వచ్చి కుయుక్తులు పన్నుతున్నాడని విమర్శించారు. బూడిద కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై లబ్ధి పొందడానికి లారీ అసోసియేషన్ మధ్య చిచ్చు రేపే ప్రణాళికలో భాగమే జోగి రమేష్ ప్రయత్నాలని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలకు కూడా సొంత సామాజిక వర్గానికి చెందిన వారి దగ్గర రూ.6 లక్షలు లంచం తీసుకున్నారని ఆరోపించారు.

స్కేటింగ్ పోటీలు ప్రారంభం



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో పవిత్ర సంగమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ప్రారంభించిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమ ప్రాంతం ఆధ్యాత్మికతతో పాటు ఆటవిడుపు కేంద్రంగా ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. స్కేటింగ్ కోచ్ రామకృష్ణ, అతని టీమ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ టి.లత, ఎన్.దుర్గా, టీడీపీ నాయకులు పులి దాసు పాల్గొన్నారు.

విధుల్లో బాధ్యతగా ఉండండి

- ఉద్యోగులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశం
- దసరా ఉత్సవాల విధుల నిర్వహణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న దసరా మహోత్సవాల్లో పాల్గొనే ఉద్యోగులందరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో దసరా మహోత్సవాల విధుల నిర్వహణపై జిల్లా అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి సెక్టార్‌లోనూ రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యం, వీఎంసీ, ఇంకా వివిధ శాఖల సిబ్బంది మూడు షిష్టలలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి అధికారికి ఆ సెక్టర్ గురించి స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ఆయా సెక్టార్లలో ఎలాంటి ఇబ్బంది వచ్చినా తక్షణమే కమాండ్ కంట్రోల్ కేంద్రానికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఆయా సెక్టార్లలో అనుమానాస్పద, ఉత్సవాలకు విఘాతం కలిగించే పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వృద్ధులు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం లభించేలా చూడాలన్నారు. 36 సెక్టార్ ఇన్‌చార్జ్‌లు, సిబ్బంది దృష్టి సారించాల్సిన అంశాల గురించి వివరించారు. ఎప్పటికప్పుడు భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, వారి ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఏమైనా సరిదిద్దుకోవాల్సిన అంశాలు ఉంటే వెంటనే చక్కదిద్దాలన్నారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. భక్తుల క్షేమం, భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీపీ ఎస్.వి.రాజశేఖర్‌బాబు వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటేలా..

(5వ పేజీ తరువాయి)

దర్శనానికి రావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అందరితో చర్చించి ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల్లో మాత్రమే వీఐపీలు దర్శనానికి రావాలని కోరారు. శరన్నవరాత్రుల్లో అంతరాలయం దర్శనం రద్దు చేసినప్పటికీ, ప్రొటోకాల్ జాబితాలో ఉండే వీఐపీలకు కేటాయించిన స్లాట్‌ల్లో వస్తేనే అంతరాలయం దర్శనం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. భక్తుల నుంచి ఎప్పటికప్పుడు ఏర్పాట్లపై అభిప్రాయ సేకరణ చేస్తారు. వినాయకుడి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రి వరకు ఉన్న ప్రాంతాన్ని మొత్తం 35 సెక్టార్లుగా విభజించారు. ఒక్కో సెక్టార్ పరిధిలో 100-500 మీటర్ల ప్రాంతం ఉంటుంది. భక్తుల సంచారం ఉన్న అన్ని ప్రదేశాల్లో క్యూఆర్ కోడ్‌ను అతికిస్తారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తెలియజేయడానికి ఈ క్యూఆర్ కోడ్‌లో సెక్టార్ ఇన్‌చార్జి ఫోన్ నెంబరును ఇచ్చారు. భక్తులు సెల్‌ఫోన్‌లో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఫోన్ నెంబరు కనిపిస్తుంది. దానికి ఫిర్యాదు చేసి సమస్యను తెలియజేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ సెక్టార్లలో ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి సిబ్బందిని ఏర్పాటు చేశారు.

500 సీసీ కెమెరాలతో నిఘా

ఇంద్రకీలాద్రి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించడానికి 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దేవస్థానం పరిధిలో 200 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇవికాకుండా భక్తుల సంచారం ఉండే ప్రాంతాల్లో మరో 300 సీసీ కెమెరాలు అమర్చారు. వాటిని మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటుచేసిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి భారీ వీడియో వాల్‌ను ఏర్పాటు చేశారు. గత ఏడాది ఉత్సవాలకు 13.50 లక్షల మంది భక్తులు వచ్చారు. ఈసారి 20 లక్షల మంది వస్తారని అంచనా. ఉచిత బస్సు ప్రభావంతో భక్తులు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వాహనాలను నిలుపుదల చేసుకోవడానికి 20 ప్రదేశాలను ఎంపిక చేశారు.

- తిరుమలలో మాదిరిగా దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు పురుషులైతే పంచెకట్టు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించాలని అధికారులు కోరారు. పంచెలను విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు.
- ప్రసాదాల కౌంటర్లను కనకదుర్గానగర్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మొత్తం 25 లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న భవనంలో వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- ఇంద్రకీలాద్రితో పాటు చుట్టుపక్కల పారిశుధ్య నిర్వహణకు 1,400 మంది కార్మికులను నియమించారు. వారంతా మూడు షిఫ్టుల్లో పనిచేస్తారు. 405 మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. 25 లక్షల తాగునీటి సీసాలను అందుబాటులో ఉంచారు.
- మొత్తం 6వేల మంది అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించడానికి పోలీసు అధికారులు సిద్ధమయ్యారు. ఇతర జిల్లాల నుంచి 1,000 మందిని రప్పించారు. ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలోని 5 వేల మందిని బందోబస్తుకు ఉపయోగించడానికి అధికారులు రూటుమ్యాప్ సిద్ధం చేశారు.
- నగరంపై ట్రాఫిక్ భారం లేకుండా పశ్చిమ బైపాస్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఉత్తరాంధ్ర వైపు నుంచి వచ్చే హైదరాబాద్‌కు వైపునకు వెళ్లే వాహనాలను హనుమాన్ జంక్షన్ దగ్గర నుంచి పశ్చిమ బైపాస్ పైకి ఎక్కిస్తారు.
- ఈ ఏడాది పోలీసులు కొత్తగా సోషల్ మీడియా మానిటరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఆకతాయిలు సామాజిక మాధ్యమాల్లోకి వదిలే తప్పుడు ప్రకటనలు, వీడియోలను కట్టడానికి చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.
- వినాయకుడి ఆలయం నుంచి క్యూలోకి ప్రవేశించిన భక్తులు ప్రశాంతంగా ముందుకు కదిలేందుకు అధికారులు కొత్త ఏర్పాట్లు చేశారు. ఆలయం తెరిచినప్పటి నుంచి రాత్రి మూసివేసే వరకు లలితా సహస్ర నామాలను మైకుల ద్వారా వినిపించాలని నిర్ణయించారు. వినాయకుడి ఆలయం వద్ద, క్యూల మధ్యలో భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. మహామండపం ఆరో అంతస్తులో జరిగే పూజలు, యాగశాలలో జరిగే హోమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వాటిని ఈ స్క్రీన్లపై భక్తులు వీక్షించేలా చేస్తారు. దర్శనానికి ఎంత సమయం పడుతుంది, ఏ కారణంగా క్యూలైన్లు ఆగాయన్న సమాచారాన్ని వాటిపై ప్రదర్శిస్తారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో రూ.40 వేల కోట్ల అవినీతి

- షిరిడీసాయి కంపెనీకి దోచిపెడుతున్న గత వైసీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు
- ప్రస్తుత టెండర్లు రద్దు చేసి పాదర్శకంగా మరలా నిర్వహించాలి
- ఎ.బి.వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎ.బి.వెంకటేశ్వరరావు

గాంధీనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్ర జ్యోతి): గత వైసీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల కొనుగోలులో సుమారు 40 వేల కోట్ల అవినీతి జరిగిందని మాజీ ఐపీఎస్ అధికారి, సెంటర్ ఫర్ లిబర్టీ చైర్మన్ ఎ.బి.వెంకటేశ్వరరావు ఆరోపించారు. దీనిపై సీబీఐ విచారణ చేసి అవినీతికి సహకరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గత ప్రభుత్వం షిరిడీ సాయి కంపెనీకి వేలాది కోట్ల లబ్ధి చేసిన విధంగానే కూటమి ప్రభుత్వం అదే కంపెనీకి అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. గాంధీ నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వైసీపీ, కూటమి ప్రభుత్వాలు షిరిడీ సాయి కంపెనీకి ఏవిధంగా లబ్ధి చేకూర్చారో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సెంటర్ ఫర్ లిబర్టీ అధ్యక్షుడు ఎస్.చక్రవర్తి వివరించారు. అనంతరం ఎ.బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్‌శాఖను షిరిడీ సాయి కంపెనీ నడిపించడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమన్నారు. విద్యుత్ అవినీతి వల్లే కరెంట్ బిల్లులు పేద ప్రజలకు గుదిబండలా మారుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం షిరిడీసాయి కంపెనీకి ఇచ్చిన ప్రత్యేక వెసులుబాటులను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం టూస్టార్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను రూ. 1,19,073 లకు కొనుగోలు చేస్తే కూటమి ప్రభుత్వం రూ.119,899లకు కొనుగోలు చేసిందన్నారు. జగన్ ప్రభుత్వం షిరిడీ సాయికి 55 వేల ట్రాన్స్‌ఫార్మర్లు, తోషిబా కంపెనీకి కేవలం 1675 ఆర్డర్లు ఇచ్చిందన్నారు.

కొండాలమ్మ ఆలయంలో దసరా ఏర్పాట్లు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : వేమవరం కొండాలమ్మ ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు విచ్చేయాల్సిందిగా కోరుతూ పలువురు ప్రముఖులు, అధికారులకు కొండాలమ్మ దేవస్థానం చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన రావు(మోహన్), ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు శనివారం ఆహ్వాన పత్రికలు అందజేసి ఆహ్వానించారు. తొలుత గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఆయనను శాలువాతో సత్కరించి ఆలయ అర్చకుడు శరత్‌చంద్ర శివ సంతోష్ శర్మ వేదాశీర్వచనం పలికారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు, పలువురు జిల్లా అధికారులను కలిసి ఆహ్వానపత్రి అందజేసి దేవీ నవరాత్రులకు ఆహ్వానించారు. ఈనెల 22 వతేదీ సోమవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆలయంలో కలశస్థాపన చేస్తారని ఈవో కొండలరావు తెలిపారు. ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకూ నిత్యం అమ్మవారికి విశేష అవతారాలు, పూజలు జరుగుతాయని, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఈవో కొండలరావు వివరించారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

అభివృద్ధి పనులు వేగవంతం

- నిర్మాణం మధ్యలో ఆగిపోయిన భవనాలపై ప్రత్యేక దృష్టి
- మునిసిపల్ అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని అభివృద్ధి పనులపై వేగం పెంచాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నగర పాలక సంస్థ అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలో పారిశుధ్య చర్యలు, నిర్మిస్తున్న రోడ్లు, మార్కెట్ యార్డులో చేపట్టిన బృందావన గో సంఘం పనితీరుపై సమీక్షించారు. నగర పాలక సంస్థకు రావాల్సిన బకాయిల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మధ్యలో నిలిచిపోయిన మునిసిపల్ భవనం నిర్మాణంపై చర్చించారు. నిధులు సేకరించడంపై అధికారులతో మాట్లాడారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, మునిసిపల్ ఇంజనీర్లు, టీడీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షించారు.

పేటలో బాంబు దాడి ఘటనకు 87 ఏళ్లు



నాడు బాంబు దాడి జరిగిన సత్యనారాయణపురం ప్రాంతం.. ప్రస్తుత అంబేడ్కర్ సెంటర్ ఇదే.

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట): జగ్గయ్యపేటలో బాంబు దాడి ఘటన జరిగి 87 ఏళ్లు పూర్తయ్యాయి. క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో జగ్గయ్యపేటలో రెడ్‌క్రాస్ సొసైటీ నిధుల సేకరణకు నాటి బ్రిటిష్ ప్రభుత్వం చింతామణి నాటక ప్రదర్శనను సెప్టెంబరు 20, 1942న రాత్రి వేళ ఏర్పాటు చేసింది. ప్రేక్షకులుగా వెళ్లిన ఉద్యమకారులు రెండు నాటు బాంబులను అప్పటి కలెక్టర్ దంపతులపై విసిరారు. వారు తప్పించుకోగా, ఆరుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. నాటక ప్రదర్శన భగ్నమైంది. నాటి బ్రిటిష్ ప్రభుత్వం బాంబు దాడికి కారణమైన కన్నెబోయిన వన్నూరు, బాల్నె రాములు, అమరావతి రామ్మూర్తి, తూమాటి యోగానందాచార్యులు, దివ్వెల విశ్వనాథం, మళ్ల నాగయ్య, పెద్దాపురం నాగ భూషణం, డాక్టర్ కలవకోలను శోభనాద్రి, నకిరికంటి కృష్ణమూర్తిని అరెస్టు చేసి జైలుకు తరలించింది. నాడు ఘటన జరిగిన ప్రాంతమే నేడు పట్టణంలోని సత్యనారాయణపురం బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఉన్న ప్రాంతం. స్వాతంత్ర్యానంతరం ఈ బాంబుదాడిలో జైలుకు వెళ్లిన స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం తామ్రపత్రాలను అందచేసి గౌరవించింది. కాగా, ఇక్కడ నాటి ఘటనను గుర్తు చేస్తూ స్థూపం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అరణ్య రోదన

(5వ పేజీ తరువాయి)

దీంతో దుప్పిలను పట్టుకునేందుకు పొలాల వెంబడి ఉచ్చులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉచ్చుల్లో దుప్పిలు, కణుజులు పడుతున్నాయి. వాటిని పట్టుకోవటం, చంపి తినటం నేరమని తెలిసినా వేటగాళ్లు తగ్గట్లేదు. అటవీశాఖాధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారుల ఉదాసీనత కూడా వీరికి వెసులుబాటుగా మారింది. ఇటీవల కాలంలో అభయారణ్యంలో ట్రెక్కింగ్, పురాతన ఆలయాల సందర్శనలకు వెళ్లేవారి సంఖ్య పెరిగింది. దీంతో వన్యప్రాణులను ఏవిధంగా వేటాడుతున్నారన్నది బాహ్య ప్రపంచానికి తెలుస్తోంది. భారీసంఖ్యలో అడవి జంతువుల కోసం వలలు పన్నటం, దుప్పి చర్మాలు, కళేబరాలు, ఉచ్చులు చూసినవారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కొండపల్లి రిజర్వు ఫారెస్టులో వన్యప్రాణుల వేటపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.

వేటగాళ్లతో బేరాలు

హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి అడవి గొర్రెల కోసం వచ్చే వ్యాపారులు స్థానిక వేటగాళ్లతో బేరాలు మాట్లాడుకుంటారు. అడవి గొర్రెలను వేటగాళ్లు పట్టుకున్నాక వాటిని బల్క్‌గా ప్రత్యేక వాహనాల్లో వ్యాపారులు తీసుకెళ్తుంటారు. స్థానిక ప్రజలకు వన్యప్రాణుల అడుగుజాడల గురించి బాగా తెలుసు. ఆయా మార్గాల్లో వేటగాళ్లు ఉచ్చులు పన్నుతున్నారు. అధునాతన ఉచ్చులను కొని వాటిని వన్యప్రాణుల మార్గాల్లో ఏర్పాటుచేస్తున్నారు. ఫారెస్టులోని వందల సంఖ్యలో వేటగాళ్లు ఇదే పనిచేస్తున్నారు.


దసరా వేడుకల్లో చిన్నారులు

భాష్యంలో దసరా వేడుకలు

మాచవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాచవరం భాష్యం పాఠశాలలో శనివారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజనల్ ఇంజనీరు (సివిల్) పిల్లి కొండలరావు, జోనల్ ఎడ్యూకేషన్ ఆఫీసర్ శివ నారాయణలు మాట్లాడుతూ దసరా పండుగ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు నవదుర్గ అవతారాల్లో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నకుమారి, హెచ్ఎం లక్ష్మి సంయుక్త, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పే కమిషన్‌ను నియమించాలి

మాచవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ వ్యాలిడేషన్ క్లాజ్‌ను రద్దు చేసి 8వ పే కమిషన్‌కు చైర్మన్ సభ్యులను నియమించాలని ఈనెల 10న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫోరమ్ ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వర ప్రసాద్ అన్నారు. చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో కన్వీనర్ ఎస్.రామారావు, నాగేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఎ.కోటేశ్వరరావు, ప్రకాశరావు, వికె ప్రసాదరెడ్డి, శివరావు పాల్గొన్నారు.



సాటిలేని మేటి నటుడు అక్కినేని

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తన నటనతో అశేష జనవాహినిని ఉల్లాసపరిచిన సాటిలేని మేటి నటుడు నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వర రావు అని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) అన్నారు. ఆదివారం ఉదయం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త నిర్వహణలో తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం ఆవరణలో అక్కినేని విగ్రహం వద్ద 102వ జయంతి వేడుకలు జరిగాయి. జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ మరణించే వరకూ నటుడిగానే జీవించిన ధన్యజీవి అక్కినేని అన్నారు.

నగరాభివృద్ధిని అడ్డుకోలేరు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా నగరాభివృద్ధి ఆగదని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం తూర్పునియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ కరెన్సీనగర్ ఏరియాలో ఆయన పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 3వ డివిజన్‌లో సుమారు రూ.60లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన మూడు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరస్థాయి ప్రపంచ మంత తెలిసేలా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నారన్నారు. విజయవాడ అంటేనే ఎవరికైనా కనకదుర్గమ్మ గుర్తుకు వస్తుందన్నారు. 22వ తేదీ సోమవారం నుంచి విజయవాడ ఉత్సవ్ ప్రారంభమవుతుందని తెలిపారు. రూ.14 00 కోట్లను విజయవాడ అభివృద్ధికి కేటాయించడానికి మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వాటిలో తొలివిడతగా మురుగు కాలువల నిర్మాణానికి రూ. 600 కోట్లు తక్షణమే మంజూరుకానున్నాయని అన్నారు. గుంటతిప్ప డ్రైయిన్ నుంచి నీరు కాలనీలోకి వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించడానికి రూ.15 కోట్లు అవసరం అని అంచనా వేశామని, ఈ సమస్యను కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాడి బాబూరావు, గద్దె రమేష్, యలమంచిలి పండు, గొల్లపల్లి నారాయణరావు, అడపా నాగేంద్ర, గుత్తికొండ కృష్ణమోహన్, సుబ్బారావు, బండి కోమలి, రాగాని సాయి, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం, ఏఈ దీక్షిత్ పాల్గొన్నారు.


శరన్నవరాత్రుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో..
22 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

కృష్ణలంక, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయం లో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 11 రోజుల పాటు కాళీమాత అమ్మ వారు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్ కిరణ్ తెలిపారు. ఆలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, 22వ తేదీ తెల్లారి జామున వేదపండితుల సమక్షంలో కలశస్థాపన జరుగుతుందని తెలిపారు.

మొగల్రాజపురం : విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ చార్టెడ్ అకౌంటెంట్ సుంకర అక్కయ్య నాయుడు, ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రసన్న వైట్ల చెప్పారు. వేడుకలు నిర్వహించే సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో దసరా శరన్నవరాత్రి వేడుకల ఆహ్వాన పత్రికను కమిటీ ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు.

మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
E.P No. 10072/2018 in O.S No.331/2011, of II ADJ, Vijayawada
Between :
Gudela Anuradha .... Decree Holder
and
Ratnala Venkata Satyanarayana Murthy .... Judgement Debtor

వేలం నోటీసు

యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, విద్యాధరపురం, కె.యల్.రావ్ నగర్, 2వ లైన్, డోరు నెం. 5-7/2-2/2, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలోని జడ్జిమెంట్ డెటార్‌కు చెందినటువంటి విజయవాడ, విద్యాధరపురం, విద్యానగర్, కె.యల్.రావు నగర్, 2వ లైన్‌లోని ఆస్తికి ఆర్.యస్.నెం. 144/2,3,4,5,6ఎ,145/2, 146/1,2, 147/2ఎ, 2బి, 149/1, 150/1ఎ,2, 164/1ఎ మరియు 165/2, యల్.పి నెం.118/66, ప్లాటు నెం. 30,వార్డు నెం.5/2, అసెస్‌మెంట్ నెం. 4010 యమ్/2,డోరు.నెం.5-7/2-2/2కు దాఖలా చ.గ.83.1/3 లు లేక చ.మీ. 69.64ర్లు స్థలము, అందలి ఏ.సి.సి రేకుల షెడ్డుతో గల ఆస్తికి హద్దులు: తూర్పు: మునిసిపల్ రోడ్డు, ల.25.0లు, దక్షిణం: ప్లాటు నెం.31 -ఆర్.శివకుమార్-అ.30.0లు, పడమర: ప్లాటు నెం.11-పి.కె.విజయ కుమార్-అ.25.0లు, ఉత్తరం:ప్లాటు నెం.29- బి.రంగారావు -అ.30.0 లు., తనఖాకు లోబడి సదరు షెడ్యూలు ఆస్తిని కోర్టు వారు ది.17-10-2025 వ తేది. ఉ.గం॥10.30 ని.లకు కోర్టు వారి ఎదుట వేలం నిర్వహించబడును. కొనుగోలు చేయదలచిన వారు ది.17-10-2025 తేదీన జరుగు వేలంలో కోర్టు వారి నిబంధనలకు లోబడి పాడుకోవచ్చును. కనుక యావన్మందికి తెలియజేయటమైనది.

డి.హెచ్.ఆర్ విలువ	-రూ. 18 లక్షలు
అమీనా విలువ	-రూ. 20 లక్షలు
మార్కెట్ విలువ	-రూ. 14.28 లక్షలు

/// శ్రీ కోర్టు వారి అనుమతితో ///
వేలం తేది. 17-10-2025
సి.హెచ్.యన్. సత్యనారాయణ రెడ్డి
అడ్వకేట్, విజయవాడ.
సెల్ నెం. 9948084844
విజయవాడ ది.20.09.2025

చెట్లు నాటి పరిరక్షించాలి



మాచవరం, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): చెట్లు నాటి వాటిని పరిరక్షించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించగలుతామని విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వంశీకృష్ణ, అన్నపూర్ణ, డాక్టర్ చిత్రా, డాక్టర్ వసుంధర, డాక్టర్ రజనీ, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.



భారతీనగర్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణంలో ఏర్పడే వాయుకాలుష్యాన్ని తగ్గించుకోవచ్చునని 10వ డివిజన్ కార్పొరేటర్ దేవినేని అపర్ణ అన్నారు. 10వ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, టీచర్స్ కాలనీ, స్టెల్లా కాలేజ్ పరిసర ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం స్థానిక పెద్దల ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవినేని అపర్ణ పాల్గొని కాలనీలలోని పలు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పలు అంతర్గత రోడ్లలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు మైనేని జయప్రకాష్, వై.రంగారావు, ఏ.మోహన కుమార్, చలసాని వాసు, స్టెల్లా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

● పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు వ్యాపించవని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారధి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ప్రిన్సిపాల్ ఎం.విజయసారధి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుణదల : మొక్కల వల్ల ప్రయోజనాలు పిల్లలకు తెలియజేయాల్సిన అవశ్యకత ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గుణదల్లోని సెంట్‌జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ షైనీ తామస్, టీడీపీ నాయకులు గాబ్రియేలు, సుగసాని రత్నశ్రీ, జనసేన నాయకులు ముత్యాల కృష్ణ, దోమకొండ రవి, నాళం నరేంద్ర, కుండపాటి శ్రీకృష్ణ, షకీలా బేగం, వెలిసిన సురేష్‌బాబు, కార్పొరేషన్ ఎఎమ్‌హెచ్ఓ గోపాల్ నాయక్, ఈఈ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

● కలుషిత వాతావరణం కాకుండా స్వచ్ఛమైన ప్రాణవాయువు అనుభవించాలంటే మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని మాచవరం సీఐ ప్రకాష్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతినెలా మూడవ శనివారం చేపట్టే కార్యక్రమంలో భాగంగా సీపీ ఆదేశాల మేరకు మాచవరం పోలీస్ స్టేషన్లో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రం చేయడంతోపాటు పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బంది మొక్కలు నాటారు.

ఘనంగా గురజాడ జయంతి



విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో గురజాడ అప్పారావు 163వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్త్రీ విద్యావ్యాప్తికి, బాల్య వివాహాలు, నిర్మూలనకు, మూఢనమ్మకాల నిర్మూలనకు ఆయన చేసిన కృషి సమాజం ఎన్నటికీ మరువరానిదని గుర్తుచేసుకొన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొగల్రాజపురం : మహాకవి సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు తన రచనలతో అభ్యుదయ భావాలతో ముఢనమ్మకాల మధ్య నలిగిపోతున్న స్త్రీ జాతిని జాగృతం చేశారని జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా చెప్పారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా శని వారం మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, నేటి స్త్రీ లోకం స్వతంత్ర భావాలతో ముందుకు వెళుతుందంటే అందుకు గురజాడ చేసిన కృషి తొలి మెట్టు అని చెప్పారు., ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఏ. పూర్ణిమ, సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు, NTR జిల్లా, విజయవాడ, శ్యాంనగర్, స్మితా టవర్స్, ఫ్లాట్ నెం. 211రు నివాసస్తులైన లింగం సత్యం గారి కుమారుడు లింగం సత్యనారాయణ గారి సంజాయిషీ పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని NTR జిల్లా, విజయవాడ, సత్యనారాయణపురం, కాకరపర్తివారి వీది, డోర్ నెం. 23-4-2రు. నివాసస్తులైన ఉప్పలపాటి నరశింహరాజు గారి కుమారుడు ఉప్పలపాటి నరశింహరాజు గారి ద్వారా క్రయం పొందుటకు నిశ్చయించుకొని, ఒక విక్రయ అగ్రిమెంటును వ్రాయించుకొని క్రయమైన రిజిష్టర్ దస్తావేజును పొందుటకు సిద్ధముగా యుండియున్నారు. కావున దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిపై ఎవ్వరికైన, ఏవిధమైన చట్టబద్ధమైన అభ్యంతరములుగాని, హక్కులుగాని, జాయింటు భాగబద్ది తగాయిదాలుగాని, క్లయిములుగాని, బ్యాంకు లావాదేవిలుగాని, తనఖాలుగాని, హామీలుగాని సరిహద్దు వివాదములుగాని, కోర్టుజప్తులుగాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన "వారం రోజులలోగా" తగు ఆధారములతో రిజిస్టరు పోస్టు తిరిగి రశీదు ద్వారా నాకు గాని, నా క్లయింటుకు గాని తెలియజేయగలరు. సదరు గడువులోగా ఎవ్వరినుండైనా ఏ విధమైన అభ్యంతరములు రాని యెడల, నా క్లయింటు దిగువ షెడ్యూల్ స్థిరాస్తిని నిర్వివాదమయిన ఆస్తిగా భావించి క్రయమయిన రిజిష్టర్ దస్తావేజును పొందగలరు. సదరు గడువు తేది అనంతరము వచ్చు క్లయిములుగానీ, అభ్యంతరములుగాని, వైరాలుగాని, నా క్లయింటునుగాని, దిగువ దాఖలా షెడ్యూల్ స్థిరాస్తినిగాని బైండ చేయజాలవని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్ : NTR జిల్లా, విజయవాడ టౌన్, నున్న సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, విజయవాడ రూరల్ మండలం, అంబాపురం గ్రామ పంచాయితీ ఏరియా, అంబాపురం ఆర్.ఎస్. నెం. 45, ప్లాటు నెం. 22 పార్టు దాఖలా చ.గ.111- లు ఖాళీ నివేశన స్థలము గల స్థిరాస్తికి హద్దులు:- తూర్పు:- 33 అడుగుల రోడ్డు, దక్షిణం:- ఇతరుల ఆస్తి హద్దు, పడమర:- ఇతరుల ఆస్తి హద్దు, ఉత్తరం:- బుర్ర పంకజ దేవి గారి ఆస్తి.

Sri Venkat Rao Madala, Advocate,
Bhavanipuram,Vijayawada-12. Cell : 9246223338

పట్టుదలతో పాటు సహనాన్ని అలవాటు చేసుకోవాలి

మంత్రి నాదెండ్ల మనోహర్



భారతీనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పట్టుదలతో పాటు సహనాన్ని కూడా అలవాటు చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. భారతీనగర్‌లోని నోవోటెల్‌లో వెస్టిన్ కాలేజీ ఆధ్వర్యంలో 15వ కాఫీ అండ్ కాన్వర్సేషన్ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలేజీ నుంచి దుబాయ్, న్యూజిలాండ్ వంటి విదేశాలలోని ప్రముఖ హోటళ్లలో ఎంపికైన 50 మంది విద్యార్థులకు మంత్రి మనోహర్ అంతర్జాతీయ ప్లేస్‌మెంట్ వీసాలను అందజేశారు. ఈకార్యక్రమంలో వెస్టిన్ కాలేజీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వివిధ విభాగాల అధ్యాపకులు, పలు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

కృష్ణలంక, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక 20వ డివిజన్ టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో శనివారం పేదలకు నిత్యా వసర వస్తువులు పంపిణీ చేశారు. 20వ డివిజన్ టీడీపీ కార్యాలయం వద్ద ఐదుగురు పేద మహిళలకు 25 కిలోల బియ్యం, దుప్పట్లు, నిత్యావసర వస్తువులు నాయకులు పంపిణీ చేశారు.

నూర్‌బాషా డైరెక్టర్ పీరుబాబుకు సత్కారం



నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్ మైలమూరి పీరుబాబును శనివారం కృష్ణలంక 20వ డివిజన్ టీడీపీ నాయకులు టీడీపీ కార్యాలయం వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మోటేపల్లి చిన్నా, గల్లా శ్రీను, వేముల దుర్గారావులు మాట్లాడుతూ పీరుబాబు పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచన మేరకు నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి పీరుబాబును ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొడాలి సాయిబాబు, ముళ్లపూడి నాగేశ్వరరావు, వేముల దుర్గారావు, మేకల విజయలక్ష్మి, రమాదేవి, బండారు కుమారి, పెద్ది అన్నారావు, గల్లా సుబ్బారావు, ఎస్‌కె.బచ్చా, జనసేన నాయకులు జి.జయకుమార్ పాల్గొన్నారు.

కనకదుర్గానగర్‌లో దుకాణాలు మూసివేత

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కనకదుర్గానగర్‌లోని షాపులను శనివారం మూసివేయించారు. దసరా ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కనకదుర్గమ్మ దర్శనానికి రానున్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు మృతి

గుణదల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు కేసుల్లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇరువురు శనివారం చనిపోయినట్లుగా మాచవరం పోలీసులు తెలిపారు. ఒరిస్సాకు చెందిన సుభాష్ చంద్ర(48) ఈనెల 14వ తేదీన రోడ్డు ప్రమాదంలో చికిత్స శనివారం మృతి చెందాడు. ● మొగల్రాజపురానికి చెందిన పల్లెపోగు ప్రవీణ్ కుమార్(40) ఉరేసుకుని చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

అన్‌లిమిటెడ్ జోష్... విజయవాడ ఉత్సవ్

వరల్డ్ బిగ్గెస్ట్ కార్నివాల్‌గా విజయవాడ ఉత్సవ్ ● 11 రోజులపాటు 250కి పైగా ప్రదర్శనలు ● తుమ్మలపల్లిలో కోలాహలంగా విజయవాడ క్రౌన్ ఆడిషన్స్

అలరించిన ఫ్లాష్ మాబ్


భవానీపురం స్వాతి సెంటర్‌లో ఫ్లాష్ మాబ్‌లు డ్యాన్స్‌లు చేస్తున్న యువత, మహిళలు.

విద్యాధరపురం: విజయవాడ ఉత్సవ్ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. 11 రోజుల పాటు వరల్డ్ బిగ్గెస్ట్ కార్నివల్‌గా ఈ విజయవాడ ఉత్సవ్ జరగనుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ అన్నారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ఉత్సవ్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఫ్లాష్ మాబ్ శనివారం భవానీపురంలోని స్వాతి థియేటర్ సెంటర్‌లో జరిగింది. ఈ ఫ్లాష్ మాబ్ ఆ ప్రాంతవాసుల్లో జోష్ నింపింది. కొంతమంది మహిళలు యువతతో కలిసి ఫ్లాష్ మాబ్‌లో నృత్యాలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్‌లో కూచిపూడి నృత్యాలు, డ్రోన్ షో, ఫుడ్ స్టాల్స్ పద్య నాటికలు, తోలు బొమ్మలాటతో పాటు ఎన్నో కార్యక్రమాలు కనువిందు చేయనున్నాయన్నారు. నగరాన్ని పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా, సాంస్కృతిక కేంద్రంగా ప్రోత్సహించటమే లక్ష్యంగా ఈ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాప్ డైరెక్టర్, 41వ డివిజన్ అధ్యక్షుడు సంతోష్, 40వ డివిజన్ అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య, 42వ డివిజన్ అధ్యక్షుడు పత్తి నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శి పచ్చా మల్లిఖార్జున్, 43వ డివిజన్ అధ్యక్షుడు మూరబోయిన రాంబాబు, ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు ఆషా, గొల్లపూడి మార్కెట్ వైస్ చైర్మన్ పాల మాధవ, పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుభాని సరిత, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్ మాధవ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షైనపల్లి రాజ, క్లస్టర్ ఇన్చార్జులు యేదుపాటి రామయ్య, సుభానీ, ప్రభుదాసు, టీడీపీ మహిళ నేతలు, తదితరులు పాల్గొన్నారు.


ఉప రాష్ట్రపతి రాధాకృష్ణను ఆహ్వానిస్తున్న కేంద్రమంత్రి, ఎంపీలు

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు

విజయవాడ ఉత్సవ్ ఆహ్వానం

విజయవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగర పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటి చెప్పేందుకు నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌కు రావాలని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపీలు హరీశ్ బాలశౌరి, సానా సతీశ్‌తో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆహ్వానించారు. శనివారం ఢిల్లీలోని ఉప రాష్ట్రపతిని ఆయన నివాసంలో కలిసి విజయవాడ ఉత్సవ్ ఆహ్వాన పత్రిక అందజేశారు.

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు ఆహ్వానం



వన్‌టౌన్: కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను శనివారం ఢిల్లీలో కలిసిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ ఉత్సవ్‌తో విజయవాడ సాంస్కృతిక వైభవాన్ని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యమని మంత్రికి వివరించారు. స్థానిక సంప్రదాయాలు, కళలు, సాంస్కృతిక విలువలు ప్రదర్శితమవుతాయి. తప్పక హాజరు కావాలని ఎంపీ కోరారు.

ధూమ్ ధామ్‌గా.. ఆడిషన్స్

- దసరా వైభవం ప్రతిబింబించేలా మిస్ విజయవాడ సంప్రదాయ వస్త్రధారణ పోటీలు
- 500 మందికి పైగా చిన్నారులు, బాలికలు, యువతులు, గృహిణుల హాజరు

విజయవాడ సిటీ: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ఈ నెల 25న పున్నమిఘాట్‌లో నిర్వహించే విజయవాడ క్రౌన్ (మహిళల సంప్రదాయ వస్త్రధారణ) పోటీలకు సంబంధించిన ఆడిషన్స్ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగాయి. 500 మందికిపైగా చిన్నారులు, బాలికలు, యువతులు, గృహిణులు పోటీలకు హాజరయ్యారు. దసరా శరన్నవరాత్రుల వైభవం ప్రతిబింబించేలా వివిధ వస్త్రాలంకరణలతో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. శరన్నవరాత్రుల్లో అమ్మవారు ప్రతిరోజూ వివిధ రకాల వస్త్రాల అలంకరణలతో భక్తులకు దర్శ



నమిస్తారు. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా చిన్నారులు, యువతులు, గృహిణులు చేసిన వస్త్రధారణ ఆకట్టుకుంది. అందమంటే సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడటమేన్న సందేశాన్ని నిర్వాహకులు అందజేశారు. పోటీల్లో ఎంపికైనవారు 25న జరిగే విజయవాడ క్రౌన్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు అడ్డాల సతీష్ తెలిపారు. ఆడిషన్స్‌కు న్యాయనిర్ణేతలుగా దర్శి అపర్ణ, రాధిక వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా మిస్ ఆంధ్రా లావణ్య, దీక్షిత హాజరయ్యారు. కిడ్స్ (4-7), జూనియర్స్ (8-12), టీన్స్ (13-16), మిస్ (17-26), మిసెస్ (27 ఏళ్ల పైబడిన) విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడమటమే నిజమైన అందం

దర్శి అపర్ణ, న్యాయనిర్ణేత



మన సంస్కృతి, సంప్రదాయలను కాపాడమే నిజమైన అందమని, అదే థీమ్‌తో విజయవాడ క్రౌన్ పోటీలు జరుగుతున్నాయి. అందాల పోటీలంటే అసభ్యకరమైన వస్త్రధారణ అనే ఆలోచన అందరిలో నాటుకుపోయింది. దాన్నుంచి ప్రజలను బయటకు తీసుకొచ్చేందుకు ఇలాంటి పోటీలు ఉపయుక్తంగా ఉంటాయి. రానున్న రోజుల్లో మరిన్ని పోటీలు జరగాలి.

చాలా ఆనందంగా ఉంది

ఎస్ నళిని, గృహిణి



సంప్రదాయ వస్త్రధారణ పోటీలను విజయవాడలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. అందరూ చక్కని దుస్తుల్లో పోటీల్లో పాల్గొన్నారు. నేను కూడా పాల్గొనడం ఆనందంగా ఉంది. నిర్వాహకులకు ధన్యవాదాలు. విజయవాడ నగర అందమంతా ఇక్కడే ఉన్నట్టుంది.

ముందు తరాలకు మంచి సందేశం

కే అంజనీదేవి, గృహిణి



మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఇలాంటి పోటీలు మరెన్నో జరగాలి. మన వస్త్రధారణ ముందుతరాలకు తెలుస్తుంది. ఇప్పటికే చాలామంది మన సంప్రదాయ వస్త్రధారణను మర్చిపోతున్నారు. వారందరికీ ఈ పోటీలు మన డ్రెస్సింగ్ స్టయిల్‌ను తెలియజేస్తాయి. ముందు తరాలకు మంచి సందేశాన్ని ఇస్తాయి.

ప్రభుత్వానికి ధన్యవాదాలు

ఎస్ శ్రీదేవి, గృహిణి



దుర్గమ్మ ఉత్సవాలంటే విజయవాడకు ఓ పండుగ. పలు రకాలైన వస్త్రధారణలతో ఉన్న అమ్మవారిని ప్రతి దసరా ఉత్సవాల్లో దర్శించుకుని తరిస్తాం. మహిళల శక్తి, సామర్థ్యాలను తెలిపే ఈ పండుగ రోజుల్లో ఇలాంటి సంప్రదాయ వస్త్రధారణ పోటీలనిర్వహణ అభినందనీయం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది

కే నైనసింధూర, ఆరో తరగతి విద్యార్థి



ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. నేను మొదటిసారి ఇలాంటి పోటీల్లో పాల్గొంటున్నా. ఈ పోటీలకు ఇంతమంది వస్తారనుకోలేదు. అందరూ చక్కగా రెడీ అయి వచ్చారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోటీలను నిర్వహిస్తున్నారు. 25న విజయవాడ క్రౌన్ పోటీల్లో పాల్గొనాలని ఉంది.

ఆత్మస్థైర్యాన్ని నింపే పోటీలు

వైష్ణవి, అడ్వకేట్



ఇలాంటి పోటీలు మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతాయి. మహిళలకు శక్తి, ధైర్యాన్నిచ్చే అమ్మవారి వేడుకల రోజుల్లో పోటీలను నిర్వహించడం సంతోషదాయకం. ఇలాంటి పోటీలు మరెన్నో జరగాలి. ముందు తరాలకు మన సంప్రదాయ వస్త్రధారణను తెలపాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు చక్కగా రెడీ అయి పోటీలకు వచ్చారు.

మొదటి సారిగా పాల్గొన్నా

ఐశ్వర్యరాయ్, ఎంబీబీఎస్ విద్యార్థి



అందాల పోటీల్లో పాల్గొనాలని ఉండేది. కొన్ని కారణాలతో పాల్గొనలేదు. సంప్రదాయ వస్త్రధారణ పోటీలు అదీ విజయవాడలో పాల్గొనటం ఇదే మొదటిసారి. ఎంతో మంది మహిళలకు ఈ పోటీలు ప్రేరణ కలిగిస్తాయి.

ఏ రోజున ఏం జరుగుతుంది!

విజయవాడ: విజయవాడ ఉత్సవ్-2025లో భాగంగా నగరంలో సోమవారం నుంచి అక్టోబరు 2వరకు అన్‌లిమిటెడ్ ఎంజాయ్‌మెంట్ నగర ప్రజలకు లభించబోతోంది. మొత్తం 11 రోజుల పాటు 250కు పైగా కార్యక్రమాలు జరగబోతున్నాయి. ఈ దసరా సెలవుల్లో చిన్న పిల్లలు, యువత, పెద్దలంతా సకుటుంబ సపరివారసమేతంగా ఎంజాయ్ చేసేలా కార్యక్రమాలు ఉండబోతున్నాయి. ప్రధానంగా ఇవి గొల్లపూడి ఎక్స్‌పో, పున్నమి, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాలల్లో జరుగుతాయి. ఈ వేదికల వారీగా ఏ రోజున ఏ కార్యక్రమాలు జరుగుతాయో చూద్దాం..

విజయవాడ ఎక్స్‌పో- గొల్లపూడి

సెప్టెంబరు 22న మణిశర్మ లైవ్ మ్యూజిక్ షో, 23న ఆర్.పి.పట్నాయక్ లైవ్ మ్యూజిక్ షో, 24న కార్తీక్ లైవ్ మ్యూజిక్ షో, 25న మిస్ విజయవాడ సెగ్మెంట్, 26న థైక్కుడమ్ బ్రిడ్జ్, 27న సింగర్ సునీత లైవ్ మ్యూజిక్ షో, 28న రామ్ మిర్యాల లైవ్ మ్యూజిక్ షో, 29న విజయవాడ ఐడల్, 30న క్యాప్రిసియో లైవ్, అక్టోబరు 1న గీతామాధురి లైవ్ మ్యూజిక్ షో, 2న జామ్ జంక్షన్

పున్నమిఘాట్‌లో..

సెప్టెంబరు 22న మూన్‌లైట్ సింఫనీ, 23న అభిజిత్ నాయర్, 24న గీతామాధురి లైవ్ మ్యూజిక్ షో, 25న కామాక్షి మ్యూజిక్ లైవ్ షో, 26న అభిలీప్సా లైవ్, 27న భక్తి కన్సార్ట్, 28న సందీప్ నారాయణ్ లైవ్, 29న సమీరా భరద్వాజ్ లైవ్ షో, 30న దామెలియన్స్ స్వాప్ ఆఫ్ బీట్, అక్టోబరు 1న కర్నాటిక్ అండ్ కల్చర్, 2న సంచేత్ పరంపర

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో

సెప్టెంబరు 22న పౌరాణిక పద్యనాటకం, 23న భూకలాస్ నాటకం, 24న విముక్తి నాటకం, 25న చిగురుమేఘం నాటిక, 26న శకుని నాటకం, 27న సాంఘిక నాటకం, 28న బావా ఎప్పుడు వచ్చితివి నాటిక, 29న సామాజిక దేక్ష సుందరి నాటకం, 30న ఖడ్గతిక్కన నాటకం, అక్టోబరు 1న కృష్ణ రాయబారం నాటకం, 2న భక్తప్రహ్లాద నాటకం

ఘంటసాల సంగీత, నృత్య కళాశాలలో

సెప్టెంబరు 22న సాంఘిక నాటిక, 23న పేగురాసిన శాసనం నాటిక, 24న సత్యహరిశ్చంద్ర నాటకం, 25న రామాంజనేయ యుద్ధం నాటకం, 26న తరమే పోతున్నదో నాటిక, 27న కృష్ణ తులాభారం, 28న పల్నాటి యుద్ధం నాటకం, 29న పాప దొరికింది నాటిక, 30న సాంఘిక నాటిక, అక్టోబరు 1న సాంఘిక నాటిక, 2న సాంఘిక నాటిక

స్పాట్‌లైట్స్..

సెప్టెంబరు 25న విజయవాడ కిరీటం (మిస్ అండ్ మిసెస్) విజయవాడ ఎక్స్‌పో గొల్లపూడి, 26న మెగా కార్నివాల్ వాక్ (ఎంజీ రోడ్డు), 29న విజయవాడ ఐడల్ (విజయవాడ ఎక్స్‌పో గొల్లపూడి), 30న అగ్ని అవార్డ్ (పున్నమిఘాట్), అక్టోబరు 1న సోషల్ మీడియా అవార్డ్స్ (పున్నమిఘాట్), 2న స్వచ్ఛథాన్ (ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం), హెలికాప్టర్ రైడ్స్ సిద్ధార్థ మెడికల్ కాలేజీ గ్రౌండ్.

ప్రజల గుండెల్లో నిలిచిన

మహనీయుడు దేవినేని రమణ

● మాజీ మంత్రి, దేవినేని ఉమా



గొల్లపూడి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు దేవినేని రమణ అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. దేవినేని రమణ జయంతిని పురస్కరించుకొని గొల్లపూడిలోని తన కార్యాలయంలో శనివారం స్థానిక నేతలతో కలిసి రమణ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణ ఒక కార్యకర్తగా నందిగామ రాజకీయాల్లో అడుగు పెట్టారని, దివంగత ఎన్టీఆర్ ప్రేమాభిమానులతో అతి తక్కువ కాలంలో శాసన సభ్యుడిగా గెలిచారన్నారు. పనిచేసే తత్వం పార్టీని ముందుకు తీసుకువెళ్లే క్రమంలో నాటి సీఎం చంద్రబాబు విద్యాశాఖ మంత్రిగా అవకాశం ఇచ్చారని, అనతికాలంలోనే విద్యాశాఖలో సమూలమైన మార్పులను తెచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రమణ బలమైన ముద్ర వేశారన్నారు. నేతలు వడ్లమూడి జగన్మోహన్ రావు, రంగినేని నరేంద్ర, శ్రీను నాయక్, షేక్ కరిముల్లా, ఇరుగులపాటి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

అప్పుల వాళ్ల వేధింపులు తట్టుకోలేక

దంపతుల ఆత్మహత్యాయత్నం



వత్సవాయి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల వాళ్ల వేధింపులు తట్టుకోలేక వత్సవాయిలో శనివారం వాటర్ ట్యాంక్ ఎక్కి రెండు గంటల పాటు దంపతులు హల్‌చల్ చేశారు. గ్రామానికి చెందిన గడ్డం నాగరాజు, మిట్టపల్లి కొండయ్య ఇద్దరూ కలిసి నాలుగేళ్ల క్రితం గొర్రెలు, మేకల వ్యాపారం చేశారు. అనంతరం డబ్బు లావాదేవీల్లో రూ.1.5 లక్షలు కొమరయ్య అనే వ్యక్తి నాగరాజుకు బకాయి పడ్డాడు. అప్పుడప్పుడు బకాయి సొమ్ము ఇవ్వమని అడిగితే ఇస్తానంటూ చెబుతున్నాడు. ఈక్రమంలో కొమరయ్య ద్విచక్రవాహనాన్ని నాగరాజు స్వాధీనం చేసుకున్నాడు. మనస్తాపానికి గురైన కొమరయ్య తన భార్య నాగమల్లేశ్వరితో కలిసి పెట్రోల్ డబ్బా తీసుకొని వత్సవాయిలో ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి దుకేస్తామని హెచ్చరించాడు. తన బైక్ తనకిస్తేనే దిగుతాలేదా దూకేస్తామని రెండు గంటల పాటు హల్‌చల్ చేయడంతో అధికారులు, ప్రజలు భయపడ్డారు. అనంతరం పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకొని ఆ దంపతులను కిందకు దిచడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రేపటి నుంచి 2 వరకు సెలవులు

- దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠినచర్యలు
- జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు

విజయవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల సమయంలో ప్రైవేటు పాఠశాలలు సాధారణ, ప్రత్యేక తరగతులు, పరీక్షలు, తల్లిదండ్రుల మీటింగ్స్ నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా మహోత్సవం సందర్భంగా ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు 11 రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించిన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు మంజూరు చేసినట్టు ఆయన వెల్లడించారు. ఆదేశాలను ఉల్లంఘించి తరగతులు నిర్వహించినట్టు గుర్తిస్తే కఠినచర్యలతో పాటు భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామన్నారు. అన్ని మండల విద్యాధికారులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీపీఆర్) తమ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలను పర్యవేక్షించి దసరా సెలవుల సమయంలో ఏ పాఠశాలలో తరగతులు నిర్వహించినా వెంటనే షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలలు నిర్వహిస్తున్నట్టు గుర్తిస్తే డివిజన్ డిప్యూటీ డీఈవో ఏ శ్యాంసుందర్ (99480 50624), డీ సాంబశివరావు (94915 05169)కు ఫిర్యాదు చేయవచ్చని డీఈవో సుబ్బారావు పేర్కొన్నారు.

కాపులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

● కాపు జేఏసీ నేతలు



గాంధీనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల్లో జనాభా దమాషా ప్రకారం కాపులకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చల్లమల్ల ప్రసాదరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర కాపు జేఏసీ నేతలు ప్రసాదరావు, అమ్మ శ్రీనివాస్, చందు భవన్నారాయణ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైనప్పటి నుంచి కాపులు రాజకీయంగా అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలు కాపులను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తూ అధికారం వచ్చాక నిర్లక్ష్యం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. గత ఎన్నికల సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు మేరకు కాపులు పెద్దన్నపాత్ర పోషించి కూటమి గెలుపునకు కృషి చేశారని గుర్తు చేశారు. పునర్విభజనలో ఒక జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని, ఆయన తనయుడు వంగవీటి రాధాకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, దుర్గగుడి చైర్మన్ పదవిని ఈసారి కాపులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే వైసీపీ పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని తీవ్రంగా హెచ్చరించారు. జానపాముల నాగబాబు, కర్రి వెంకటరమణ పాల్గొన్నారు.


అధికారుల ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు

డ్వాక్రాలో రూ. 13 లక్షల వరకు స్కామ్..!

● గ్రూపు లీడర్ తినేసిందంటూ ఆరోపణలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం తాళ్లపాలెం గ్రామ శివారు సత్రంపాలెంలో డ్వాక్రా మహిళలు శనివారం సాయంత్రం తమ సొమ్మును గ్రూపులీడరు తినేశారంటూ గగ్గోలు పెట్టారు. స్త్రీనిధి ఏజీఎం మునిరత్నం, అధికారులు శ్రీనివాస్, పాండురంగారావు డ్వాక్రా మహిళలను అడిగి స్కామ్‌పై విచారించారు. బుక్ కీపరు, సెక్రటరీలు కూడబలుక్కుని దాదాపు రూ.13 లక్షలకు పైగా డ్వాక్రా మహిళలు చెల్లించిన నగదు బ్యాంకులో జమచేయలేదని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతామని స్త్రీనిధి ఉన్నతాధికారులు పేర్కొన్నారు. విచారణ కొనసాగుతోంది.

ఉచిత క్యూలో దుర్గమ్మ దర్శనానికి వెళితే..

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, విజయవాడ ఆర్డీవో కే చైతన్య, నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కే మాధురి, డీఆర్వో లక్ష్మీనరసింహం, ఇతర ముఖ్య అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయకుడి గుడి నుంచి అమ్మవారి గుడి వరకు ఉన్న క్యూలో కాలినడకన వెళ్లి అణువణువునా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగిలిన క్యూలతో పోల్చితే ఉచిత క్యూలో ఆలయ గోపురాలను, ధ్వజస్తంభాన్ని దర్శించుకునే అవకాశం ఉంటుందన్నారు. పరిసరాలను చక్కగా పరిశీలించవచ్చని, కృష్ణమ్మ అందాలనూ వీక్షించవచ్చన్నారు. సాధారణ భక్తులకే పెద్దపీట వేస్తున్నామన్నారు. డీఆర్డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీపీవో లావణ్య కుమారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, డిప్యూటీ లేబర్ కమిషనర్ ధనలక్ష్మి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ప్రియదర్శిని పాల్గొన్నారు.


హాస్టల్‌లో సేదదీరుతున్న పశువులు

పాల ఉత్పత్తిలో మరో ముందడుగు

- గేదెల హాస్టళ్లకు శ్రీకారం చుట్టిన కృష్ణా మిల్క్ యూనియన్
- పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ బృందాల పర్యటన

నందిగామ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆర్థిక సాధికారత, మెరుగైన పాల దిగుబడులు, పశువుల ఆరోగ్యం తదితర అంశాల్లో కృష్ణా మిల్క్ యూనియన్ ఒకడుగు ముందుకేసింది. ప్రభుత్వ సహకారంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్న యూనియన్ పాల ఉత్పత్తిదారుల కుటుంబాలను ఆర్థిక సాధికారత వైపు అడుగులు వేయిస్తోంది. పోషణాభారంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం రైతులు పాడి గేదెల పెంపకానికి వెనుకాడుతున్నారు. దీంతో ప్రస్తుత చైర్మన్ చలసాని ఆంజనేయులు మరో అడుగు ముందుకేసి ఆధునిక పద్ధతులను అధ్యయనం చేస్తూ ఉమ్మడి కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారులకు చేయూతనందిస్తున్నారు. నాణ్యమైన పశుసంతతి కోసం హైఈల్డ్ జాతి స్పెరమ్‌ను తక్కువ ధరకు అందిస్తూ పాడి పరిశ్రమ ప్రమాణాలు పెంచారు. గ్రామాల్లో పర్యటిస్తూ అక్కడి రైతులతో మాట్లాడుతూ పాల ఉత్పత్తి పట్ల అవగాహన కల్పిస్తూ ఉత్సాహాన్ని కలిగిస్తూ వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అమూల్ సంస్థను రంగంలోకి దింపి అధికారుల ద్వారా ప్రమోట్ చేసినా కృష్ణామిల్క్ యూనియన్‌ను రైతులకు దూరం చేయలేకపోయింది.

విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం

పెరుగుతున్న జనాభాతో గ్రామీణ ప్రాంతాల్లోనూ గేదెలు ఉంచేందుకు స్థలాలు తగ్గిపోతున్నాయి. వ్యవసాయ, ఇతర పనుల్లో నిమగ్నమౌతున్న ప్రజలు పాడి గేదెల పోషణపై దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో కృష్ణామిల్క్ యూనియన్ వినూత్న కార్యక్రమం చేపట్టింది. అధునాతన వసతులతో గేదెల హాస్టల్స్ నిర్వహణకు శ్రీకారం చుట్టింది. పైలెట్ ప్రాజెక్ట్‌గా మునగచర్లలో హాస్టల్ నిర్మించింది. ప్రతి 5 గేదెలను ఒక వ్యక్తిని కేటాయించి వాటి పోషణ చేస్తున్నారు. గడ్డికోసే, పాలు పితికే యంత్రాలను హాస్టల్‌లో సమకూర్చారు. రైతులు కేవలం అక్కడ పనిచేసే వ్యక్తులకు జీతాలు, సబ్సిడీపై కొనుగోలు చేసే ఫీడ్‌కు మాత్రమే సొమ్ము చెల్లించాలి. దీంతో పూర్తిగా భూమిలేని పాడి రైతులకు ఎంతో ఉపయోగంగా కనిపిస్తుంది.


రైతులతో మాట్లాడుతున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ బందాల పర్యటన

మునచగర్లలోని పశువుల హాస్టల్‌ను ఎన్ఆర్‌జీఎస్ డైరెక్టర్ వీకే షణ్ముఖ్‌కుమార్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివరామ్‌ప్రసాద్, పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, కృష్ణామిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను చైర్మన్ చలసాని వారికి వివరించారు. స్పందించిన సదరు అధికారులు ఈ విధానం అద్భుతంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్‌లో అన్ని ప్రాంతాలకూ విస్తరించాలని ఆకాంక్షించారు. చలసాని మాట్లాడుతూ హాస్టళ్లలో పనిచేసే సిబ్బందికి ఉపాధి హామీ పథకం ద్వారా జీతాలు చెల్లించే ఏర్పాటు చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ అధికారి షణ్ముఖ్‌కుమార్‌ను కోరారు. ప్రభుత్వంతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామన్నారు. యూనియన్ డైరెక్టర్ నెలకుదిటి నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కొల్లూరి నాగేశ్వరరావు, ట్రస్టు డైరెక్టర్ కోకా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను వ్యాపారవేత్తలుగా మారుస్తాం

● రాజధాని రైతులు, గ్రామపెద్దలతో సీఆర్‌డీఏ అధికారుల సమావేశం


రాజధాని రైతులు, గ్రామ పెద్దలతో సమావేశమై మాట్లాడుతున్న సీఆర్‌డీఏ అధికారులు

కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సీఆర్‌డీఏ, ఎస్ఆర్ఎం వర్సిటీతో కలిసి ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహణకు సిద్ధమైంది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని రాజధాని ప్రాంతవాసుల భాగస్వామ్యంతో కలిసి విజయవంతం చేసేందుకు శనివారం ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రాంగణంలో రాజధాని ప్రాంత రైతులు, గ్రామపెద్దలతో సన్నాహక సమావేశం నిర్వహించింది. రానున్న రోజుల్లో రాజధాని అమరావతి ప్రాంతం బహుముఖంగా అభివృద్ధి చెందనున్న నేపథ్యంలో స్థానిక రైతులను ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా తీర్చిదిద్దేందుకు ఎస్ఆర్ఎం వర్సిటీ, సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈడీపీలో భాగంగా పలు శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తామని సీఆర్‌డీఏ అధికారులు రైతులకు తెలిపారు. దీన్ని విజయవంతం చేసి రాజధాని అమరావతి అభివృద్ధికి సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈడీపీ నిర్వహణలో హాజరైన రైతుల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను సీఆర్‌డీఏ అధికారులు, వర్సిటీ ప్రతినిధులు స్వీకరించారు. రైతుల సహకారంతో అమరావతిలో ఈడీపీని త్వరలో ప్రారంభిస్తామన్నారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ సతీష్‌కుమార్, సీఆర్‌డీఏ, ఎస్ఆర్ఎం వర్సిటీ సామాజిక సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మత్స్యశాఖ జేడీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న అడిషనల్ డైరెక్టర్ ఏ చంద్రశేఖరరెడ్డి, చిత్రంలో జేడీ నాగరాజు, జిల్లా మత్స్యసహకార సంఘ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగరమేష్

ఆక్వా రైతుల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తిచేయాలి

● రిజిస్ట్రేషన్ ఉంటేనే రాయితీలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులు తమ పొలాలను ఈనెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వారికే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందుతాయని మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ ఏ చంద్రశేఖరరెడ్డి సూచించారు. శనివారం జిల్లా మత్స్యశాఖ జేడీ కార్యాలయంలో అధికారులు, రైతులతో విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల 79వేల 697 ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారని, దాదాపు 6 లక్షల టన్నుల రొయ్యలు, చేపలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. అమెరికాకు ఎక్కువ రొయ్యలు రవాణా అయ్యేవని, కొన్ని ఇబ్బందుల వల్ల రవాణా ఆశించినంతగా జరగడం లేదన్నారు. కేంద్రం ఆక్వా రైతులకు 12 నుంచి 5 శాతం జీఎస్టీ తగ్గించడం శుభపరిణామమన్నారు. బ్యాంకు రుణాల్లోనూ 5శాతం రాయితీ కల్పించిందన్నారు. 240 రోజుల పంటను 300 రోజులకు పెంచేందుకు రైతులు కోరుకుంటున్నారని, దీన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుంటే రైతులకు విద్యుత్ రాయితీ లభిస్తుందన్నారు. ఆర్ఏఎస్ పద్ధతిలో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ రొయ్యలు సాగు చేసే అవకాశం ఉందన్నారు. బయోఫ్లాక్ పద్ధతి వల్ల రొయ్యలను వ్యాధుల బారి నుంచి రక్షించవచ్చన్నారు. జాయింట్ డైరెక్టర్ ఏ నాగరాజు, జిల్లా మత్స్యసహకార సంఘ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగరమేష్ పాల్గొన్నారు.

సండే సెలబ్రిటీ



ఐదున్నర దశాబ్దాలుగా తెలుగువారిని తన నటనతో ఆకట్టుకుంటున్న సహజ నటి **జయసుధ**. ఆమె తొలిసారి హీరోయిన్‌గా నటించిన 'లక్ష్మణరేఖ' విడుదలయి 50 ఏళ్లు అయిన సందర్భంగా తన నటనా ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.

హీరోయిన్‌లపై ఆ వివక్ష ఇంకా ఉంది

54 ఏళ్లు ఎక్కడా విరామం లేకుండా నటించటం ఒక రికార్డు. వెనక్కి తిరిగి చూస్తే ఎలా అనిపిస్తోంది?

'ఇంత త్వరగా కాలం గడిచిపోయిందా?' అనిపిస్తోంది. మీరు అన్నది నిజమే. 54 ఏళ్లగా విరామం లేకుండా నటిస్తూనే ఉన్నా. మా పెద్ద అబ్బాయి కడుపులో ఉన్నప్పుడు- ఏడో నెలలో కూడా నటించా. వాడు పుట్టిన మూడో నెల నుంచి నటించటం మొదలుపెట్టా! ఒక విధంగా చెప్పాలంటే నేను మెటర్నిటీ లీవ్ కూడా పూర్తిగా తీసుకోలేదు. ఒక విధంగా ఇది నా అదృష్టం అనుకోవాలి.

హీరోయిన్ అవుతానని అనుకున్నారా?

నాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఆసక్తి ఉండేది. క్రికెట్ ఆడేదాన్ని. క్రికెటర్ అవ్వాలనేది నా కోరిక. మా ఆంటీ విజయనిర్మల సినిమాల్లోకి వచ్చి స్థిరపడ్డారు. నాకు 12 ఏళ్ల ఉన్నప్పుడు- "పండంటి కాపురం' సినిమాలో ఒక పాత్ర ఉంది. సుజాత (పూర్వాశ్రమంలో నా పేరు) చేస్తే బావుంటుంది" అని మా నాన్నగారు నిడదవోలు వెంకట్రావుగారిని ఆమె అడిగారు. అది నాకు ఇష్టం లేదు. కానీ "సొంత ప్రొడక్షనే కదా... చేస్తే ఏం పోతుంది" అని అందరూ అభిప్రాయపడ్డారు. అలా నా సినిమా ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత మూడేళ్లకు 'లక్షణ రేఖ'లో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నాకు మొదటి నుంచి కెమెరా అంటే బెరుకు లేదు. నటన సహజంగానే వచ్చింది. మొదటి కొన్ని సినిమాల్లో నాకు భాషా సమస్య ఉండేది. నేను పుట్టి పెరిగింది చెన్నైలో కాబట్టి కొంత తమిళ యాస ఉండేది. తెలుగు చదవటం రాదు. అంతేకాదు, నాకు డైలాగ్స్ బట్టీపట్టడం రాదు. దాసరిగారు రెండు, మూడు పేజీల డైలాగ్స్ రాసేవారు. వాటిని విని చెప్పేసేదాన్ని. అయినా నా డబ్బింగ్ నేనే చెప్పుకొనేదాన్ని. అయితే గ్రాంథిక భాషలో ఉండే డైలాగ్స్ విషయంలో ఇబ్బంది ఉండేది. ఎన్టీఆర్ గారు డైరక్ట్ చేసిన 'శ్రీ తిరుపతి వేంకటేశ్వర కల్యాణం' సినిమాలో ఆ ఇబ్బంది వచ్చింది. ఎన్టీఆర్ గారు- "లక్ష్మీదేవి ఫ్రెంచి మాట్లాడుతున్నట్టు ఉంది" అని సరదాగా అనేవారు. డబ్బింగ్ చెప్పటానికి ఎక్కువ రోజులు సమయం లేదు. దాంతో ఆ సినిమాలో నా పాత్రకు డబ్బింగ్ చెప్పించారు. నాకు వేరేవాళ్ల డబ్బింగ్ చెప్పిన సినిమా అదొక్కటే!

మొదట్లో ప్రతి ఏడాది పది, పన్నెండు సినిమాలు చేసేవారు. కష్టమయ్యేదా?

మొదటి నాలుగేళ్లు చాలా కష్టపడ్డా! రోజుకు ఐదు షిఫ్టులు చేసేదాన్ని. ఉదయం మూడున్నరకు వెళ్లి నిద్రపోయి, ఉదయం ఆరింటికి షూటింగ్‌కి బయలుదేరి వెళ్లిపోయేదాన్ని. విపరీతమైన నిద్ర వచ్చేది. అప్పుడప్పుడు నిద్ర రాకుండా అమ్మ పొగలు కక్కుతున్న కాఫీ కప్పు నాముందు ఉంచేది. కాఫీ వాసన చూసిన తర్వాత నిద్ర కొద్దిగా పోయేది. 'ఆక్రందన', 'పక్కింటి అమ్మాయి', 'యుగంధర్' సినిమాలైతే కేవలం సాయంత్రం 6-9 కాల్‌షీట్‌లో పనిచేసి పూర్తిచేశా. ఆ తర్వాత నాన్నతో అంత కష్టపడనని చెప్పాను. కొద్దికాలానికి... సాయంత్రం 6 గంటల తరువాత పనిచేయనని చెప్పేశాను!

చిన్నతనంలోనే పెద్ద వయసున్న పాత్రలు వేశారు కదా... ఎలా అనిపించేది?

'జ్యోతి', 'గోపాలరావుగారి అమ్మాయి', 'పక్కింటి అమ్మాయి', 'ఆమె కథ'- ఇలా అన్నీ టైటిల్ రోల్స్ చేసేదాన్ని. ఈ సినిమాలన్నీ హీరోయిన్ ప్రధానమైనవే! అన్నీ నాకు ముప్పై ఏళ్లలోపు వచ్చినవే! వాటి గురించి నేను పెద్దగా ఆలోచించలేదు. నేను చేసిన 350 సినిమాల్లో ఓ పది, ఇరవై నాకు ఇష్టం లేకుండా చేసినవి ఉండచ్చు. స్క్రిప్టులు అన్నీ నేనే వినేదాన్ని. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. షూటింగ్‌లో ఉన్నప్పుడు పాత్రలో ఉంటాను. అయిపోయిన వెంటనే మామూలు ప్రపంచంలోకి వచ్చేస్తాను. ఇది నాకు చాలా సహజంగా జరిగిపోతుంది. అందువల్ల మానసికంగా పెద్ద ఇబ్బంది అనిపించేది కాదు.




ఇంత కష్టపడుతున్నాను కదా... 'సినిమాలు మానేద్దామా!' అని ఎప్పుడూ అనిపించలేదా?

మూడేళ్ల తర్వాత మానేద్దామనుకున్నాను. నాన్న- "నీకు చదువురాలేదు. క్రికెటర్ అవ్వాలనుకుంటే పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు. లేకపోతే పెళ్లి చేసుకోవాలి. నటిస్తే తప్పేముంది?" అన్నారు. ఆంటీ కూడా "మొదలైంది కాబట్టి కొనసాగిద్దాం" అన్నారు. కుటుంబంలో ఉన్నవారందరూ నేను నటిస్తేనే బెటర్ అనుకున్నారు. పెళ్లి అయిన తర్వాత మానేద్దామనుకున్నా. కానీ నితిన్‌కి కూడా సినిమాలు మాత్రమే తెలుసు. ఆయన డైరక్టర్‌గా మారితే మానేద్దామనుకున్నా. అది కుదరలేదు. 60 ఏళ్లు వచ్చిన తర్వాత మానేద్దామనుకున్నా. కానీ నాకు 59 ఏళ్లు ఉన్నప్పుడు నితిన్ చనిపోయారు. అదొక షాక్! ఆ సమయంలో 'శతమానం భవతి' సినిమా షూటింగ్ పూర్తయింది. ఆ సినిమా ప్రమోషన్స్‌కు వెళ్లాల్సి వచ్చింది. అలాగే అయిపోతోంది. నాకు ఒక సముద్రం ఒడ్డున ఇల్లు కట్టుకొని, ఉదయాన్నే వాక్‌కు వెళ్తూ, మధ్యాహ్నం లైబ్రరీకి వెళ్తూ జీవించాలని ఉంటుంది. అప్పుడప్పుడు 'నా జీవితం ఇలా ముందే రాసి ఉందేమో?' అనుకుంటాను.



ఇండస్ట్రీ పురుష ఆధిపత్యంలోనే ఉంటుంది కదా... ఇంత కాలం ఎలా ఉండగలిగారు?

భానుమతిగారు బలమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి. సావిత్రి గారు తన వ్యక్తిగత జీవితాన్ని సరిగ్గా నడుపుకోలేకపోయారు. వాణిశ్రీగారు, జమునగారు.. వీరందరూ ఒకప్పుడు ఇండస్ట్రీని శాసించిన వారే! తమ టర్న్‌లో జీవించినవారే! నా దగ్గరకు వచ్చేసరికి - కథలు, స్క్రిప్టుల విషయంలో నేను ఎప్పుడూ రాజీ పడే దాన్ని కాదు. మా సమయంలో హీరోయిన్ ఆధారిత సినిమాలు అనేకం వచ్చేవి. హీరోలు కూడా అలాంటి పాత్రలు అంగీకరించేవారు. నేను, జయప్రద, శ్రీదేవి- మేము ముగ్గురం చాలా కాలం తెలుగు సినీ రంగాన్ని ఏలాం. ఆ తర్వాత జయప్రద, శ్రీదేవి బాలీవుడ్‌కు వెళ్లిపోవటంతో వారి రోల్స్‌ను కూడా నేనే చేసేదాన్ని. అయితే హీరో, హీరోయిన్‌లను చూసే విధానంలో అప్పుడు తేడా ఉంది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. హీరో ఆరాధన కొనసాగుతూనే ఉంటుంది. 150 మంది పనిచేస్తూ ఉంటే 20 మంది మాత్రమే మహిళలు ఉంటారు. ఇప్పుడు మరింతగా పెరిగిపోయింది. ఇప్పుడు హీరోయిన్... హీరోకు తోకలాగ ఉంటోంది. రూ.100 కోట్లు తీసుకునే హీరోయిన్లు ఎవ్వరు లేరు కదా!



నేను కొన్ని గ్లామరస్ పాత్రలు చేశాను. నన్ను, కమల్‌హాసన్‌ను- నీతూసింగ్, రిషీకపూర్‌లతో పోల్చేవారు. వాళ్లు ధరించిన మాదిరి కాస్ట్యూమ్స్‌ను మేం వేసుకొనేవాళ్లం. ఇక నా దృష్టిలో గ్లామర్ అంటే జీనత్ అమన్. ఆమె ఫిగర్ అలాంటిది. ఆమెకు ఎలాంటి దుస్తులు వేసినా వల్గర్‌గా ఉండేది కాదు. ఇక బికినీల లాంటివి నేను చాలా తక్కువ సినిమాల్లో ధరించా. 'యుగంధర్' (హిందీలో 'డాన్') సినిమాలో వేసుకోవాల్సి వచ్చింది. తెలుగులో నేను చేసిన పాత్రను హిందీలో జీనత్ అమన్ చేసింది. అలాంటి దుస్తులు ధరించాలన్నా నేను పెద్దగా ఇబ్బంది పడే దాన్ని కాదు. ఎందుకంటే చిన్నప్పుడు నేను స్విమ్మర్‌ను. స్విమ్మింగ్ చేసేటప్పుడు చీర కట్టుకోరు కదా! సినిమాలో కూడా అంతే! ఇక డైలాగ్స్, కాస్ట్యూమ్స్ విషయంలో ఇబ్బంది ఉంటే డైరక్టర్‌లకు చెప్పకుండా మాతో నటించే హీరోలకు చెప్పేవాళ్లం. వారు వెళ్లి మా పేరు చెప్పకుండా - "ఈ దుస్తులు బాగుంటాయా?", "ఈ డైలాగ్ బావుందా?" అని డైరక్టర్‌లను అడిగేవారు. డైలాగ్స్‌లో ఏదైనా తేడా ఉంటే అందరికన్నా ముందే ఏఎన్నార్ పసిగట్టేసేవారు.

ఆ రోజుల్లో సోషల్ మీడియాలేదు కాబట్టి బతికిపోయేవాళ్లం. ఎల్లో జర్నలిజం ఉండేది కానీ ఏవైనా రూమర్స్ రాస్తే వెళ్లికొట్టేవారు. ఆ సమయంలో కాగడాశర్మ అనే ఆయన చాలా ఫేమస్. ఆయన ఇలాంటివి రాసేవారు. అయినా అవేవీ నా దగ్గరకు వచ్చేవి కావు. ఒకసారి ఏదో ఫంక్షన్‌లో ఒక వ్యక్తి వచ్చి నా పక్కన కూర్చున్నారు. ఆయన ఎవరో నాకు తెలియదు. "నేను కాగడాశర్మని..." అని పరిచయం చేసుకున్నారు. నేను అప్రయత్నంగా - "మీరేనా... ఎందుకండీ... అందరి గురించి అంత బ్యాడ్‌గా రాస్తారు..." అన్నాను! "అలా రాయకపోతే ఎవరు చదువుతారమ్మా" అన్నాడాయన. ఇండస్ట్రీలో ఉన్న హెయిర్‌డ్రెస్సర్స్ గ్యాసిప్ మాట్లాడుకుంటూ ఉండేవారు.

చిన్నప్పుడు మా ఇంట్లో బీటిల్స్ లాంటి ఇంగ్లీషు పాటలు మాత్రమే వినేవాళ్లం. నాన్నా, ఇంగ్లీషు సినిమాలు చూసేవారు. అమ్మ హిందీ సినిమాలు మాత్రమే చూసేవారు.

నాకు చీరలంటే చాలా ఇష్టం. చీరల ఎగ్జిబిషన్‌లు నడుపుతూ ఉంటా. అమ్మాయిలకు చీర కన్నా అందమైన కాస్ట్యూమ్ మరేదీ ఉండదు. నా చిన్నతనంలో చాలా వేగంగా చీర కట్టేసుకొనేదాన్ని. కానీ ఈ మధ్యకాలంలో చీరకట్టుకోవటం మానేశాను. ఫ్యాంట్, షర్ట్‌లు చాలా సౌలభ్యంగా అనిపిస్తున్నాయి.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

"మీ వయసుకు ఇలాంటి దుస్తులు వేసుకోవటం సబబేనా?" అని ఎవరైనా అడిగితే ఏం చేస్తారు? అది కూడా లక్షలమంది చూసే ఇంటర్వ్యూలో... కొందరైతే- "వీడితో మనకెందుకు..." అని వదిలేస్తారు. కానీ సినీ పరిశ్రమలో పుట్టి పెరిగిన **మంచు లక్ష్మి** అలా ఊరుకోలేదు. తనను అలా ప్రశ్నించిన వెబ్‌సైట్ జర్నలిస్టును క్షమాపణలు చెప్పమని అడిగారు. అందుకు ఆ జర్నలిస్ట్ అంగీకరించకపోతే ఫిల్మ్ ఛాంబర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా మహిళను కాబట్టే తనకు న్యాయం జరగటం లేదంటున్నారు లక్ష్మి. కొద్ది రోజులుగా తాను అనుభవిస్తున్న వ్యధను ఆమె.. 'నవ్య'తో పంచుకున్నారు.

క్షమాపణ కోరడం కూడా తప్పేనా?



"**నే**ను తెలుగు సినీ పరిశ్రమలో పుట్టాను. పెరిగాను. పరిశ్రమ తీరుతెన్నులు నాకు బాగా తెలుసు. ఇండస్ట్రీలో పురుషాధిక్యం ఉంటుందని కూడా తెలుసు. కానీ నా అస్థిత్వాన్ని, నా స్వేచ్ఛను హరించి, నన్ను కంచెలలో బంధించాలంటే మాత్రం భరించలేను. ఎందుకంటే అది నా వ్యక్తిత్వం కాదు. ఈ సమాజంలో మహిళల పట్ల వివక్ష అన్ని రకాలుగానూ ఉంటుంది. కానీ అది బయటకు కనిపించదు. మహిళలు బయటకు వెళ్లాలంటే లక్ష రకాలుగా ఆలోచిస్తారు. "నేను వేసుకొనే దుస్తులు బావున్నాయా? ఎవరైనా ఏదైనా కామెంట్ చేస్తారా?"- ఇలాంటి ఆలోచనలు ఎన్నో! గతవారం నా సినిమా 'దక్ష' ప్రమోషన్స్‌లో భాగంగా 'గ్రేటాంధ్ర' అనే వెబ్‌సైట్‌లో పనిచేసే మూర్తి అనే ఒక జర్నలిస్టుకు ఇంటర్వ్యూ ఇచ్చాను. ఆయన వయసులో చాలా పెద్దవారు. తన ఇంటర్వ్యూలలో అవతలి వ్యక్తులను అవమానిస్తూ ఉంటారు. ఇటీవలే తేజ సజ్జాను కూడా అవమానించారు. తేజ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. ఆయన మాటలకు నేను కూడా హర్ట్ అయ్యా! బురద మీద రాయి వేస్తే అది మన మొహం మీదే చిమ్ముతుందంటారు. దీన్ని ఇప్పటిదాకా నేను నమ్మేదాన్ని. అందుకే నేను స్పందించలేదు. నన్ను చేసిన ఇంటర్వ్యూలో నా వయసు గురించి, నేను వేసుకున్న దుస్తులు మీద కామెంట్ చేశారు. ఆయనకు ఆ ఇంటర్వ్యూలోనే సమాధానం చెప్పాను. "పొరపాటైపోయింది.. ఏదో ఫ్లోలో వచ్చేసింది..." అంటారేమో అనుకున్నా. కానీ ఆయన - "ఇదంతా అలవాటే. వైరల్ అయిందా? లేదా" అని నవ్వారు. ఆ మాటలకు నేను చాలా హర్ట్ అయ్యా! 'ఒక మహిళను అంత చులకనగా చూస్తారా? ఆమెకు తనకు నచ్చిన దుస్తులు వేసుకొనే స్వేచ్ఛ కూడా లేదా? ఒకవేళ తనకు నచ్చిన దుస్తులు వేసుకుంటే పరిహసిస్తారా?' అనే ఆలోచనలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. ఆ ఇంటర్వ్యూ విడుదలయిన వెంటనే సినిమా ఇండస్ట్రీలో అనేకమంది నాకు కాల్స్ చేశారు. నాకు మద్దతుగా నిలుస్తామన్నారు. ఆయనపై ఫిర్యాదు చేయమన్నారు.

స్పందన లేదు...

ఆయన మాట్లాడిన వెకిలి మాటలకు క్షమాపణలు చెప్పించమని కోరుతూ ఫిల్మ్‌ఛాంబర్‌కు, 'మా' అసోసియేషన్‌కు ఫిర్యాదు పంపించాను. కానీ ఎటువంటి స్పందన లేదు. పైగా "ఏ మూర్తి?" అని అడిగారు. ఆ వివరాలను కూడా పంపాను. బహిరంగంగా ఒక వ్యక్తి నన్ను అవహేళన చేస్తే... దాని రికార్డులు కూడా ఉంటే ఎవ్వరూ స్పందించటానికి ముందుకు రాకపోవటం ఆశ్చర్యంగా అనిపించింది. 'ఇదే ఒక హీరోకి జరిగితే పరిశ్రమ ఇలాగే స్పందిస్తుందా?' అనిపించింది. 'నా కోసం నేను నిలబడకపోతే ఇంకెవరు నిలబడతారు' అనిపించింది. ఇంకో విషయం కూడా ఇక్కడ చెప్పాలి. నన్ను ఇంటర్వ్యూ చేసిన వెబ్‌సైట్ కూడా క్షమాపణలు చెప్పలేదు. కనీసం 'మేము చింతిస్తున్నాం' అనే మాట కూడా పబ్లిష్ చేయలేదు. పైగా "ఆ ఫిర్యాదు ఎందుకు? ఇక్కడితో వదిలేయ్" అని అనేక ఫోన్లు వచ్చాయి. సోషల్ మీడియా విస్తృత ప్రచారంలోకి వచ్చిన తర్వాత వెబ్‌సైట్ల పేరుతో అనేకమంది రకరకాల దందాలు చేస్తున్నారు. బయట ప్రపంచంలోకి వచ్చి - "మేము ఈ వార్త రాశాం" అని చెప్పుకొనే ధైర్యం కూడా ఉండదు. మా చేతుల ఫోటోలు, కాళ్ల ఫోటోలు, నడుముల ఫోటోలు వేసుకొని బతుకుతున్న వెబ్‌సైట్లు ఎన్నో ఉన్నాయి. మామీద గాసిప్స్ రాసి బతికేవాళ్లు ఎందరో ఉన్నారు. వాళ్లందరినీ బాగు చేయాలనుకోవటం లేదు. కానీ నన్ను బహిరంగంగా అవమానించినప్పుడు- క్షమాపణ కోరటం కూడా తప్పేనా? 'మన సమాజంలో పురుషాధిక్యత ఇంత వేళ్లూనుకుందా?' అనిపిస్తోంది. నన్ను అవమానించిన వ్యక్తి ఇంట్లో మహిళలు ఎంత దుర్భర పరిస్థితిలో బతుకుతున్నారో? అనిపిస్తోంది.

భయపడను...

చాలామందికి సినిమా పరిశ్రమ గ్లామరస్‌గానే కనిపిస్తుంది. దాని వెనక వేరే కోణాలెన్నో ఉన్నాయి. మేము ప్రతి రోజూ పొట్టనిండా తిండి కూడా తినలేం. పగలనక, రాత్రనక ఎంత కష్టపడతామో చాలామందికి తెలియదు. నేను ఫిర్యాదు చేసిన తర్వాత కూడా నాకు అనేక మంది ఫోన్ చేశారు. "శభాష్ లక్ష్మీ! నువ్వు పోరాడు..." అన్నారు. ఈ పోరాటం చాలా కష్టమైనదని నాకు కూడా తెలుసు. నా ఫిర్యాదు వైరల్ అయిన వెంటనే - నా ఫోటోలను మార్ఫింగ్ చేసి, అశ్లీలమైన పోస్టులు పెట్టేస్తున్నారు. ఇలాంటి చిల్లర వేషాలకు నేను భయపడను. నాకు న్యాయం జరిగేదాకా పోరాడతాను."

వేడుక

పూల జాతర మొదలైంది

నేడు ఎంగిలిపూల బతుకమ్మ

తెలంగాణ గ్రామీణ సంస్కృతికి అద్దంపట్టే, ప్రకృతితో మమేకమయ్యే సంబరం... బతుకమ్మ పండుగ. ఈ వేడుకలు ప్రతి యేటా భాద్రపద అమావాస్య... అంటే మహాలయ అమావాస్య (పెత్రామాస) రోజున ప్రారంభమవుతాయి. ఈ సంబరాల్లో బతుకమ్మలను రోజుకో పేరుతో కొలుస్తారు. మొదటి రోజున ఎంగిలి పూల బతుకమ్మ అలంకరణ కోసం ముందురోజే రకరకాల పువ్వులు కోసుకొని తీసుకొచ్చి, నీళ్లలో వేస్తారు. మర్నాడు వాటితో బతుకమ్మను అలంకరిస్తారు. అందుకే 'ఎంగిలిపూల బతుకమ్మ' అంటారు. పూలతో చక్కగా బతుకమ్మను పేర్చి, తమలపాకులు ఉంచి, పసుపుతో తయారు చేసిన బతుకమ్మను దానిపై పెట్టి పూజలు చేస్తారు. ఈ తొమ్మిది రోజులూ రకరకాల ప్రసాదాలను బతుకమ్మకు నివేదిస్తారు.

ఈ రోజు నైవేద్యం: నువ్వులు, నూకలు, బియ్యం పిండి, బెల్లం



బిజినెస్ ప్లస్

ఐటీ రిఫండ్ ఇంకా రాలేదా!

అయితే వీటిని ఓసారి పరిశీలించండి..

ఈ నెల 16తో ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్‌ల ఫైలింగ్ ముగిసింది. దాదాపు ఏడు కోట్ల మందికిపైగా తమ రిటర్న్‌లు ఫైల్ చేశారు. వీరిలో చాలా మంది రిఫండ్స్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. జూన్-జూలైలో రిటర్న్ ఫైల్ చేసినా ఇంకా మాకు రిఫండ్ అందలేదని చాలా మంది ఫిర్యాదు చేస్తున్నారు. మరోపక్క ఐటీ రిటర్న్‌ల ప్రాసెసింగ్, ఈ-వెరిఫికేషన్ శరవేగంగా చేస్తున్నట్టు ఐటీ శాఖ చెబుతోంది. అయినా రిఫండ్స్ ఎందుకు ఆలస్యమవుతున్నాయో తెలుసుకుందాం.



ఆలస్యానికి కారణాలు

ఐటీ రిటర్న్ ఫైల్ చేసి ఈ-వెరిఫికేషన్ పూర్తయిన నాలుగు నుంచి ఐదు వారాల్లో రిఫండ్ మొత్తం ఆయా వ్యక్తుల బ్యాంకు ఖాతాల్లో పడాలి. ఈ గడువులోగా రిఫండ్ రాకపోతే ఈ కింది విషయాలు కారణమై ఉంటాయి. అవేమిటంటే..

- ఐటీ శాఖ వద్ద ఉండే టాక్స్‌పేయర్ ఇన్ఫర్మేషన్ సమ్మరీ (టీఐఎస్), యాన్యువల్ ఇన్ఫర్మేషన్ సమ్మరీ (ఏఐఎస్), ఫామ్ 26ఏఎస్‌లోని సమాచారానికి, ఫైల్ చేసిన రిటర్న్‌లోని సమాచారం మధ్య తేడాలు
- ఐటీ శాఖ నుంచి ఏమైనా నోటీసులు, రివ్యూల సమాచారం వచ్చినప్పుడు
- బిజినెస్ ఆదాయం, మూలధన లాభాలు, అనేక తగ్గింపులు (డిడక్షన్స్) ఉన్నప్పుడు
- రిఫండ్ మొత్తం రూ.50,000 కంటే ఎక్కువగా ఉన్నప్పుడు
- టీడీఎస్ డేటాలో తేడాలు.
- రిటర్న్‌ల్లోని వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఏర్పడినప్పుడు
- బ్యాంకు ఖాతాను ముందుగా వ్యాలిడేట్ చేయకపోవడం
- బ్యాంకు ఖాతాలోని పేరు, పాన్ కార్డుపై ఉన్న పేరులో తేడా
- తప్పుడు ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఉన్నప్పుడు
- ఐటీఆర్‌లో పేర్కొన్న బ్యాంకు ఖాతా క్లోజ్ చేసినప్పుడు
- పాన్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయకపోవటం

ఐటీఆర్ స్టేటస్ రకాలు

సబ్‌మిటెడ్ అండ్ పెండింగ్ ఫర్ ఈ-వెరిఫికేషన్ అని వస్తే: రిటర్న్ ఫైల్ చేసినా ఈ-వెరిఫికేషన్ పూర్తి కాకపోవడం లేదా సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)కు వెరిఫై చేసిన మీ రిటర్న్ ఇంకా అందలేదని అర్థం.

సక్సెస్‌ఫుల్లీ ఈ-వెరిఫైడ్ అని వస్తే: మీ రిటర్న్ ఈ-వెరిఫై చేయబడింది. అయితే రిటర్న్‌లోని విషయాలను ఇంకా ప్రాసెస్ చేయలేదు అని అర్థం.

ప్రాసెస్డ్: మీరు దాఖలు చేసిన రిటర్న్ విజయవంతంగా ప్రాసెస్ చేయబడింది అని అర్థం.

డిఫెక్టివ్: మీరు ఫైల్ చేసిన రిటర్న్‌లో కీలకమైన కొన్ని వివరాలు లేకపోవడం లేదా తేడాలు ఉన్నాయని అర్థం.

ఇలాంటి సందర్భాల్లో నిర్ణీత కాలవ్యవధిలోగా ఈ లోపాలను సవరించి మళ్లీ రిటర్న్ ఫైల్ చేయాలని ఐటీ శాఖ సెక్షన్ 139 (9) కింద నోటీసులు జారీ చేస్తుంది. ఆ నోటీసులకు స్పందించకపోతే మీ ఐటీ రిటర్న్‌ను చెల్లనిదిగా భావించి ప్రాసెస్ చేయరు.

కేసు ట్రాన్స్‌ఫర్డ్ టు అసెసింగ్ ఆఫీసర్: మీ రిటర్న్‌లోని కొన్ని విషయాల్లో ఏమైనా తీవ్రమైన తేడాలు ఉంటే సీపీసీ ఆ రిటర్న్‌లు అసెసింగ్ అధికారికి బదిలీ చేస్తుంది. అప్పుడు అసెసింగ్ అధికారి అడిగిన వివరాలు సబ్‌మిట్ చేస్తే సరిపోతుంది.

చెక్ చేయడం ఎలా?

మన రిఫండ్ ఎందుకు ఆలస్యమవుతుందనే విషయాన్ని ఈ కింది పద్ధతిలో చెక్ చేసుకోవచ్చు.

- పాన్ నంబర్, పాస్‌వర్డ్ ద్వారా incometax.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ కావాలి. ఇందుకోసం ఇప్పటికే మీ పాన్ నంబర్‌ను మీ ఆధార్ నంబరుతో అనుసంధానం చేసి ఉండాలి. ఒకవేళ చేసి ఉండకపోతే, ఇదే వెబ్‌సైట్‌లోని 'లింక్ నౌ' బటన్ ఆప్షన్ ద్వారా అనుసంధానించాలి.
- లాగిన్ అయిన తర్వాత టాప్ మెనూలో ఉన్న నౌ యువర్ రిఫండ్ స్టేటస్‌పై క్లిక్ చేయాలి.
- ఇప్పుడు ఈ-ఫైల్ ట్యాబ్‌లోకి వెళ్లి 'ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్స్' ట్యాబ్ మీద క్లిక్ చేసి 'వ్యూ ఫైల్డ్ రిటర్న్స్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- ఇప్పుడు కోరుకున్న అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి మీ రిఫండ్ స్టేటస్ స్క్రీన్‌పై కనిపిస్తుంది.

జీఎస్‌టీ 2.0.. వ్యాపారులు ఇవి తెలుసుకోండి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జీఎస్‌టీ 2.0 సంస్కరణలు ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్నాయి. గూడ్స్, సర్వీసెస్‌కు సంబంధించి ఇప్పటికే తగ్గించిన రేట్లకు అనుగుణంగా నోటిఫికేషన్లు జారీ చేయటం జరిగింది. అంతేకాదు పన్ను తగ్గింపు ప్రయోజనాలను కచ్చితంగా వినియోగదారులకు బదిలీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలిచ్చింది. ఈ సందర్భంగా ఉత్పత్తిదారులు, వ్యాపారస్తులు పాటించాల్సిన నియమ నిబంధనలేమిటో చూద్దాం.



రాంబాబు గొండాల

మొదటిది, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)కి సంబంధించినది. ఇంతకు ముందు 28 శాతంలో ఉన్న వస్తువులను 18 శాతానికి, 12 శాతంలో ఉన్న వస్తువులు 5 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. ఇక్కడ చాలా మందికి వచ్చే సందేహం ఏమిటంటే సెప్టెంబరు 21 నాటికి ఉన్న స్టాక్ మీద ఎక్కువ శాతంలో ఐటీసీ తీసుకోవటం జరిగింది. అంటే 28 శాతం లేదా 12 శాతంలో. అలాంటప్పుడు రేటు తగ్గిన మేరకు ఐటీసీని రివర్స్ చేయాల్సిన అవసరం ఉందా? జీఎస్‌టీ నిబంధనల మేరకు ఒక సరఫరా మీద పన్ను చెల్లిస్తున్నప్పుడు ఐటీసీకి అర్హులు. దీనికి పన్ను శాతానికి సంబంధం లేదు. కాబట్టి ఇప్పటికే తీసుకున్న క్రెడిట్ ఐటీసీ నియమ నిబంధనల మేరకు ఉంటే ఎలాంటి సమస్య లేదు.

ఇకపోతే, కొన్ని వస్తువులు పూర్తిగా పన్ను మినహాయింపులోకి చేరాయి. అంటే, వీటికి సంబంధించిన ఇన్‌పుట్ మీద ఇప్పటికే ఐటీసీ పొంది ఉంటారు. కానీ, 22 వ తేదీ నుంచి వీటి అమ్మకాలపై ఎలాంటి పన్ను వర్తించదు. కాబట్టి ఇలాంటి ఉత్పత్తులకు సంబంధించి 21 తేదీ నాటికి మిగిలి ఉన్న స్టాక్ మీద ఐటీసీ రివర్స్ చేయాలి. చాలా సందర్భాల్లో ఉన్న స్టాక్‌కు సరిపడా ఐటీసీ బ్యాలెన్స్ ఉండదు. ఎందుకంటే ఐటీసీని ఎప్పటికప్పుడు ట్యాక్స్ చెల్లింపు కోసం వాడుతుంటారు. అలాంటప్పుడు క్యాష్ లెడ్జర్ ద్వారా తగ్గిన మేరకు చెల్లించాలి. కొన్ని సందర్భాల్లో ఉన్న స్టాక్ కంటే ఎక్కువ ఐటీసీ బ్యాలెన్స్ ఉంటుంది. అలాంటప్పుడు స్టాక్‌కు సరిపోను ఐటీసీ రివర్స్ చేయటంతో పాటుగా మిగిలినది కూడా రివర్స్ చేయాలి.

అదే ఉత్పత్తిదారులకైతే స్టాక్‌లో ఉన్న ఇన్‌పుట్స్‌తో పాటుగా సెప్టెంబరు 21 నాటికి తయారీలో ఉన్న ఇన్‌పుట్స్ అంటే సెమీ ఫినిష్, ఫినిష్ స్టేజీలో ఉన్న ఇన్‌పుట్స్ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని సరిపడా ఐటీసీ రివర్స్ చేయాలి. అలాగే క్యాపిటల్ గూడ్స్ మీద క్రెడిట్ తీసుకుని ఉంటే దాని జీవితకాలం 20 త్రైమాసికాలు (5 సంవత్సరాలు)గా భావించి, మిగిలిన కాలానికి సరిపోను ఐటీసీ రివర్స్ చేయాలి. ఇకపోతే, రేటు తగ్గింపునకు సంబంధించి సవరించిన ధరల జాబితా (ప్రైస్ లిస్ట్)ను ఉత్పత్తిదారులు.. డీలర్లు, రిటైలర్స్‌కు తప్పక పంపాలి. ఇది కొనుగోలుదారులకు అందుబాటులో ఉండేట్లు తగు జాగ్రత్తలే తీసుకోవాలి. అలాగే ఇంకొక ముఖ్య సందేహం ఏమిటంటే.. ఒకవేళ ఇప్పటికే అమ్ముడుపోయిన సరుకుకు సంబంధించి క్రెడిట్ నోట్‌ను సెప్టెంబరు 22 తర్వాత జారీ చేయాల్సి వస్తే.. ఏ రేటు పరిగణనలోకి తీసుకోవాలి? క్రెడిట్ నోట్ అనేది ఇంతకు ముందు జారీ చేసిన ఇన్వాయిస్‌కు సంబంధించి ఇస్తున్నారు కాబట్టి, ఇన్వాయిస్‌లో ఉన్న రేటును పరిగణనలోకి తీసుకోవాలి. అంటే పాత రేటు ప్రకారమే ఇవ్వాలి.

ఏది ఏమైనా తగ్గించిన పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. కాబట్టి వ్యాపారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి తమ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్‌లో తగు మార్పులు చేసుకోవటంతో పాటు సెప్టెంబరు నెలకు సంబంధించిన రిటర్నులను జాగ్రత్తగా పరిశీలించి దాఖలు చేయాలి. ఒకటే ప్రొడక్ట్ అమ్మే వారికి పెద్ద సమస్య ఉండకపోవచ్చు కానీ, వివిధ రకాల ఉత్పత్తులు అమ్ముతూ వాటిలో కొన్ని మినహాయింపులోకి వచ్చినప్పుడు ఐటీసీ రివర్స్ చేయటం జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఆలస్యంగానూ రిటర్నుల ఫైలింగ్

లేటు ఫీజుతో సాధ్యమే

ఈ నెల 16తో ఐటీ రిటర్న్‌ల గడువు ముగిసింది. డెడ్‌లైన్‌ను ఒక రోజు పొడిగించినా కొంతమంది ఇంకా తమ రిటర్న్ ఫైల్ చేయలేదు. అయితే వీరు లేటు ఫీజుతో తమ రిటర్న్ ఫైల్ చేయడానికి ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గడువు ఉంది.

పెనాల్టీ ఎంత?

- వార్షికాదాయం రూ.5 లక్షల వరకు ఉంటే రూ.1,000
- వార్షికాదాయం రూ.5 లక్షలకు మించితే రూ.5,000

ఎదురయ్యే పరిణామాలు వడ్డీ భారం..

నిర్ణీత గడువులోగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయకుండా, ఆలస్యంగా చేస్తే, చెల్లించాల్సిన పన్ను బకాయిలపై వడ్డీ పడుతుంది.

క్యారీ ఫార్వర్డ్ ప్రయోజనాలు కోల్పోవడం..

రిటర్న్ ఆలస్యంగా ఫైల్ చేసినా పూరించని తరుగుదల, ఇంటి అమ్మకాలపై వచ్చే నష్టాలకు మాత్రమే క్యారీ ఫార్వర్డ్ ప్రయోజనం లభిస్తుంది. మిగతా నష్టాలకు ఆశలు వదులుకోవాల్సిందే

రిఫండ్స్ ఆలస్యం..

ఇప్పటికే రిటర్న్ ఫైల్ చేసి రెండు మూడు నెలలు గడిచినా కొందరికి రిఫండ్స్ అందలేదు. గడువు ముగిశాక ఫైల్ చేసే రిటర్న్‌ల రిఫండ్స్ మరింత ఆలస్యం అవుతాయి.

మరింత స్క్రూటినీ..

ఆలస్యంగా ఫైల్ చేసే ఐటీ రిటర్న్‌లను ఐటీ శాఖ మరింత కూలంకషంగా స్క్రూటినీ చేసే అవకాశం ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	130
వరంగల్	115	గుంటూరు	132
కరీంనగర్	115	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	120
కర్నూలు	115	నెల్లూరు	125
విశాఖపట్నం	134	అనంతపురం	125
గోదావరి	130		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,12,150 ▲	1,02,800 ▲	1,45,000 ▲
విజయవాడ	1,14,100 ▲	1,08,000 ▲	1,34,500 ▲
విశాఖపట్నం	1,12,150 ▲	1,02,800 ▲	1,45,000 ▲
రాజమండ్రి	1,12,150 ▲	1,02,800 ▲	1,34,700 ▲
ప్రొద్దుటూరు	1,14,400 ▲	1,05,250 ▲	1,35,000 ▲
ముంబై	1,09,775 ▼	1,00,554 ▼	1,28,000 ▲

తగ్గిన ఏసీలు, డిష్‌వాషర్ల ధరలు

రూ.4,500, రూ.8,000 వరకు తగ్గించిన కంపెనీలు

న్యూఢిల్లీ: రూమ్ ఎయిర్ కండీషనర్లు (ఏసీలు), డిష్‌వాషర్స్ ధరలను గణనీయంగా తగ్గించినట్లు ఎలక్ట్రానిక్స్ గృహోపకరణ తయారీ సంస్థలు ప్రకటించాయి. ఈ ఉత్పత్తులపై జీఎస్‌టీని ప్రభుత్వం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించటంతో ఆ మేరకు పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేసినట్లు కంపెనీలు వెల్లడించాయి. రూమ్ ఏసీ ధరలను గరిష్ఠంగా రూ.4,500 వరకు, డిష్‌వాషర్స్ ధరలను రూ.8,000 వరకు తగ్గించినట్లు కంపెనీలు వెల్లడించాయి. ఈ నెల 22 నుంచి తగ్గించిన ధరలు అమల్లోకి వస్తాయని తెలిపాయి. ధరల తగ్గింపుతో పండగ సీజన్‌లో విక్రయాల్లో రెండంకెల వృద్ధి చేసే నమోదు చేసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏసీ, డిష్ వాషర్స్ తయారీ కంపెనీలైన వోల్టాస్, డైకిన్, గోద్రెజ్ అప్లయెన్సెస్, పానాసోనిక్, హాయర్ వంటి ప్రధాన బ్రాండ్లు ఇప్పటికే సవరించిన జాబితాను విడుదల చేశాయి.

ఎంత తగ్గాయంటే..

వోల్టాస్ ఫిక్స్‌డ్ స్పీడ్ విండో ఏసీ ధరను రూ. 42,900 నుంచి రూ. 39,590కి, ఇన్వర్టర్ విండో ఏసీ ధరను రూ. 46,990 నుంచి రూ. 43,290కి తగ్గించగా, డైకిన్ ఒక టన్ను 5 స్టార్ ఇన్వర్టర్ ఏసీ ధర రూ. 20,500 నుంచి రూ. 18,890కి తగ్గించింది. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ తన ఎంట్రీ లెవెల్ 1 టన్ను 3 స్టార్ ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీని రూ. 32,890గా నిర్ణయించగా, 2 టన్నుల మోడల్ ధరను రూ. 55,490కి తగ్గించింది. హాయర్ 1.6 టన్నుల గ్రావిటీ ఇన్వర్టర్ ఏసీ ధరను రూ. 46,085గా సవరించింది. గోద్రెజ్ అప్లయెన్సెస్ క్యాసెట్, టవర్ ఏసీల ధరలను రూ. 8,550 నుంచి రూ. 12,450 వరకు తగ్గించింది.

డిష్‌వాషర్ విభాగంలో: బీఎస్‌హెచ్ హోమ్ అప్లయెన్సెస్ తన ఎంట్రీ లెవెల్ డిష్‌వాషర్ ధరను రూ.49,000 నుంచి రూ.45,000కి తగ్గించగా, ప్రీమియం మోడల్ ధరను రూ. 1,04,500 నుంచి రూ. 96,500కి తగ్గించింది. వోల్టాస్- బెకో తన ఎంట్రీ లెవెల్ మోడల్ ధరను రూ.25,900 నుంచి రూ. 23,390కి కుదించింది.

స్పోర్ట్స్

ఫైనల్‌కు సాత్విక్ జోడీ



చైనా మాస్టర్స్

షెన్‌జన్ (చైనా): చైనా మాస్టర్స్‌లో భారత స్టార్ డబుల్స్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-17, 21-14తో మలేసియా జోడీ ఆరోన్ చియా-సో వు ఇక్‌పై గెలిచింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో కొరియాకు చెందిన ప్రపంచ చాంపియన్, టాప్ సీడ్ కిమ్ వోన్/సియో సెంగ్‌తో సాత్విక్ జంట తలపడనుంది.

బంగ్లా 'సూపర్' బోణీ

శ్రీలంకపై విజయం

దుబాయ్: ఆసియాకప్ సూపర్-4 తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఉత్కంఠ విజయాన్నందుకుంది. ఓపెనర్ సైఫ్ హసన్ (61), తౌహిద్ హ్రిదయ్ (58) కీలక అర్ధసెంచరీలతో రాణించారు. అయితే చివరి ఓవర్‌లో రెండు వికెట్లు కోల్పోయి తడబడినా.. ఐదో బంతికి సింగిల్ తీసి ఊపిరిపీల్చుకుంది. ఫలితంగా శనివారం శ్రీలంకతో జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లా 4 వికెట్లతో నెగ్గింది. ముందుగా శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 168 పరుగులు సాధించింది. షనక (64 నాటౌట్), కుశాల్ మెండిస్ (34) రాణించారు. లంక ఓపెనర్లు కుశాల్, నిస్సాంక (22) తొలి వికెట్‌కు 44 పరుగులు జోడించారు. ఆ తర్వాత బ్యాటర్లు విఫలమవగా.. చివర్లో షనక ఎదురుదాడితో స్కోరు 160 దాటింది. షనక, కెప్టెన్ అసలంక (21) ఐదో వికెట్‌కు 57 రన్స్ జోడించారు. ముస్తాఫిజుర్ 3, మెహదీ హసన్2 వికెట్లు తీశారు. ఛేదనలో బంగ్లా 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 169 పరుగులు చేసి గెలిచింది. సైఫ్ హసన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఒత్తిడిని అధిగమించి: బంగ్లా ఛేదనలో తొలి ఓవర్‌లోనే ఓపెనర్ తన్‌జీద్ డకౌటైనా.. మరో ఓపెనర్ సైఫ్ భారీ సిక్సర్లతో బౌలర్లను సులువుగా ఎదుర్కొన్నాడు. కెప్టెన్ లిట్టన్ దాస్ (23) జతగా రెండో వికెట్‌కు 59, మూడో వికెట్‌కు హ్రిదయ్‌తో కలిసి 54 రన్స్ జోడించి విజయానికి బాటలు వేశాడు. 14వ ఓవర్‌లో సైఫ్ వెనుదిరిగాక హ్రిదయ్ బాధ్యతను తీసుకున్నాడు. అయితే విజయానికి 10 రన్స్ దూరంలో అతను అవుటయ్యాక మ్యాచ్‌లో హైడ్రామా నెలకొంది. ఆఖరి ఓవర్‌లో 5 రన్స్ అవసరమవగా, జకెర్ (9) తొలి బంతికే ఫోర్ బాదాడు. తర్వాత 3 బంతుల్లో పరుగులేమీ రాకుండా 2 వికెట్లు కోల్పోవడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. కానీ ఐదో బంతికి సింగిల్ రావడంతో బంగ్లా సంబరాల్లో మునిగింది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 168/7 (షనక 64 నాటౌట్, మెండిస్ 34; ముస్తాఫిజుర్ 3/20, మెహదీ హసన్ 2/25).

బంగ్లాదేశ్: 19.5 ఓవర్లలో 169/6. (సైఫ్ హసన్ 61, హ్రిదయ్ 58; హసరంగ 2/22).

భారత్‌ను ఆపతరమా?

నేడు పాకిస్థాన్‌తో పోరు

- బరిలోకి బుమ్రా
- ఒత్తిడిలో దాయాది
- ఆసియా కప్ సూపర్-4



సూర్యకుమార్

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

దుబాయ్: ఊహించినట్టుగానే మరోసారి ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్థాన్ తలపడబోతున్నాయి. షేక్ హ్యాండ్ వివాదం ఇంకా సద్దుమణుగక ముందే ఇరు జట్ల మధ్య ఆదివారం సూపర్-4 మ్యాచ్ జరుగనుంది. దీంతో మైదానంలో ఈసారి ఎలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటాయో అనే ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. కానీ గ్రూప్ మ్యాచ్ తరహాలోనే కచ్చితంగా భారత ఆటగాళ్ల ప్రత్యర్థికి కరచాలనం ఇవ్వకపోవచ్చు. ఇక.. టోర్నీలో అజేయంగా ఉన్న భారత్ ఎప్పటిలాగే ఆధిపత్యం చూపాలనుకుంటోంది. అయితే ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో మన బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేదు. బుమ్రా, వరుణ్‌ల విశ్రాంతి కారణంగా జట్టులోకి వచ్చి పేసర్లు అర్ష్‌దీప్, హర్షిత్‌లను ఒమన్ బ్యాటర్లు సులువుగా ఎదుర్కొన్నారు. దీంతో పాక్‌తో ఆదివారం నాటి మ్యాచ్‌కు స్టార్ పేసర్ బుమ్రాతో పాటు స్పిన్నర్ వరుణ్‌ను రంగంలోకి దించనున్నారు. దుబాయ్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలం కావడంతో కుల్దీప్, వరుణ్, అక్షర్ కీలకం కానున్నారు. అయితే ఒమన్‌తో మ్యాచ్‌లో గాయపడిన అక్షర్ ఫిట్‌నెస్‌పై స్పష్టత లేదు. అతను ఆడలేని పక్షంలో సుందర్‌కు చాన్స్ దక్కవచ్చు. బ్యాటింగ్‌లో ఓపెనర్ గిల్, హార్దిక్, దూబే పుంజుకోవాల్సి ఉంది. శాంసన్ హాఫ్ సెంచరీతో ఫామ్ చాటుకున్నా అతడి ఆటలో దూకుడు కనిపించలేదు. వన్‌డౌన్‌లో కెప్టెన్ సూర్య తిరిగి ఆడనున్నాడు.

తుది జట్లు (అంచనా):

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, శాంసన్, దూబే, హార్దిక్, అక్షర్/సుందర్, వరుణ్, కుల్దీప్, బుమ్రా.

పాక్: ఫర్హాన్, సయీమ్, హారిస్, ఫఖర్ జమాన్, సల్మాన్ ఆఘా (కెప్టెన్), హసన్ నవాజ్, మహ్మద్ నవాజ్, ఖుష్దిల్ షా, షహీన్ అఫ్రీది, హారిస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్.

గెలుపే ధ్యేయంగా..



సల్మాన్ ఆఘా

అనిశ్చితి ఆటతీరుకు మారుపేరుగా నిలిచే పాకిస్థాన్ జట్టు తీవ్ర ఒత్తిడి మధ్య బరిలోకి దిగనుంది. భారత్‌తో చివరి మ్యాచ్‌లో ఘోర పరాభవంతో పాటు కరచాలనం రూపంలో ఎదురైన అవమానం కూడా వారిలో కసిని రేపే అవకాశం ఉంది. అందుకే ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదల సల్మాన్ ఆఘా సారథ్యంలోని పాక్ జట్టులో కనిపిస్తోంది. అటు అంచనా పెట్టుకున్న బ్యాటర్లు భారత స్పిన్‌ను ఎదుర్కోవడంలో విఫలమవుతున్నారు. ఓపెనర్ సయీమ్ అయూబ్ హ్యాట్రిక్ డకౌట్లతో కొనసాగుతుండగా, అతను బౌలర్‌గా ఆరు వికెట్లు తీయడం సానుకూలాంశం. పేసర్ హారీస్ రౌఫ్‌ను బరిలోకి దించవచ్చు. బ్యాటింగ్‌లో చెలరేగుతున్న పేసర్ హషీన్ అఫ్రీది పవర్‌ప్లేలో ప్రభావం చూపితే భారత్‌కు ఇబ్బంది తప్పదు.

తలుపులు మూసేసి.. ఫోన్లు ఆఫ్ చేసి..

పాకిస్థాన్‌తో మ్యాచ్ కోసం తమ జట్టు ఎలాంటి ఒత్తిడి లేకుండా బరిలోకి దిగుతుందని కెప్టెన్ సూర్యకుమార్ స్పష్టం చేశాడు. దాయాదితో రెండోసారి తలపడేందుకు ఎలా సిద్ధమవుతున్నారన్న ప్రశ్నకు సమాధానంగా.. 'తలుపులను మూసివేసి.. మొబైల్స్‌ను ఆఫ్ చేసి ప్రశాంతంగా నిద్రపోవాలని మా ఆటగాళ్లకు చెబుతాను. బయటి నుంచి మంచి సలహాలను స్వీకరిస్తే సరిపోతుంది' అని తెలిపాడు. అయితే ప్రెస్‌మీట్‌లో సూర్యకుమార్ ఒక్కసారి కూడా పాక్ పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. స్టేడియం నిండిన సందర్భంలో ప్రేక్షకులకు వినోదం అందించేందుకు అదే సరైన సమయంగా భావిస్తానని సూర్య చెప్పాడు. మరోవైపు పాక్‌తో తొలి మ్యాచ్‌లో వివాదానికి గురైన రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌నే ఈసారి కూడా నియమించే అవకాశం ఉంది.

పాక్ జట్టుకు 'మోటివేషన్'


దుబాయ్: భారత్‌తో మ్యాచ్ అంటేనే పాకిస్థాన్ జట్టు ఒత్తిడిలో కూరుకుపోతోందట. పైగా ప్రస్తుత జట్టులో యువ క్రికెటర్లు ఎక్కువ మంది ఉన్నారు. వారంతా టీమిండియాతో పోరులో ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారని, మానసికంగా డీలా పడుతున్నారని భావిస్తున్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు.. డా.రహీల్ అహ్మద్ అనే మోటివేషనల్ స్పీకర్ సేవలను తీసుకుంటోంది. ఆసియా కప్‌లో పాక్ గ్రూపు మ్యాచ్‌లు ముగిశాక అతడు జట్టుతో చేరినట్టు సమాచారం. ఇప్పటికే జట్టుకు ఓ దఫా కౌన్సెలింగ్ కూడా ఇచ్చాడట.

మనమ్మాయిలు పోరాడినా..


ఆస్ట్రేలియాదే సిరీస్

మూడో వన్డేలో భారత్ ఓటమి

కొద్దిలో చేజారిన 413 పరుగుల ఛేదన



స్మృతీ మంధాన (125)


మూనీ (138)

శతక్కొట్టిన బేత్ మూనీ | మంధాన సూపర్ సెంచరీ దీప్తి మెరుపు ఇన్నింగ్స్

ముంబై: ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ చేజిక్కించుకొని చరిత్ర సృష్టించే అవకాశాన్ని భారత మహిళలు త్రుటిలో కోల్పోయారు. శనివారం జరిగిన నిర్ణాయక మూడో వన్డేలో 43 పరుగులతో హర్మన్ సేన ఓటమి చవిచూసింది. 413 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో స్మృతీ మంధాన (63 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్లతో 125) సూపర్ సెంచరీ, దీప్తీ శర్మ (58 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 72) మెరుపు బ్యాటింగ్‌కు తోడు హర్మన్‌ప్రీత్ (52) అర్ధ శతకంతో మన జట్టు లక్ష్యాన్ని చేరేలా కనిపించింది. కానీ వారి నిష్క్రమణ తర్వాత భారత పోరాటం 47 ఓవర్లలో 369 రన్స్ వద్దే ముగిసింది. అంతకుముందు ఆసీస్ 47.5 ఓవర్లలో 412 రన్స్‌కు ఆలౌటైంది. బేత్ మూనీ (75 బంతుల్లో 23 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 138) శతక్కొట్టగా, జార్జియా (81), పెర్రీ (68) అర్ధ శతకాలు చేశారు. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను ఆసీస్ 2-1తో దక్కించుకుంది. భారత్‌పై ఆసీస్‌కిది 11వ ద్వైపాక్షిక సిరీస్ విజయం. మూనీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, స్మృతి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు.

కోహ్లీ రికార్డ్ బ్రేక్

50 బంతుల్లో సెంచరీ చేసిన స్మృతీ మంధాన.. వెటరన్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (52 బంతుల్లో 100)ని అధిగమించి వన్డేలలో వేగవంతమైన శతకం చేసిన భారత బ్యాటర్‌గా కొత్త రికార్డు నెలకొల్పింది. అలాగే మహిళల వన్డేలలో వేగవంతమైన సెంచరీ (50 బంతుల్లో 100) చేసిన రెండో బ్యాటర్‌గానూ స్మృతి నిలిచింది. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్‌లానింగ్ (45 బంతుల్లో) టాప్‌లో ఉంది.

సంక్షిప్తస్కోర్లు

ఆస్ట్రేలియా: 47.5 ఓవర్లలో 412 ఆలౌట్ (బేత్ మూనీ 138, జార్జియా వోల్ 81, ఎలీస్ పెర్రీ 68, గార్డ్‌నర్ 39, అరుంధతి 3/86, దీప్తీశర్మ 2/78, రేణుకా సింగ్ 2/79).

భారత్: 47 ఓవర్లలో 369 ఆలౌట్ (మంధాన 125, దీప్తి 72 హర్మన్ 52, స్నేహ్‌రాణా 35, కిమ్ గార్త్ 3/69, మేఘన్ 2/53).

అందుకే పింక్ జెర్సీ..

చివరి వన్డేలో భారత మహిళలు పింక్ జెర్సీతో బరిలో దిగారు. రొమ్ము కేన్సర్‌పై మహిళల్లో అవగాహన కల్పించేందుకే ఈ జెర్సీ ధరించినట్టు బీసీసీఐ తెలిపింది. 'మహిళలు రొమ్ము కేన్సర్‌ను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఈ జెర్సీ సూచిస్తుంది. నెలవారీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొందాం' అని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పిలుపునిచ్చింది.

హాల్.. అదుర్స్

హెప్టాథ్లాన్‌లో స్వర్ణం కైవసం



ప్రపంచ అథ్లెటిక్స్

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల హెప్టాథ్లాన్ స్వర్ణాన్ని అమెరికాకు చెందిన అన్నా హాల్ సొంతం చేసుకుంది. ఏడు పోటీల ఈ ఈవెంట్‌లో మొత్తం 6,888 పాయింట్లు సాధించిన ఆమె కెరీర్‌లో తొలిసారి ప్రపంచ టైటిల్ అందుకుంది. తద్వారా దిగ్గజ హెప్టాథ్లెట్ జాకీ జాయ్‌నర్ కెర్సీ తర్వాత వరల్డ్ టైటిల్ కైవసం చేసుకున్న అమెరికా అథ్లెట్‌గా 24 ఏళ్ల అన్నా రికార్డు నెలకొల్పింది. కేట్ ఓ కానర్ (ఐర్లాండ్), తాలియా బ్రూక్స్ (అమెరికా) రజత, కాంస్య పతకాలు నెగ్గారు.

అన్నూరాణి, గుల్వీర్ విఫలం: భారత అథ్లెట్లు గుల్వీర్ సింగ్, అన్నూరాణి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విఫలమయ్యారు. పురుషుల 5వేల మీటర్ల పరుగులో గుల్వీర్, మహిళల జావెలిన్ త్రోలో అన్నూరాణి ఫైనల్‌కు చేరలేకపోయారు. హీట్-2లో తలపడిన గుల్వీర్ 13ని.42.34సె.లో గమ్యం చేరి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. రెండు హీట్లలో తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఐదోసారి వరల్డ్ అథ్లెటిక్స్ బరిలో దిగిన 33 ఏళ్ల అన్నూరాణి గ్రూప్ 'ఎ' క్వాలిఫికేషన్‌లో 55.18 మీ. దూరం ఈటెను విసిరి 15వ స్థానం సాధించింది. ఓవరాల్‌గా 29వ స్థానం దక్కించుకుంది.

ఉత్కంఠ పోరులో పట్నా విజయం

జైపూర్: చివరి నిమిషం వరకు హోరాహోరీగా సాగిన పోరులో పట్నా పైరేట్స్ విజయం సాధించింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో శనివారం జరిగిన మ్యాచ్‌లో పట్నా 33-30తో దబాంగ్ ఢిల్లీపై గెలిచింది. అంకిత్ కుమార్ సూపర్-10 సాధించాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 38-36తో తమిళ్ తలైవాస్‌పై నెగ్గింది. కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 13 పాయింట్లతో పోరాడినా తలైవాస్‌ను గెలిపించలేక పోయాడు.

కృష్ణా జలాల్లో ఆంధ్ర హక్కులను కాపాడండి

» బోర్డు చైర్మన్‌ను కోరిన సాగునీటి వినియోగదారుల సంఘం

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ రైతుల నీటి హక్కులను కాపాడాలని రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య విజ్ఞప్తి చేసింది. శనివారం పులిచింతల ప్రాజెక్టును కేఆర్ఎంబీ చైర్మన్ బీజీ పాండే సందర్శించారు. ఆ సందర్భంగా పాండేను సమాఖ్య చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు ఆధ్వర్యంలో సభ్యులు కలిశారు. చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ ఆ వివరాలను పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కేటాయించింది. అయితే తమకు 904 టీఎంసీల కృష్ణా జలాలను ఇవ్వాలంటూ తెలంగాణ కోరడం దుర్మార్గం. కేటాయింపుల్లో మార్పులు చోటు చేసుకుంటే మొత్తం 30 లక్షల ఎకరాలు సాగునీరు అందక ఎడారిగా మారతాయి. కృష్ణా జలాల్లో ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం వాటాలను యథాతథంగా కొనసాగించాలి. నీటి విడుదల గడువును వచ్చేనెల 20 దాకా పెంచాలి' అని కేఆర్ఎంబీ చైర్మన్‌ను కోరామని గోపాలకృష్ణ తెలిపారు.

రైతులకు ఆసరాగా ఏపీ ఎయిమ్స్ 2.0

» సలహా, సూచనలతో అన్నదాతల ఫోన్లకు సంక్షిప్త సందేశాలు



ఎస్ఎంఎస్ సేవలను ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు

సావధానంగా రైతుల ఫోన్లకు సూచనలు, సలహాలు పంపించే వ్యవస్థను వ్యవసాయ శాఖ రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచార యాజమాన్య వ్యవస్థ.. ఏపీ ఎయిమ్స్-2.0 అని దీనికి పేరు పెట్టింది. దీనిద్వారా ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సంక్షిప్త సందేశాలను 'బల్క్ ఎస్ఎంఎస్ పుష్' ప్రక్రియద్వారా పంపుతారు. శనివారం ఆ శాఖ డైరెక్టర్ డిల్లీరావు ఈ ప్రక్రియను ప్రారంభించారు. వాసర్ లాబ్స్ అభివృద్ధి చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా రియల్ టైమ్‌లో రైతులకు ఎస్ఎంఎస్‌లు రానున్నాయి. ఆండ్రాయిడ్, యాపిల్ ఫోన్లకే ఈ ఎస్ఎంఎస్‌లు పరిమితం కాకుండా, సాధారణ ఫోన్లకు కూడా వస్తాయని అధికారులు తెలిపారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

» అక్టోబరు 12న స్క్రీనింగ్ టెస్ట్.. అంబేడ్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెల్లడి

పోటీ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ నిరుద్యోగ యువతకు అంబేడ్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ తదితర పోటీ పరీక్షల కోసం తిరుపతి, విశాఖపట్నం కేంద్రాలుగా నిర్వహించే ఉచిత శిక్షణ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని, ఈనెల 24 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం https://apstdc.apcfss.in వెబ్‌సైట్ లేదా 9949686306 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-1 మెయిన్స్ మళ్లీ నిర్వహించాలి: సీపీఐ

ఏపీ హైకోర్టు రద్దు చేసిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను తిరిగి నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'జగన్ ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పత్రాల డిజిటల్ మూల్యాంకనంలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ పలువురు అభ్యర్థులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ పరీక్షను రద్దు చేస్తూ మెయిన్స్‌ను తిరిగి నిర్వహించాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది. అయితే, కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది' అని ఆయన విమర్శించారు.

ఒకరికొకరు తోడుగా.. 'వెట్టి'

ఇదీ గిరిజనుల ఆచారం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

వెట్టి.. అంటే సహజంగా మనకు గుర్తొచ్చేది వెట్టి చాకిరీనే. అయితే ఆదివాసీల సంప్రదాయంలో మాత్రం దీనికి పరస్పర సహకారం అని అర్థం. ఏదైనా ఒక కుటుంబానికి చెందిన వ్యవసాయం, ఇంటి నిర్మాణం వంటి పనుల్లో ఊరంతా కలసికట్టుగా పని చేయడాన్నే వెట్టిగా ఆదివాసీలు పిలుచుకుంటారు. ఈ పనులకు నగదు చెల్లింపులకు బదులు విందు లేదా మాంసం పంపిణీ మాత్రమే ఉంటాయి. ఆర్థిక వనరులు అంతగా లేని ఆదివాసీ కుటుంబాలు తమ వ్యవసాయ పనులు లేదా గృహ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయడానికి 'వెట్టి'ని ఆశ్రయిస్తుంటారు. దీనికోసం గ్రామ పెద్దను సంప్రదించి తన పనిని గ్రామస్థులతో పూర్తి చేయిస్తే, తాను పెంచుకుంటున్న మేకనో, కోడినో కోసి వాటాలు పంచుతామని, విందు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పుకుంటుంటారు. గ్రామపెద్ద ఆ విషయాన్ని గ్రామస్థులకు తెలియజేసి ముందుగా నిర్ణయించిన రోజున తమ సొంత పనులు మానుకొని ఆ కుటుంబం కోరిన పనిని పూర్తి చేస్తారు. ఒకవైపు పని సాగుతుండగా మరోవైపు కొందరు వ్యక్తులు వేటను కోసి వాటాలు సిద్ధం చేస్తారు. వాటిని తాటాకు దొప్పల్లో మూటకట్టి వెట్టిలో పాల్గొన్నవారిలో కుటుంబానికో దొప్ప చొప్పున అందిస్తారు. కొంత మాంసాన్ని వండి, విప్పసారా, తాటికల్లు తదితర సంప్రదాయ మత్తు పానీయాలతో చిన్నపాటి విందు కూడా ఆ యజమాని ఏర్పాటు చేస్తాడు. ఆకు దొప్పల్లో ఉంచిన అన్నం, వేట మాంసాన్ని వెట్టి పనుల్లో పాల్గొన్న వారంతా పంచుకుంటుంటారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలోని విలీన మండలాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.



ఊరంతా కలసి వెట్టి పద్ధతిలో ఒక కుటుంబానికి చెందిన పొలంలో వరినాట్లు వేస్తున్న ఆదివాసీలు



వెట్టిలో పాల్గొన్న వారికి విందు ఏర్పాట్లు

సొమ్ములిస్తేనే సర్వే!

» పాస్ పుస్తకాలకూ పైసలు పిండుతున్నారు

» డబ్బులు ముట్టజెబితేనే 'ఎఫ్ లైన్' సెటిల్మెంట్

» సర్వేయర్ల చేతివాటంపై ఫిర్యాదుల వెల్లువ

» రెవెన్యూ ఫిర్యాదుల్లో 34 శాతం భూ సర్వేపైనే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ శాఖలో పలువురు సర్వేయర్ల అవినీతి తారస్థాయికి చేరింది. కొలతల కోసం వచ్చే రైతుల ముక్కుపిండి మరీ వసూళ్లు చేస్తున్నారు. వీరు క్షేత్రస్థాయిలో అడుగు పెట్టాలంటే అన్నదాతలకు చేతి చమురు వదలాల్సిందే. లేకపోతే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో 60 శాతం రెవెన్యూ శాఖపైనే ఉన్నాయి. ఇందులో 34.8 శాతం భూముల సర్వే సంబంధిత ఫిర్యాదులు కాగా, మరో 24.7 శాతం రైతులకు ఉచితంగా ఇవ్వాల్సిన పాస్‌పుస్తకాలకు సంబంధించినవేనని రెవెన్యూ అధికారుల సమక్షంలోనే ఆర్టీజీఎస్ తన ప్రజంటేషన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. రెవెన్యూ శాఖ చెబుతున్న ఫీల్‌గుడ్ విధానం క్షేత్రస్థాయిలో ఏమాత్రం లేదని, భూ సమస్యలు ఇంకా బలంగానే ఉన్నాయని, అవినీతి పెచ్చరిల్లుతోందని ఆర్టీజీఎస్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

> "రైతులు, భూ యజమానుల సమస్యలన్నీ పరిష్కరించాం. సంతృప్తి స్థాయి అద్భుతంగా ఉంది. భూముల సర్వే బాగా జరుగుతోంది."
> - కలెక్టర్ల సదస్సులో ఇచ్చిన ప్రజంటేషన్‌లో రెవెన్యూ శాఖ గొప్పలు
>
> "భూముల సర్వేకు రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, పాస్‌పుస్తకాలు ఇవ్వడంలోనూ పిండుకుంటున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి."
> - ఆర్టీజీఎస్ ప్రజంటేషన్‌లో చేసిన ఆరోపణలు

ఇష్టారాజ్యంగా భూముల సర్వే

గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల సర్వేపై అనేక ఆరోపణలు, విమర్శలున్నాయి. అప్పట్లో రైతులను సంప్రదించకుండానే వారి భూములను సర్వే చేసి ఇష్టానుసారం రికార్డులు రూపొందించారు. తాము అధికారంలోకి రాగానే రైతుల భూ సమస్యలు, ప్రత్యేకించి రీసర్వే ఇబ్బందులను పరిష్కరిస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2వ దశ సర్వే జరుగుతోంది. జగన్ ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకాలు రద్దు చేసి వాటిస్థానంలో ఏపీ రాజముద్ర ఉన్న కొత్త పాస్‌పుస్తకాలను జారీ చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ ఇప్పటికీ పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. కొన్ని జిల్లాల్లో మొదలైనా రెవెన్యూ సిబ్బంది డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు.

లక్షల్లో ఎఫ్ లైన్ పిటిషన్లు

రీసర్వే లేని సమయంలో, భూముల సర్వే కొనసాగుతున్న దశలో కూడా ఎఫ్ లైన్ పిటిషన్లు లక్షల సంఖ్యలో అందుతున్నాయి. రీసర్వే పూర్తయిన 6వేల గ్రామాల నుంచి కూడా ఈ దరఖాస్తులు వస్తున్నాయి. వాటిని గ్రామ, మండల సర్వేయర్లు సెటిల్ చేయాలి. రైతుల కోరిక మేరకు భూముల హద్దులు, కొలతలు నిర్ధారించాలి. సబ్‌డివిజన్ వర్క్ చేపట్టాలి. ఇందుకోసం కూడా సర్వేయర్లు డబ్బు డిమాండ్ చేస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. వాటి ఆధారంగా ఆర్టీజీఎస్ ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంది. సర్వే పనులకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని 34.8 శాతం మంది ఆరోపించారు. వాస్తవానికి ఎఫ్ లైన్ పిటిషన్ సమర్పించే సమయంలోనే రైతులు మీసేవ కేంద్రంలో డబ్బులు చెల్లిస్తారు. పిటిషన్‌ను నమోదు చేసిన తర్వాత నిర్దిష్ట కాల వ్యవధిలో సర్వేయర్ వెళ్లి రైతు సమక్షంలో భూమి కొలతలు వేసి, హద్దులు చూపాలి. ఇందుకు సర్వేయర్‌కు రూపాయి ముట్టజెప్పాల్సిన పనిలేదు. కానీ అదనంగా డబ్బులిస్తే తప్ప ఎఫ్ లైన్ పిటిషన్లు సెటిల్ చేయట్లేదని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నామమాత్రం

రెవెన్యూ, సర్వే విభాగాల్లో క్షేత్రస్థాయి అధికారులపై పర్యవేక్షణ, నియంత్రణ కొరవడిందన్న విమర్శలున్నాయి. తహసీల్దార్ ఆఫీసుల పనితీరుపై జిల్లాస్థాయిలో సమీక్షలు ఉండటం లేదు. ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడు ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడమే తప్ప ఇటు కలెక్టర్, అటు ఆర్డీవోలు పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. దీంతో సిబ్బంది పనితీరుపై ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులకు తెలియడం లేదు. ఇక సర్వే విభాగం పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారుతోందన్న ఫిర్యాదులున్నాయి. జిల్లాస్థాయిలో అసిస్టెంట్ డైరెక్టర్ అధికారి ఉన్నా పర్యవేక్షణ నామమాత్రంగానే ఉంటోంది. గ్రామ, మండల సర్వేయర్లపై శాఖాపరంగా పర్యవేక్షణ ఉండటం లేదు. ఈ పనిచేయాల్సిన రీజినల్ డిప్యూటీ డైరెక్టర్(ఆర్డీడీ) వ్యవస్థ నీరుగారిపోయింది. రీసర్వే జరిగే సమయంలో వీరు జిల్లాల్లోనే పనిచేయాలి. కానీ గత జగన్ ప్రభుత్వంలోనే ఆర్డీడీలను జిల్లాల నుంచి పిలిపించి రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోనే పనిచేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో వారికి జిల్లాలపై ప్రత్యక్ష పర్యవేక్షణ, పట్టు ఉండకపోగా సర్వేయర్ల పనితీరుపై పరిశీలన కొరవడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల అమలులో అవినీతి చీడ తొలగడం లేదన్న ఆందోళనా సర్వత్రా వ్యక్తమవుతోంది.

తెలుగు రాష్ట్రాల నుంచే 35 వేల మంది

» స్టూడెంట్ వీసాదారులపైనా తీవ్ర ప్రభావం



భువనేష్, అమెరికా తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

హైదరాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హెచ్1-బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో భారతీయుల డాలర్ డ్రీమ్స్ చెదిరిపోనున్నాయి. తెలుగు రాష్ట్రాల యువతపైనే అధిక ప్రభావం ఉండనుంది. అగ్రరాజ్యం ఏటా మొత్తం 85 వేల హెచ్1-బీ వీసాలు జారీ చేస్తుండగా.. ఇందులో దాదాపు 73శాతం(62 వేలు) భారతీయులే దక్కించుకుంటున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే వారి సంఖ్య దాదాపు 35వేలు. మిగతా 27 శాతంలో 12 శాతం చైనా, ఇతర దేశాల పౌరులు ఉంటున్నారు. ట్రంప్ నిర్ణయంతో ఈ వీసాలపై అమెరికాకు వెళ్లే ఆశలు వదులుకోవాల్సిందేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు అమెరికాలోని కంపెనీలు విదేశీ నిపుణులకు హెచ్1-బీ వీసాలతో కొలువులు ఇస్తున్నాయి. ముందుగా మూడేళ్ల కాలానికి జారీ చేసి.. ఆ తర్వాత కొనసాగిస్తున్నాయి. స్థానికులతో పోలిస్తే తక్కువ జీతాలే వస్తున్నా.. కొలువుల కోసం విదేశీయులు భారీగా వెళ్లేవారు. అమెరికాలోని ఐటీ, వైద్య రంగాల్లో విదేశీ నిపుణుల్లో 73 శాతం భారతీయులే. గత ఐదేళ్లలో దాదాపు 4 లక్షల మంది భారతీయులు హెచ్1-బీపై అమెరికాలో ఉద్యోగాలు పొందారు. ఇప్పటివరకు కొత్తగా వచ్చిన హెచ్1-బీ వీసాదారులకు అమెరికాలోని కంపెనీలు ఏడాదికి సరాసరి లక్ష డాలర్ల జీతం ఇస్తున్నాయి. తాజా నిబంధనలతో ఏడాదికి కనీసం 1.50 లక్షల డాలర్ల వేతనం చెల్లించాలని ట్రంప్ ఆదేశాలిచ్చారు. లక్ష డాలర్లు వీసా ఫీజు పోతే, మిగతా 50వేల డాలర్ల కోసం వెళ్లేందుకు విదేశీ నిపుణులు ఆసక్తి చూపించరు. దీంతో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని పేర్కొంటున్నారు. సుంకాలపై భారత్-అమెరికా మధ్య విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్న నేపథ్యంలో భారతీయ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకునే ట్రంప్ పొమ్మనలేక పొగబెట్టారని అక్కడి తెలుగు సంఘాలు పేర్కొంటున్నాయి.

ఉన్నత చదువులపైనా ప్రభావం

ట్రంప్ తాజా నిర్ణయంతో హెచ్1-బీ వీసాదారులపైనే కాదు.. ఉన్నత విద్య కోసం వెళ్లే వారిపైనా తీవ్ర ప్రభావం పడనుంది. ప్రతి ఏటా దాదాపు లక్ష మంది విద్యార్థులు ఎంఎస్, ఎంబీఏ, మెడిసిన్ కోసం స్టూడెంట్ వీసా (ఎఫ్-1)పై అమెరికా వెళుతున్నారు. గతంలో చదువుతూ ఉద్యోగం చేసుకునే వెసులుబాటు ఉండగా.. ట్రంప్ సర్కారు ఇప్పటికే అలా ఉద్యోగం చేయడంపై నిషేధం విధించింది. దీంతో ఎలాగోలా వెళ్తే చాలు.. ఏదో ఒక పనిచేసుకుంటూ చదువుకోవచ్చన్న మధ్యతరగతి విద్యార్థుల ధీమా ఇప్పటికే సడలిపోయింది. తాజా ఆదేశాలతో స్టూడెంట్ వీసాపై వెళ్లే వారికి అక్కడ భవిష్యత్తు ఉంటుందన్న ఆశ లేకుండా పోయిందని నిపుణులు పేర్కొంటున్నారు. ఎఫ్-1 వీసా తర్వాత కోర్సులను బట్టి విద్యార్థులకు 12-36 నెలల వరకు ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) గడువు ఉంటుంది. అప్పటిలోగా హెచ్1-బీ వీసా సాధిస్తే అక్కడ ఉద్యోగం చేసుకోవచ్చు. తాజా నిబంధనలతో ఓపీటీ గడువులో ఉన్నవారు పూర్తయిన వెంటనే స్వదేశానికి రావాల్సిందే. హెచ్1-బీ వీసా లక్ష్యంతోనే అనేక మంది ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లేవారు. ఇప్పుడా ఆశలు ఆవిరయ్యాయని అమెరికా తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు భువనేష్ 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు. ట్రంప్ ఆదేశాలపై స్థానికంగా యువతలో హర్షం వ్యక్తమవుతోందని, హెచ్1-బీ లక్ష్యంగా పెట్టుకున్న భారతీయులు ఇక అమెరికా వచ్చే అవకాశాలు లేవని ఆయన అభిప్రాయపడ్డారు.

దర్జీలు కావలెను



కుట్టు, కటింగ్ పనుల్లో కార్మికులు

» రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమకు నిపుణుల కొరత

» నైపుణ్య కార్మికుల్లేక పాత పద్ధతిలో పనులు

» 'కొవిడ్'లో కార్మికులు, యజమానులు పరిశ్రమకు దూరం

(రాయదుర్గం-ఆంధ్రజ్యోతి)

మార్కెట్ ఫుల్‌గా ఉంది.. కానీ నిపుణులైన దర్జీల కొరత రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమను వేధిస్తోంది. జీన్స్ ప్యాంట్ల తయారీలో దక్షిణ భారతదేశంలోనే పేరెన్నికగన్న అనంతపురం జిల్లా రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమలో గతంలో వేలాది మంది కార్మికులు పనిచేసేవారు. అయితే కరోనా సమయంలో వారు ఉపాధి కోల్పోవడంతో సుమారు 40 శాతం మందికిపైగా ఇతర రంగాలకు మారిపోయారు. ఆ ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. కొవిడ్ సంక్షోభాన్ని దాటుకుని ఇప్పుడు ఆ పరిశ్రమ మళ్లీ వేగం పుంజుకుంటోంది. కానీ తగినంత మంది నిపుణులైన కార్మికులు దొరక్క మార్కెట్‌ను అందిపుచ్చుకోలేకపోతోంది. మిగిలి ఉన్న కుట్టుకార్మికులు మూస పద్ధతిలోనే పని చేసుకుపోతున్నారు. ఆధునిక నైపుణ్యం వారి వద్ద లేకపోవడంతో పనిలో వేగం పెరగడంలేదు. ఇక కొత్తగా కార్మికులెవరూ ఈ రంగం పట్ల ఆసక్తి చూపడం లేదు. దీంతో యజమానులు తలలుపట్టుకునే పరిస్థితి వచ్చింది.

టెక్నాలజీని అందుకోలేక..

మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమ అందుకోలేకపోతోంది. ఏళ్ల తరబడిగా సింగిల్ నీడిల్ జూకీ మిషన్లపై ఆధారపడుతోంది. మార్కెట్‌లో ఆటోమెటిక్ త్రెడ్ కటింగ్ మెషీన్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ వాటిని వినియోగించే కార్మికులు ఇక్కడ లేరు. ఇక్కడి జీన్స్‌ను ఏపీలోని వివిధ ప్రాంతాలకు, కర్ణాటక, తమిళనాడుకు ఎగుమతి చేస్తున్నప్పటికీ, ఉత్పత్తిలో వేగాన్ని అందుకోలేకపోవడానికి మూసపద్ధతి, పాత నైపుణ్యాలే కారణం. జీన్స్ కుట్టుకు ఆధునిక మెషీన్లను వినియోగిస్తే నాణ్యత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి మిషన్ ఒక్కొక్కటి రూ. 40 వేల వరకూ విలువ చేస్తుంది. కానీ రాయదుర్గంలో రూ. 20 వేల విలువ చేసే జూకీ మిషన్లను వాడే కార్మికులే అందుబాటులో ఉన్నారు. వీరికి తగిన నైపుణ్యాన్ని అందించేలా శిక్షణ కేంద్రాలు లేవు. దీంతో గార్మెంట్ యజమానులు పాత తరహా మిషన్లపై ఆధారపడక తప్పడం లేదు. కొత్తతరహా మెషీన్లతో విద్యుత్ ఆదా అవుతుంది.



రోజుకు 40 లక్షలకుపైగా బిజినెస్

రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమలో వేలాది కుటుంబాలు ఉన్నాయి. వీరి ద్వారా రోజుకు రూ. 40 లక్షలకు పైగా విలువైన ప్యాంట్లు తయారవుతాయి. ఒక్కో కార్మికుడు రోజుకు 10 నుంచి 15 ప్యాంట్లను తయారు చేస్తారు. ఇటీవల కార్మికుల డిమాండ్ పెరగడంతో ఆ రంగంలో స్థిరపడిన వారికి ప్రాధాన్యం పెరిగి, కూలీ కూడా పెరిగింది. గతంలో ఒక్కో ప్యాంట్ కుట్టుకు కూలీ రూ. 40 దాకా ఇచ్చేవారు. ఇప్పుడు రూ.60 చెల్లిస్తున్నారు. గార్మెంట్స్‌కు డిమాండ్ పెరిగింది. కానీ కార్మికుల కొరత మాత్రం వెంటాడుతోంది.


డిమాండ్ పెరిగినా...

రాయదుర్గం జీన్స్‌కు జాతీయస్థాయి డిమాండ్ ఉంది. కొవిడ్‌కు ముందు ఇక్కడి గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి 20 వేలమందికిపైగా కార్మికులు జీవించేవారు. ఓ పక్క కొవిడ్, మరోపక్క వస్త్రం ధర విపరీతంగా పెరగడంతో పరిశ్రమకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కుట్టు కార్మికులకు తగినంత ఉపాధి లభించలేదు. కొందరు కూలీలుగా మారారు. మరికొందరు వలసవెళ్లిపోయారు. కొవిడ్ సమయంలో కొందరు యజమానులు కూడా గార్మెంట్ రంగాన్ని వదిలి వెళ్లారు. సుమారు 500 యూనిట్లు గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం బంగ్లాదేశ్ నుంచి గార్మెంట్స్ దిగుమతి పూర్తిగా ఆగిపోయింది. ప్రాంతీయంగా ఉండే గార్మెంట్స్ రంగానికి డిమాండ్ పెరిగింది. అందులో భాగంగానే రాయదుర్గం జీన్స్‌కు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. మార్కెట్‌కు ఇప్పుడు మంచిరోజులు వచ్చాయని, అధునాతన మెషీన్లు కొనుగోలుకు తాము సిద్ధంగానే ఉన్నా కూడా నైపుణ్యం ఉన్న కార్మికులు అందుబాటులో లేరని పలువురు యజమానులు అంటున్నారు. నైపుణ్యం పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతను గార్మెంట్స్ రంగం వైపు మళ్లించాలని యజమానులు కూడా కోరుతున్నారు. అలాగే పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని గార్మెంట్స్ యజమానులు కోరుతున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ప్రేక్షకులను ఉర్రూతలూగించేలా...



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2: తాండవం' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా హైదరాబాద్‌లో ఓ భారీ సెట్ నిర్మించి ఓ పాటను షూట్ చేస్తున్నారు. దాదాపు 600 మందితో అదిరిపోయేలా ఈ మాస్ పాటను చిత్రీకరిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది సినిమాకే ప్రధానాకర్షణగా నిలవనుందని, ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుందని చెప్పారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. బోయపాటి శ్రీను దర్శకుడు. బాలకృష్ణ కూతురు తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సి.రామ్‌ప్రసాద్, సంతోష్ డీ.డెటాకే. సంగీతం: థమన్. కాగా, బాలకృష్ణ, బోయపాటి కాంబోలో ఇదివరకు వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' సినిమాలు బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్న విషయం తెలిసిందే.

మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

మలయాళ అగ్ర కథనాయకుడు మోహన్‌లాల్‌కు అరుదైన గౌరవం దక్కింది. చిత్ర పరిపరిశ్రమలో ఆయన సేవలకు గుర్తింపుగా 2023 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 23న నిర్వహించనున్న 71వ జాతీయ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో మోహన్‌లాల్‌కు కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందజేస్తుంది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శనివారం అధికారికంగా ప్రకటించింది. మోహన్‌లాల్ అసలు పేరు మోహన్‌లాల్ విశ్వనాథ నాయర్. విలన్ పాత్రతో పరిచయమై హీరోగా ఎదిగిన ఆయన ఇప్పటి వరకూ 6 జాతీయ అవార్డులు గెలుచుకున్నారు. 2001లో పద్మశ్రీ, 2019లో పద్మభూషణ్ అవార్డులతో మోహన్‌లాల్‌ను భారత ప్రభుత్వం సత్కరించింది.



నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో మోహన్‌లాల్ 400కి పైగా చిత్రాల్లో నటించారు. కేవలం మలయాళంలోనే కాకుండా తమిళ్, తెలుగు, కన్నడ, హిందీ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను అలరించారు. మోహన్‌లాల్ తన 18వ ఏట చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. మొదట 1978లో 'తిరనోట్టం' అనే మలయాళ చిత్రంలో నటించారు. కానీ సెన్సార్ అభ్యంతరాలతో విడుదలలో జాప్యం జరిగింది. అయితే 1980లో వచ్చిన 'మంజిల్ విరింజ పూక్కల్' చిత్రం ద్వారా తొలిసారిగా తెరపై కనిపించారు. ఇందులో ప్రతి నాయకుడి పాత్రను పోషించారు. అప్పటి నుంచి పలు చిత్రాల్లో విలన్, ద్వితీయ శ్రేణి నటుడిగా పాత్రలు పోషిస్తూ చిత్ర పరిశ్రమలో తన స్థానాన్ని నిలుపుకునే ప్రయత్నం చేశారు. అయితే 1986లో వచ్చిన 'రాజావింటే మకన్' చిత్రం ద్వారా మోహన్‌లాల్‌కు స్టార్‌డమ్ లభించింది. అక్కడి నుంచి సినీ ప్రయాణం నిర్విఘ్నంగా కొనసాగుతూనే ఉంది.

తెలుగులో: తెలుగులో మొదటిసారిగా 1994లో వచ్చిన 'గాండీవం' అనే సినిమాలో అక్కినేని నాగేశ్వరరావుకు కుమారుడిగా అతిథి పాత్రలో కనిపించారు. ఆ తర్వాత 2016లో చంద్రశేఖర్ ఏలేటీ తెరకెక్కించిన 'మనమంతా' చిత్రంలో పూర్తిస్థాయిలో నటించారు. ఆ తర్వాత 'జనతా గ్యారేజ్', 'కన్నప్ప' చిత్రాల్లో మోహన్‌లాల్ నటించారు.

మన అతిపెద్ద శత్రువు.. ఇతర దేశాలపై ఆధారపడడమే!

» ఆత్మనిర్భరతే ఏకైక పరిష్కారం

» చిప్స్ నుంచి షిప్స్ వరకు స్వదేశీ ఉత్పత్తులకు పెద్దపీట వేయాల్సిందే: మోదీ



భావ్‌నగర్, సెప్టెంబరు 20: ఇతర దేశాలపై ఆధారపడడమే భారత్ అతిపెద్ద శత్రువు అని ప్రధాని మోదీ అన్నారు. చిప్స్(సెమీకండక్టర్) నుంచి షిప్స్ వరకు స్వదేశీ ఉత్పత్తులను అభివృద్ధి చేసుకుని ఆత్మనిర్భరతను చాటడమే దీనికి ఏకైక పరిష్కారమని తెలిపారు. శనివారం గుజరాత్‌లో పర్యటించిన ప్రధాని 'సముద్రం ద్వారా సమృద్ధి' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.34,200 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. అన్ని సమస్యలకు ఏకైక పరిష్కారం.. ఆత్మనిర్భరతేనని చెప్పారు. "140 కోట్ల మంది ప్రజల భవితను విదేశీ శక్తులకు వదిలేయం. దేశ అభివృద్ధి సంకల్పం.. విదేశాలపై ఆధారపడి ఉండదు. భవిష్యత్తు తరాలను ఇతరులపై సెట్టేయం" అని ప్రధాని తేల్చి చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాలించిన పార్టీ.. యువత సామర్థ్యాన్ని తొక్కిపెట్టిందంటూ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని విమర్శలు గుప్పించారు. 'లైసెన్స్ రాజ్'తో పరిమితులు విధించి యువతను నిర్వీర్యం చేసిందన్నారు. లైసెన్స్-కోటా కారణంగా దీర్ఘకాలిక చిక్కుముడులు ఏర్పడి, ప్రపంచ మార్కెట్‌లో ఒంటరిగా నిలిచిపోయామన్నారు. గత ప్రభుత్వాల విధానాలు.. దేశ సామర్థ్యాన్ని ఎలా దెబ్బతీశాయో చెప్పడానికి నౌకా రంగమే ప్రధాన ఉదాహరణ అని ప్రధాని మోదీ తెలిపారు. కాంగ్రెస్ హయాంలో స్వదేశీ నౌకా నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి, విదేశీ నౌకలను అద్దెప్రాతిపదికన వినియోగించుకోవడం వల్ల ఏటా రూ.6 లక్షల కోట్లను విదేశీ కంపెనీలకు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే సముద్రయాన రంగంలో వరుస సంస్కరణలు తీసుకువచ్చినట్టు ప్రధాని తెలిపారు. పెద్ద పెద్ద నౌకలకు మౌలిక సదుపాయాల హోదా కల్పించడం ద్వారా సముద్రయాన రంగాన్ని మరింత బలోపేతం చేసే చరిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నామని వివరించారు. "తద్వారా నౌకా నిర్మాణ కంపెనీలు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంది" అని ప్రధాని పేర్కొన్నారు. అంతేకాదు, వన్ నేషన్-వన్ డాక్యుమెంట్(ఒక దేశం-ఒక పత్రం), వన్ నేషన్-వన్ పోర్ట్(ఒక దేశం-ఒక నౌకాశ్రయం) విధానాన్ని అమలు చేస్తున్నామని, తద్వారా వ్యాపార, వాణిజ్యాలు అత్యంత సులభతరం అవుతాయని తెలిపారు.

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం!

- రైతుల బాగు కోరే ప్రభుత్వం మాది
- రైతుల సంక్షేమంపై 'ఎక్స్'లో సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఏ విషయంలోనూ ఆందోళన చెందొద్దని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని విశ్వసించే ప్రభుత్వం తమదని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తూ ఆయన శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. రైతులకు మద్దతు ధర విషయంలో ఏ సమస్య వచ్చినా ఒకడుగు ముందుకేసి వారికి అండగా నిలుస్తున్నామన్నారు. సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు వర్షాల కారణంగా ఉల్లి ధర తగ్గి రైతులు నష్టపోతుంటే.. వారిని ఆదుకొనేందుకు ప్రతి రైతుకు హెక్టారుకు రూ.50 వేలు చెల్లించాలనే కీలక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. దీని ద్వారా 45 వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేసే రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులు ఉల్లి పంట పూర్తిగా సిద్ధమైన తర్వాత ఆరబెట్టి, గ్రేడింగ్ చేసి వారికి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చని, వారి పంటతో సంబంధం లేకుండానే ఈ-పంట ఆధారంగా హెక్టారుకు రూ.50 వేలు చెల్లిస్తామని తెలిపారు. ఆర్థికంగా ప్రభుత్వంపై భారమైనా.. రైతుల శ్రేయస్సు కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

రైతుకు అండగా కీలక నిర్ణయాలు

'ఇదొక్కటే కాదు.. 15 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు అండగా ఉండే విషయంలో ఎప్పుడూ వేగంగానే స్పందించాం' అని సీఎం చంద్రబాబు ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ కింద రూ.3,200 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, మామిడి రైతులు మద్దతు ధర కోల్పోతే రూ.260 కోట్లు ఇచ్చి ఆదుకున్నామని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ల కారణంగా హెచ్‌డీ పొగాకు ధర పతనమైతే రూ.271 కోట్లు ఖర్చు చేసి వారికి భరోసా కల్పించామని, రూ.14 కోట్లు ఖర్చు చేసి కోకో గింజలకు కిలోకు రూ.50 చెల్లించామని వివరించారు. కాఫీ పంటకు బెర్రీ బోరర్ వ్యాప్తిని అరికట్టేందుకు కేజీ కాఫీకి రూ.50 నష్టపరిహారం ఇచ్చి గిరిజన రైతులకు అండగా నిలిచామని తెలిపారు. టమాటా రైతులు నష్టపోకుండా మద్దతు ధర లభించేలా రూ.12 కోట్ల ఖర్చుతో మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించి ఆదుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో వేశామని, 15 నెలల్లో ధాన్యం కొనుగోలుకు రూ.13,500 కోట్లు ఖర్చు చేశామని చంద్రబాబు వివరించారు. రైతుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 'అన్నదాతలు ఎవరూ ఏ విషయంలోనూ ఆందోళన చెందవద్దు. మెరుగైన సాగు పద్ధతులు పాటిస్తూ.. డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తూ.. ప్రభుత్వ సూచనలు అనుసరిస్తూ.. సాగును లాభదాయకం చేసుకుందాం' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

ఉల్లి రైతుకు బాబు భరోసా: టీడీపీ నేత తిక్కారెడ్డి

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉల్లి ధరలు పతనమై, రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో సీఎం చంద్రబాబు వారి కన్నీళ్లు తుడిచి, ఆర్థిక భరోసా కల్పించారని టీడీపీ సీనియర్ నేత, కర్నూలు జిల్లా పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉల్లి రైతు సాగు చేసిన ప్రతి హెక్టారుకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని, రూ.100 కోట్లకు పైగా భారం పడినా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి ముందుకు సాగుతోందన్నారు. కర్నూలు జిల్లాలో 24,218 మంది రైతులు లబ్ధి పొందనున్నారని అన్నారు. కిలోకు రూ.12 చొప్పున ప్రభుత్వమే ఉల్లి కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తుందన్నారు. సాగునీరు అందించడం ద్వారా రాయలసీమ రైతులను ఆదుకుంటున్నారని పేర్కొన్నారు.





మాచర్లలోని చెరువు వద్ద పేరుకుపోయిన మట్టిదిబ్బలు, చెత్త. దానిని శుభ్రం చేసి, అందంగా రంగవల్లులు తీర్చిదిద్దిన దృశ్యం

రెండు బంగారు కుటుంబాల దత్తత

చంద్రబాబు సమక్షంలో రెండు బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. మాచర్ల 11 వార్డుకు చెందిన బత్తుల నీలావతిని బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. పీ4 కింద దత్తత తీసుకోవడానికి కేసీపీ సంస్థ మార్గదర్శిగా నిలిచింది. మాచర్లకు చెందిన షేక్ నజీరున్‌ను మరో బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. దుర్గికి చెందిన విత్తన కంపెనీ యజమాని యాగంటి వెంకటేశ్వర్లు మార్గదర్శిగా నిలిచారు. ఆ కుటుంబాలకు పింఛన్లు మంజూరు చేయాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. వారి పిల్లలను చదివించాలని మార్గదర్శులకు సూచించారు.

చెత్త రాజకీయాలను ఊడ్చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

సభలో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌ను 2026 జూన్ నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని ఉద్యమంలా అమలు చేస్తామని అన్నారు. స్వచ్ఛాంధ్ర సేవా కార్యక్రమంలో ఐదు కోట్ల మంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ఫ్రీ నినాదాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. పచ్చదనం పెంపులో ప్రతీ పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. మున్సిపల్ శాఖ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి పరిశుభ్రమైన నగరాలు, గ్రామీణ ప్రాంతాల కోసం పనిచేస్తున్నారని అన్నారు. గత పాలకులు వదిలేసి వెళ్లిన 85 లక్షల టన్నుల చెత్తను అక్టోబరు 2వ తేదీ కంటే ముందుగానే 100 శాతం క్లియర్ చేశామని తెలిపారు. ఈ లక్ష్య సాధనలో సమర్థంగా పనిచేసిన పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ శాఖ ఉద్యోగులు, అధికారులు, ఆ శాఖ మంత్రి నారాయణకు అభినందనలు తెలిపారు. "పిల్లలకు, వృద్ధులకు హాస్టళ్లు పెట్టాం. ఇక నుంచి పశువులకు వసతి ఏర్పాటు చేస్తాం. షెడ్లు వేసి పశువులను వాటిలో ఉంచి గ్రాసం అందిస్తాం. ఈ పథకానికి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నాం" అని అన్నారు.


పల్నాడు జిల్లా మాచర్లలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న సీఎం

స్వచ్ఛాంధ్ర అవార్డులు

"సర్క్యులర్ ఎకానమీలో భాగంగా చెత్త నుంచి సంపద సృష్టిస్తాం. చెత్త నుంచి కరెంటు, కంపోస్టు తయారు చేస్తున్నాం. కొంత చెత్తను రీ సైక్లింగ్‌కు పంపిస్తున్నాం. డోర్ టు డోర్ కలెక్షన్ కోసం ఎలక్ట్రికల్ వాహనాలు ప్రవేశపెడుతున్నాం. ఇప్పటికే విశాఖ, గుంటూరులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయి. త్వరలో రాజమండ్రి, నెల్లూరు, కడప, కర్నూలులో కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలి. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ సేవా ప్రచారం నిర్వహిస్తున్నాం. పారిశుధ్య కార్మికుల కోసం ఆరోగ్య, సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. పట్టణ పారిశుధ్య కార్మికులు ఒక్కొక్కరికి రూ.కోటి బీమా పథకాన్ని ప్రారంభించాం. 16 విభాగాల్లో 52 రాష్ట్రస్థాయి, 1,421 జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం చేస్తున్నాం. అక్టోబరు 2వ తేదీన సఫాయి మిత్రులు, అగ్రస్థానంలో నిలిచిన మున్సిపాలిటీలు, స్వచ్ఛ వలంటీర్లను ఆయా జిల్లాల కలెక్టర్లు సత్కరించాలి" అని చంద్రబాబు అన్నారు.

ఆడబిడ్డలకు ఎన్నో కార్యక్రమాలు

"కూటమిని 94 స్ట్రయిక్ రేట్‌తో గెలిపించారు. అది ప్రజలు చూపించిన చొరవ. అభివృద్ధి చేస్తానని చెప్పాను. ఆదాయాన్ని పెంచుతాను. అదే సమయంలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాను. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. ఆడబిడ్డలకు తల్లికి వందనం అమలు చేశాను. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇచ్చాం. గత ప్రభుత్వంలో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు ఇస్తానని మోసం చేసి, ఒక్క పిల్లవాడికే ఇచ్చారు. ఇప్పుడు ఇంటిలో ఏడుగురు పిల్లలు ఉంటే ఆ ఏడుగురికి తల్లికి వందనం వచ్చిందని చెబితే నేను చాలా ఆనందపడ్డాను. జనాభా తగ్గిపోతూ ఉంది. పిల్లలు భారం అనుకుంటున్నారు. అందుకే రూ.15,000 ఇవ్వడమే కాకుండా ఆ పిల్లల పెంపకంలో ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుంది. రాబోయే రోజుల్లో పిల్లలే ఆస్తి. 65 లక్షల మంది పిల్లలకు 10 వేల కోట్ల రూపాయలు డీబీటీ ద్వారా ఇచ్చిన కార్యక్రమం తల్లికి వందనం. ఆడబిడ్డలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాం. మహిళలు పనులకు ఉచితంగా వెళ్లే పరిస్థితి కల్పించాను. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశాం. ఆడబిడ్డ సంరక్షణ పథకాన్ని అమలు చేశాం. మహిళల కోసం అనేక కార్యక్రమాలు ఇచ్చాం. ఉద్యోగాలు, విద్యలో ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చాం. నిన్నటి వరకు 50 శాతానికి పరిమితమైన అభివృద్ధి వంద శాతం సాధించే పరిస్థితి వచ్చిందంటే దానికి ఆడబిడ్డల కృషి ఉంది. మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

పేదలకు ఎంతో సంక్షేమం

"రైతులందరికీ అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తాం. పైసా అవినీతి లేకుండా 16,347 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిది. నైపుణ్యాభివృద్ధి ద్వారా లక్ష మందికి ఉద్యోగాలు ఇచ్చాం. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మరో తొమ్మిది లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. నెలకు రెండు రోజులలో.. ఒకటి స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, రెండోది పేదల సేవలో పాల్గొంటా. కొంత మంది మాటలు చెబుతుంటారు.. ఏమీ అమలు చేయరు. ఎటువంటి చరిత్ర ఉండదు. చరిత్ర రాయాలన్నా.. చరిత్ర తిరిగి రాయాలన్నా నాకే సాధ్యం' అని అన్నారు.

త్వరలో సంజీవని ప్రాజెక్టు

"ప్రజలు మానసిక అనారోగ్యానికి గురవుతున్నారు. యోగా డే ద్వారా 30 రోజులు యోగా శిక్షణ ఇచ్చాం. 3.20 లక్షల మందితో విశాఖలో నిర్వహించిన యోగా రికార్డు సాధించింది. త్వరలోనే సంజీవని ప్రాజెక్టును ప్రారంభిస్తున్నాను. యూనివర్సల్ హెల్త్ తీసుకొస్తాను. దీనిలో ధనిక, పేద తేడా లేకుండా అందరికీ రూ 2.50 లక్షల బీమా చేయిస్తాం. పేదవారి అందరికీ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.25 లక్షల వరకు ఆరోగ్య ఖర్చు ప్రభుత్వం భరిస్తుంది. నాడు హనుమంతుడు సంజీవని ఔషధం తీసుకొచ్చి లక్ష్మణుడిని కాపాడారు. పేదల ఇంటి దగ్గరనే వైద్యం అందించే విధంగా సంజీవనిని అమలు చేయబోతున్నాం. 2047కు ఏపీలో 50 శాతం గ్రీన్ కవర్ ఉండాలన్నదే లక్ష్యం. రానున్న నాలుగేళ్లలో 31 నుంచి 37 శాతానికి గ్రీన్ కవర్ పెంచాలి. స్వచ్ఛమైన గాలి కోసం చెట్లు పెంచే బాధ్యత మనందరిది" అని చంద్రబాబు అన్నారు.

మాచర్లకు చంద్రబాబు వరాలు

"చాలా కాలం తర్వాత మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది. ఎన్నికల ముందు వరకు మాచర్లలో ప్రజాస్వామ్యం లేదు. గతంలో ఇక్కడ చాలా అరాచకాలు జరిగాయి. రాయలసీమలో ముఠాలు లేకుండా చేశాను. పల్నాడులో ఖబడ్దార్ జాగ్రత్తగా ఉండండి.. రౌడీయిజం చేస్తే ఊరుకునేది లేదు. చరిత్రలో నియంతలకు పట్టిన గతే ఇక్కడి నేతలకు పట్టింది. ఇకనైనా ఆ నేతలు పద్ధతులు మార్చుకోకపోతే వారిని ప్రజాస్వామ్యం క్షమించదు. మాచర్లను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం. పల్నాడు జీవనాడి వరికపూడిశెల.. 60 ఏళ్ల చిరకాల కోరికను సఫలీకృతం చేసే బాధ్యత తీసుకుంటాను. 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఇక్కడకు మిరప బోర్డును తీసుకొచ్చే ప్రయత్నం చేస్తా. వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేస్తా. పల్నాటి ఉత్సవాలను ప్రభుత్వ పరంగా నిర్వహిస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు. అంతకుముందు వైద్య శిబిరాన్ని సందర్శించారు. డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.52 కోట్ల విలువైన చెక్కును అందించారు.

ఆరోగ్యశ్రీకి, పీపీపీకి తేడా ఏమిటో జగన్ చెప్పాలి: మంత్రి కొలుసు

నూజివీడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలల ఏర్పాటుపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని మంత్రి కొలుసు పార్థసారథి తిప్పికొట్టారు. 'వైద్య కళాశాలలను పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన వైద్యసేవలు అందించటానికే చంద్రబాబు పీపీపీ పథకాన్ని ఎంచుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి, పీపీపీ పథకానికి తేడా ఏమిటో జగన్ చెప్పాలి' అని అన్నారు.

పీపీపీపై జగన్‌కు మద్దతు లేదు: సత్యకుమార్

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'పీపీపీ విధానంలో కొన్ని వైద్య కళాశాలల అభివృద్ధి, నిర్వహణపై తన వాదనకు తన పార్టీలోనే మద్దతు లేదని గ్రహించిన మాజీ సీఎం జగన్‌కి అభినందనలు' అని మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'జగన్ ఆదేశాల మేరకు వైసీపీ శుక్రవారం చేపట్టిన నిరసన కార్యక్రమాలు విఫలమయ్యాయి. పులివెందుల్లో కూడా జగన్ ఆశించిన మేరకు మద్దతు లేకపోవడం ఆయన వాదనంలోని డొల్లతనాన్ని బహిర్గతం చేసింది. 2023-24తో ప్రారంభమై మూడేళ్లలోనే 2,550 ఎంబీబీఎస్ ప్రవేశాలు కల్పిస్తామన్న మాజీ సీఎం జగన్ పూర్తిగా చేతులెత్తేశారు. అతికష్టంతో 750ప్రవేశాలు మాత్రమే తన హయాంలో చేయగలిగారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించారనే విషయం శుక్రవారం విఫలమైన వారి నిరసన కార్యక్రమం వెల్లడించింది. పీపీపీ విధానంపై చర్చకు రావాలన్న నా ప్రతిపాదనకు మాజీ సీఎం ఇంత వరకూ స్పందించలేదు. అందరినీ కొంతకాలం మోసగించవచ్చు కానీ పూర్తి కాలం మోసగించలేవు జగన్' అని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

బీజేపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోంది

- అండమాన్ నికోబార్ దీవులను అదానీకి అప్పగించారు
- రేషన్ బియ్యం తినడం లేదని 'కార్డు' తొలగింపు సరికాదు
- పార్టీలో 75 ఏళ్ల వయోపరిమితి అమలుపై చర్చిస్తాం: నారాయణ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అభిప్రాయపడ్డారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నేటి నుంచి ఐదు రోజుల పాటు చండీగఢ్‌లో నిర్వహించే సీపీఐ జాతీయ మహాసభలలో పార్టీలో యువత భాగస్వామ్యం పెంపు, బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై చర్చిస్తాం. పార్టీలో 75 ఏళ్ల వయోపరిమితి అమలుపై మహాసభల్లో చర్చిస్తాం. గత పదకొండు ఏళ్లుగా బీజేపీ దేశంలో నీచ రాజకీయాలకు పాల్పడుతోంది. అండమాన్ నికోబార్ దీవులను అదానికి కేంద్రం అప్పగించింది. రేషన్ బియ్యం తినేవారు లేరని కార్డులను తొలగించే ప్రయత్నం జరుగుతుంది. సెల్‌ఫోన్లు ఉంటే ధనవంతుల కింద కేంద్రం లెక్కకడుతోంది. ఫుట్ పాత్‌పై పడుకునేవారూ సెల్‌ఫోన్ వాడుతున్నారు. ఫోన్‌వాడినంత మాత్రాన పేదరికం లేనట్లా?' అని ప్రశ్నించారు.

నాకేం తెలీదు.. కోర్టులో తేల్చుకుంటా

- సిట్ విచారణకు సహకరించని మిథున్
- కేసులో ఇరికించారని సిట్ అధికారులతో వాదన
- ముగిసిన కస్టడీ.. రాజమండ్రి జైలుకు తరలింపు

అమరావతి/విజయవాడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'నాకేం తెలీదు. మీరు పెట్టిందే తప్పుడు కేసు. అన్నీ కోర్టులోనే తేల్చుకుంటా' అని సిట్ విచారణలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అన్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌ను దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు రెండో రోజు శనివారం కూడా ఆయన్ను ప్రశ్నించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు దాటవేసినట్లు సమాచారం. మద్యం పాలసీ రూపకల్పన నుంచి ముడుపుల సేకరణ వరకూ అన్నీ తానై చక్రం తిప్పినట్లు ఆరోపణలున్న మిథున్ రెడ్డి విచారణలో తనకు ఏమీ తెలీదని చెప్పారు. మద్యం కుంభకోణంతో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా కేసులో ఇరికించారని సిట్ అధికారులతో వాదనకు దిగినట్లు సమాచారం. దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్‌లో అత్యంత కీలకమైన నలుగురు నిందితుల్లో ఒకరైన మిథున్ రెడ్డిని కోర్టు అనుమతితో ప్రత్యేక దర్యాప్తు బృందం రెండు రోజుల కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే. శుక్రవారం విజయవాడలోని పోలీస్ కమిషనరేట్‌లో నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. ఉదయం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విజయవాడకు తీసుకొచ్చి 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విచారించారు. తర్వాత రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకెళ్లారు. శనివారం కూడా దాదాపు ఇదే సమయాన్ని పాటించారు. సిట్ అధికారుల విచారణకు మిథున్ రెడ్డి ఏ మాత్రం సహకరించలేదని తెలిసింది. మద్యం పాలసీ రూపకల్పన, ముడుపుల పర్సంటేజీ ఖరారు, ఆటోమెటిక్ మద్యం సరఫరా విధానాన్ని మాన్యువల్‌గా మార్పించడం తదితర అక్రమాలు, అవకతవకలు, అవినీతిపై రెండు రోజుల్లో వంద ప్రశ్నలు సంధించారు. సిట్ అధికారులు ఏది అడిగినా మిథున్ రెడ్డి సూటిగా స్పష్టంగా సమాధానం చెప్పలేదు. 'నాకు సంబంధం లేని వాటిలో నన్ను ఇబ్బంది పెట్టింది మీరే. చెయ్యని, తెలియని విషయాల గురించి అడిగితే నేనేమి సమాధానం చెప్పగలను. నాకేమీ తెలీదు' అంటూ అడ్డంగా వాదించినట్లు తెలిసింది. మద్యం ముడుపుల పర్సెంటేజీని ఎవరి ఆదేశాలతో నిర్ణయించారు? లిక్కర్ పాలసీ రూపకల్పన జరిగిన సమావేశాల్లో మీరెందుకు పాల్గొన్నారు? ఆదాన్ డిస్టిలరీస్ నుంచి మీ పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఖాతాలకు జరిగిన లావాదేవీల సంగతేంటి? అని సిట్ అధికారులు ప్రశ్నించారు. 'మాకు కన్‌స్ట్రక్షన్, ఇతర వ్యాపారాలున్నా లిక్కర్ బిజినెస్ లేదు. ఒక రాజకీయ పార్టీలో ఎంపీగా ఉన్నప్పుడు పలుచోట్లకు వెళ్లడం, పదిమందిని కలవడం అత్యంత సాధారణ విషయం. అలానే నేను కూడా ఎక్కడెక్కడికో వెళతా. ఆ సమయంలో అక్కడ ఎవరు ఎందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నారో నాకెలా తెలుస్తుంది' అని మిథున్ రెడ్డి ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. 'వైసీపీ ప్రభుత్వం రాక ముందు ఉన్న మద్యం సరఫరా ఆటోమెటిక్ విధానాన్ని మాన్యువల్‌గా మార్చేందుకు మొత్తం పాత్ర మీదేనని మా విచారణలో తేలింది' అని అధికారులు అడగ్గా.. 'మీరు ఏది అడిగినా నేను చెప్పేది ఒక్కటే. మీరు చేస్తున్నది తప్పు. మీరు పెట్టిన కేసు తప్పు. నాపై ఇంకెన్ని నిందలు వేస్తారో.. ఎన్ని ఆరోపణలు చేస్తారో మీ ఇష్టం. మీరేమి చేసుకున్నా నేను కోర్టులోనే తేల్చుకుంటా' అని మిథున్ రెడ్డి అన్నట్లు సమాచారం. రెండు రోజుల కస్టడీలో మిథున్ రెడ్డి దేనికీ సూటిగా సమాధానం చెప్పకపోవడంతో ఇదే విషయాన్ని కోర్టుకు వివరించి కస్టడీ మరింత పొడిగించాలని సిట్ అధికారులు కోరే అవకాశం ఉంది. విచారణ ముగిసిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. విచారణలో పోలీసులు ఏమైనా ఇబ్బంది పెట్టారా అని న్యాయాధికారి పి.భాస్కరరావు ఆయనను ప్రశ్నించారు. తనను ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని మిథున్‌రెడ్డి చెప్పారు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుకోవడానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పది నిమిషాల పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు న్యాయాధికారి అనుమతించారు. అనంతరం రాజమండ్రి జైలుకు తరలించారు.


విజయవాడలోని న్యాయస్థానం వద్ద మిథున్ రెడ్డి

ఆఫ్రికా అనుభవంతో ఆంధ్రాలో లిక్కర్ స్కాం

- ఆ దేశాల్లో అనిల్ రెడ్డి మద్యం వ్యాపారం
- జగన్ సోదరుడి ఇళ్లు, ఆఫీసుల్లో కీలక ఆధారాలు
- చెన్నై, మదురై, హైదరాబాద్‌లో ముగిసిన సిట్ సోదాలు
- క్షుణ్ణంగా పరిశీలన అనంతరం తదుపరి చర్యలు

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన వేల కోట్ల మద్యం కుంభకోణంలో రోజు రోజుకు కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఆఫ్రికాలో మద్యం వ్యాపారం చేసి, అక్కడి అనుభవాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అన్న వైఎస్ జగన్‌తో సోదరుడు వైఎస్ అనిల్ రెడ్డి అమలు చేయించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. అనిల్ రెడ్డి నివాసాలు, వ్యాపార సంస్థల్లో ప్రత్యేక దర్యాప్తు బృందాలు చేపట్టిన సోదాలు శనివారం మధ్యాహ్నంతో ముగిశాయి. చెన్నై, మదురై, హైదరాబాద్‌ల్లోని 10 చోట్ల రెండ్రోజుల పాటు జరిపిన తనిఖీల్లో ఏపీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. అనిల్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి జగన్ పెదనాన్న జార్జిరెడ్డి కుమారుడన్న విషయం తెలిసిందే. అన్నకు నమ్మకస్తుడిగా ఉంటూ ఆ అన్న తరఫున ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం, వైసీపీ కోసం నిర్వహించే సర్వేల ఖర్చులన్నీ భరించడం, ఆ పార్టీ అభ్యర్థులకు ఎన్నికల్లో ఫండ్ సమకూర్చడం తదితర వ్యవహారాలన్నీ అనిల్ రెడ్డి చూసేవారని సిట్ సోదాల్లో స్పష్టమైంది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 2019 నుంచి 2024వరకూ మద్యం సరఫరా చేసిన వ్యాపారుల నుంచి తీసుకున్న ముడుపులు అనిల్‌రెడ్డి కంపెనీల్లోకి మళ్లినట్లు సిట్‌కు సమాచారం అందింది. ఆ సమాచారంతో అనిల్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు దేవరాజులును ఇటీవల మూడు రోజుల పాటు ప్రశ్నించింది. చిత్తూరు జిల్లాలోని శాంతిపురం మండలానికి చెందిన దేవరాజులు చెన్నైలో ఉంటూ చాలాకాలంగా అనిల్ రెడ్డి పీఏగా పనిచేస్తున్నాడు. లిక్కర్ కేసు నిందితులైన మిథున్ రెడ్డి(ఏ-4), విజయ సాయిరెడ్డి(ఏ-5), కృష్ణమోహన్ రెడ్డి(ఏ-32), ధనుంజయ్ రెడ్డి(ఏ-31)తో పాటు శాంతిపురం మండలానికి చెందిన బాలాజీ గోవిందప్ప(ఏ-33)తో తరచూ జరిపిన ఫోన్ సంభాషణ వెనుక అనిల్ రెడ్డికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. దీంతో చెన్నై, హైదరాబాద్‌ల్లోని అనిల్ రెడ్డి నివాసాలు, వ్యాపార కేంద్రాలకు సంబంధించి 10 చోట్ల ఏకకాలంలో సిట్ బృందాలు సోదాలు చేశాయి. ఈ కేసులో సిట్ మొదటిసారి జగన్ రెడ్డి రక్త సంబంధీకుడి ఇల్లు, వ్యాపార సంస్థల్లో సోదాలు చేపట్టడం సంచలనం సృష్టించింది. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి చెన్నై, హైదరాబాద్‌లో మొదలైన సోదాలు శనివారం ఉదయం వరకూ కొనసాగాయి. చెన్నైలోని మైలాపూర్, టీ-నగర్, పెరుంగుడిలోని అనిల్ రెడ్డి కంపెనీలతోపాటు ఆళ్వార్‌పేట, ఇజంబాకంలోని ఆయన నివాసాల్లోనూ సిట్ అధికారులు సోదాలు జరిపారు. మదురైలోని అరక్కు కొట్టై ప్రాంతంలోని శ్రీ గోవిందరాజ మిల్స్‌లో శనివారం మధ్యాహ్నం వరకు తనిఖీలు కొనసాగాయి. వైసీపీ పాలనలో అనిల్ రెడ్డి ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ వివరాలు సిట్ సేకరించింది. అనిల్ రెడ్డికి చెందిన మొత్తం ఎనిమిది కంపెనీలు.. సిలోహ్ ఇన్‌ఫ్రా, ఖన్నా ఎగ్జిమ్, సిలోహ్ ఇండస్ట్రీస్, ఫోరెస్ ఇంపెక్స్, ఇండో రాక్స్, వర్క్ ఈజీ స్పేస్, శ్రీ గోవింద రాజ మిల్స్, ట్రాన్సెల్ బయోలాజిక్స్‌లో కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు చెన్నైలోని రెండు నివాసాల్లో వైసీపీకి సంబంధించిన ఆర్థికవ్యవహారాలు, అభ్యర్థులకు పంపిణీ చేసిన డబ్బుల వివరాలు, సర్వే నివేదికలకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి, డిజిటల్ ఆధారాలను ల్యాబ్‌కు పంపి నివేదికలు వచ్చిన తర్వాత ముందుకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.



సభకు రాకపోతే సభ్యత్వాలు రద్దు చేస్తారా?

- ఆ నిబంధన ఎక్కడుందో చెప్పమనండి
- ఎమ్మెల్యేలు, ఎంపీలు... అందరం రాజీనామా చేసేద్దాం
- గైర్హాజరయ్యీ జీతాలు తీసుకుంటున్నామని స్పీకర్ పదేపదే అంటూ కించపరుస్తున్నారు
- మీరు సభకు పోతానంటే నేను ఒద్దన్నానా..!
- మాజీ మంత్రి పెద్దిరెడ్డితో కలసి వెళ్లండి
- ప్రతిపక్షానికి ఎంత సమయం ఇస్తారో తేల్చుకోండి
- వైసీపీఎల్పీ సమావేశంలో జగన్మోహన్‌రెడ్డి



అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'శాసన సభకు రాకపోతే సభ్యత్వాలు రద్దు చేస్తారా? ఏం చేస్తారో చేయమనండి చూద్దాం. 11 ఎమ్మెల్యేలతోపాటు, నలుగురు ఎంపీలూ రాజీనామా చేసేద్దాం' అని మాజీ సీఎం జగన్ అన్నారు. ఈ నెల 18న తాడేపల్లి నివాసంలో ఆయన అధ్యక్షతన వైసీపీఎల్పీ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, శాసన సభ సమావేశాలకు రాకపోతే సభ్యత్వాలు రద్దు చేస్తామంటూ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదేపదే చేస్తున్న ప్రకటనలను ప్రస్తావించారు. దానిపై వైసీపీ అధినేత స్పందించారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు జగన్ స్పందన ఇలా ఉంది. "శాసనసభకు సభ్యులు గైర్హాజరైతే సభ్యత్వాలు రద్దు చేయాలన్న నిబంధన ఎక్కడుంది? 'సభకు రాకుండానే కొందరు సభ్యులు హాజరుపట్టీలో సంతకాలు చేసి జీతాలు తీసుకుంటున్నారు' అంటూ స్పీకర్ అయ్యన్న ఎమ్మెల్యేలను కించపరచేలా పదే పదే అసెంబ్లీలోనూ, బయట మాట్లాడుతున్నారు. శాసనసభకు రాకుండానే సంతకాలు ఎందుకు చేస్తారు? గతంలో చంద్రబాబు అసెంబ్లీకి ఏడాదిన్నరపాటు గైర్హాజరైనప్పుడు జీతభత్యాలు తీసుకోలేదా? ఆరోజు అధికారపక్షానికి శాసనసభ నియమ నిబంధనలు చెప్పేవారు లేరా? చంద్రబాబు బయటకుపోతే పోనీ అనుకున్నాం. 2019కు ముందు నేను పాదయాత్రకు వెళ్లినప్పుడు ఈ చర్చ లేదు. ఎందుకని? ఎమ్మెల్యేలు అసెంబ్లీకి పోతానంటే పోవద్దని నేనేమైనా అన్నానా? సభలో టీడీపీ, జనసేన, బీజేపీ అధికారపక్షంలో ఉన్నాయి. వైసీపీ ఒక్కటే ప్రతిపక్షంలో ఉంది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా ప్రజాసమస్యలపై మాట్లాడేందుకు మీకు ఎంత సమయం ఇస్తారో స్పీకర్‌ను అడగండి. ఒకవేళ ఎవరైనా ఎమ్మెల్యేలు శాసనసభకు వెళ్తానంటే, మాజీ మంత్రి పెద్దిరెడ్డితో కలసి వెళ్లండి. అసెంబ్లీ సమావేశాల తొలిరోజున మీడియాతో మూడు అంశాలపై మాట్లాడేందుకు నాకు మూడు గంటలు పట్టింది. అంత సమయం మాట్లాడేందుకు అవకాశం ఇస్తానంటే అసెంబ్లీకి పోయిరండి' అని ఎమ్మెల్యేలతో జగన్ అన్నారు.

అప్పుల ఊబిలో రాష్ట్రాలు!



దశాబ్దంలో మూడురెట్లు పెరిగిన రుణభారం

▸ రూ.59.60 లక్షల కోట్ల అప్పులతో కుంగుబాటు: కాగ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: దేశంలోని అన్ని రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. గడిచిన దశాబ్దంలోనే రాష్ట్రాల రుణభారం ఏకంగా మూడురెట్లు పెరిగిపోవడంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) ఆందోళన వ్యక్తం చేసింది. కాగ్ తొలిసారి విడుదల చేసిన దశాబ్ద విశ్లేషణ నివేదిక ప్రకారం... 2013-14 ఆర్థిక సంవత్సరం నాటికి దేశంలోని 28 రాష్ట్రాల అప్పులు రూ.17.57 లక్షల కోట్లు ఉండగా, 2022-23 నాటికి ఈ మొత్తం రూ.59.60 లక్షల కోట్లకు చేరింది. అంటే.. పదేళ్లలో 3.3 రెట్లకు పైగా పెరిగింది. ఆయా రాష్ట్రాల బడ్జెట్‌లో ఎక్కువ మొత్తం రుణాల చెల్లింపులు, వడ్డీలకే పోతోంది. జీఎస్డీపీతో పోల్చితే 2013-14లో 16.66 శాతంగా ఉన్న రుణాలు 2022-23 నాటికి దాదాపు 23 శాతానికి పెరిగాయి. ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖ కార్యదర్శుల సమావేశంలో కాగ్ అధిపతి కె.సంజయ్ మూర్తి ఈ వివరాలు విడుదల చేశారు. కొన్ని రాష్ట్రాలు భారీగానూ, మరికొన్ని పరిమితికి లోబడి రుణాలు తీసుకుంటున్నాయి. 2023 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి.. పంజాబ్ అప్పులు-జీఎస్డీపీ నిష్పత్తి అత్యధికంగా 40.35 శాతం నమోదు చేసింది. ఆ తర్వాత స్థానాల్లో నాగాలాండ్ (37.15%), పశ్చిమబెంగాల్ (33.70%) ఉన్నాయి. ఈ నిష్పత్తి తక్కువ నమోదైన రాష్ట్రాలుగా ఒడిసా (8.45%), మహారాష్ట్ర (14.64%), గుజరాత్ (16.37%) నిలిచాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో అన్ని రాష్ట్రాల మొత్తం అప్పు దేశ జీడీపీలో 22.17 శాతానికి సమానమని కాగ్ తెలిపింది. 2023లో ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, కేరళ, బిహార్, తమిళనాడు సహా 11 రాష్ట్రాలు తాము తెచ్చిన రుణాల్లో కొంతభాగాన్ని మూలధన వ్యయానికి బదులుగా రెవెన్యూ లోటు తీర్చడానికి ఖర్చు చేశాయి. ఏపీ, పంజాబ్‌ల్లో మూలధన వ్యయం నికర రుణాల్లో వరుసగా 26 శాతం, 17 శాతంగా మాత్రమే ఉంది. ఇక హిమాచల్‌ప్రదేశ్, హరియాణా ప్రభుత్వాలు సేకరించిన రుణాల్లో సగమే మూలధన ప్రాజెక్టులకు కేటాయించాయి. నిర్వహణ ఖర్చుల కోసం కాకుండా పెట్టుబడుల కోసమే అప్పులు సేకరించాలన్న 'గోల్డెన్ రూల్'ను ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయని కాగ్ నివేదిక వెల్లడించింది.

కేంద్రానిది నిర్బంధ సమాఖ్యవాదం: కాంగ్రెస్

రాష్ట్రాల స్వాతంత్ర్యాన్ని హరించి, వాటిని మున్సిపాలిటీల స్థాయికి తగ్గించడం ద్వారా కేంద్రం నిర్బంధ సమాఖ్యవాదానికి పాల్పడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయంటూ కాగ్ విడుదల చేసిన నివేదికపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. దేశ సమాఖ్య విధానం ఇంతకు ముందెన్నడూ లేనంత ఒత్తిడిలో ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రాల అప్పుల భారం దశాబ్దంలో మూడు రెట్లు పెరిగిందని, ఇప్పుడు జీఎస్టీ సెస్, ఏకపక్ష సుంకాలతో అవి ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న అప్పులు, తగ్గుతున్న ఆదాయాలతో ఈ ప్రమాదం రెట్టింపైందని తెలిపారు. సహకార సమాఖ్యవాదం, అధికార వికేంద్రీకరణకు ముప్పు వాటిల్లుతోందని, రాష్ట్రాల అధికారాలను హస్తగతం చేసుకోవడానికి కేంద్రం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

ఆర్థికంగా బలపడితే.. ఒకే శ్లాబు

▸ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

చెన్నై, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థ బలపడితే జీఎస్టీ శ్లాబులను ఒకటికి తగ్గించే అవకాశముందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మదురైలో తమిళనాడు ఆహార వ్యాపారుల సంఘం వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'జీఎస్టీ పన్ను రేటు నిర్ణయించడంలో అన్ని రాష్ట్రాల పాత్ర ఉంది. కరోనా ప్రభావం కారణంగా దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా జీఎస్టీ సంస్కరణలను తీసుకురావడం ఆలస్యమయింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పన్ను శ్లాబులను నాలుగు నుంచి రెండుకు తగ్గించాం. 378 వస్తువులను 5, 18 శాతం పన్ను పరిమితుల్లోకి తీసుకువచ్చాం. 2017లో 65 లక్షల మంది వ్యాపారులు జీఎస్టీలో చేరితే... ప్రస్తుతం ఆ సంఖ్య 1.51 కోట్లకు చేరింది. ప్రతిపక్షాలు చెబుతున్నట్లుగా జీఎస్టీ ఒక క్రూరమైన పన్ను వ్యవస్థ అయితే, అందులో చేరే వారి సంఖ్య ఎలా పెరుగుతుంది? పన్ను రేటు శ్లాబుల మదింపుతో ఆర్థిక శాఖకు చెల్లిస్తున్న సుమారు రూ.2 లక్షల కోట్లు ఇకపై ప్రజల వద్దనే ఉంటాయి' అని నిర్మల వివరించారు.

జీఎస్టీ ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక ఏర్పాటు

సవరించిన జీఎస్టీ రేట్లకు సంబంధించిన ఫిర్యాదులను రిజిస్టర్ చేయడానికి వీలుగా నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్(ఎన్‌సీహెచ్)కు చెందిన ఇన్‌గ్రామ్ పోర్టల్‌లో ప్రత్యేక కేటగిరీని కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబరు 1915 ద్వారా హిందీ, ఇంగ్లిష్, తెలుగు సహా 17 భాషల్లో తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు.

యూరప్‌లో ప్రధాన ఎయిర్‌పోర్ట్‌లపై సైబర్ దాడి

▸ లండన్, బెర్లిన్ సహా పలుచోట్ల విమానాల రాకపోకల్లో ఆలస్యం

బ్రసెల్స్, సెప్టెంబరు 20 : యూరప్ ఖండంలోని పలు ప్రధాన విమానాశ్రయాలపై శనివారం సైబర్ దాడి జరిగి పలు విమానాల రాకపోకలు ఆలస్యమవడంతోపాటు కొన్ని రద్దయ్యాయి. దీంతో పలు దేశాలకు వెళ్లాల్సిన వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లండన్‌లో హీత్రూ, బెల్జియంలోని బ్రసెల్స్, జర్మనీలోని బెర్లిన్ విమానాశ్రయాలతోపాటు పలు విమానాశ్రయాల చెక్ ఇన్, బోర్డింగ్ సిస్టమ్‌లపై సైబర్ దాడి జరగడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఆటోమేటెడ్ చెక్-ఇన్, బోర్డింగ్ వీలుకాక.. మాన్యువల్ చెక్-ఇన్, బోర్డింగ్ మాత్రమే సాధ్యమైందని, ఫలితంగా విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడిందని బ్రసెల్స్ ఎయిర్‌పోర్ట్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరప్ అంతటా ఈ పరిస్థితి నెలకొందని సమస్య సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. యూరప్‌లో రద్దీగా ఉండే లండన్ హీత్రూ విమానాశ్రయ అధికారులు కూడా సైబర్ దాడిని నిర్ధారించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు ఎయిర్‌లైన్లకు చెక్ ఇన్, బోర్డింగ్ సిస్టమ్‌లు అందించే 'కోలిన్స్ ఏరోస్పేస్' సాంకేతిక సమస్యలు ఎదుర్కోవడంతో ప్రయాణికుల బోర్డింగ్ బాగా ఆలస్యమవుతోందని హీత్రూ ఒక ప్రకటనలో పేర్కొంది. హీత్రూ, బెర్లిన్, బ్రసెల్స్‌లలో మొత్తం 29 విమానాల రాకపోకలు రద్దయ్యాయి. లండన్ హీత్రూ విమానాశ్రయం నుంచి సర్వీసులు నిర్వహించే ఎయిర్ ఇండియా కూడా ఈ సమస్య వల్ల అక్కడి నుంచి ప్రయాణాలు ఆలస్యమవుతాయని 'ఎక్స్'లో తెలియజేసింది. అయితే జర్మనీలో అతి పెద్దది అయిన ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ సమస్య లేదని, ప్రయాణికుల రాకపోకలు సజావుగా సాగుతున్నాయని ఆ ఎయిర్‌పోర్ట్ ప్రతినిధి ఒకరు చెప్పారు. కాగా యూరప్‌లో జరిగిన సైబర్ దాడితో భారత్‌లోని ఎయిర్‌పోర్ట్‌లకు ఎటువంటి ఇబ్బంది లేదని కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

ఏపీ జెన్‌కో ఎండీగా ఎస్.నాగలక్ష్మి

▸ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐజీగా బీఆర్ అంబేడ్కర్

▸ సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌గా అమిలినేని భార్గవ్ తేజ

▸ కృష్ణా జేసీగా ఎం.నవీన్, నెల్లూరుకి ఎం.వెంకటేశ్వర్లు



ఎస్.నాగలక్ష్మి బీఆర్ అంబేడ్కర్, ఎం.నవీన్

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏపీ జెన్‌కో ఎండీగా ఉన్న కేవీఎన్ చక్రధర్‌బాబును బదిలీ చేసిన ప్రభుత్వ పోస్టింగ్ ఇవ్వలేదు. మొన్నటి వరకూ తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా పని చేసి, ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పి.ప్రశాంతిని ఆర్ అండ్ ఆర్ డైరెక్టర్‌గా నియమించింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీగా బీఆర్ అంబేడ్కర్‌ను నియమించారు. ఇప్పటి వరకూ ఎఫ్ఏసీగా ఆ బాధ్యతల్లో ఉన్న జీ వీరపాండియన్‌ను రిలీవ్ చేసింది. ఆయన ఆరోగ్యశాఖ కమిషనర్‌గా కొనసాగనున్నారు. ఎక్సైజ్ డైరెక్టర్‌గా చామకూరి శ్రీధర్‌ను నియమించింది. సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా ఎ.భార్గవ తేజను నియమించి, అక్కడున్న మల్లారపు నవీన్‌ను బదిలీ చేసి కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మొగిలి వెంకటేశ్వర్లకు పోస్టింగ్ ఇచ్చింది. అక్కడ జేసీగా ఉన్న కొల్లాబత్తుల కార్తిని బదిలీ చేసింది. కేవీఐబీ సీఈవోగా కట్టా సింహచలంను నియమించిన ప్రభుత్వం... బీసీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా ఉన్న మల్లిఖార్జున్‌కు ఎఫ్ఏసీ స్థాయిలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఎండ భగభగ.. పిడుగుల వాన

▸ వాతావరణ అనిశ్చితితో క్యుములోనింబస్ మేఘాలు

▸ నేడూ రాష్ట్రంలో పిడుగులు, గాలులతో వర్షాలు



విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అండమాన్ నుంచి మధ్య బంగాళాఖాతం, దక్షిణ కోస్తా, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. ఇదే సమయంలో కోస్తాలో ఎక్కువచోట్ల ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఈ రెండింటి ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని శనివారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల క్యుములోనింబస్ మేఘాలు ఆవరించి తీవ్రస్థాయిలో ఉరుములు, పిడుగులు సంభవించాయి. మధ్యాహ్నం నుంచి పిడుగులు, ఉరుముల తీవ్రత ఎక్కువగా ఉందని హెచ్చరిస్తూ విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఎప్పటికప్పుడు బులెటిన్లు విడుదల చేసింది. పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ జిల్లా రాయభూపాలపట్నంలో 7.4, రౌతులపూడిలో 5.7, నెల్లూరు జిల్లా ఉలవపాడులో 5.2, కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలో 4.9, మలికిపురంలో 4.5, బాపట్లలో 4.5, విజయనగరం జిల్లా తెన్నుబొడ్డవరలో 4.4, అమలాపురంలో 4.4 సెంటీమీటర్ల వాన పడింది. కాగా, కోస్తాలో పలుచోట్ల 35 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మచిలీపట్నంలో గరిష్ఠంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములతోపాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ఆరుబయట ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. కాగా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.